ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ

సంకల్పం - సంరక్షణ

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం

**డా॥ మారెళ్ల శ్రీరామకృష్ణ**

**డా॥ తుమ్మూరి**

**కందర్ప రామచంద్ర రావు**

**కె.బి.సోమయాజులు**

**జి.సత్యవాణి**

**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 5 సంచిక 6**

**సెప్టెంబరు 2004**

తారణ :నిజ శ్రావణం - భాద్రపదం

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**

## ప్రేమయే ప్రార్థన

ప్రార్థన సంగీతం ప్రేమవీణపై వినిపిస్తుంది. ప్రేమ నుండి జనించిన ఆర్ద్రమైన సంవేదనల నుండి ప్రార్థన స్వరం వికసిస్తుంది. ప్రేమ నిండిన పలుకుల కూడిక ప్రార్థన. భావమయుడైన భగవానుడు భావనలతో కూడిన సాంద్రమైన పిలుపును వినకుండా ఉండలేదు. సంవేదనల ఆర్ద్రతయే ఆయనను స్పృశించగలుగుతుంది.

ఆర్ద్రమైన సంవేదనలు, సాంద్రమైన భావనలు, ప్రేమామృతం - వీటిని తనలో రంగరించుకున్న వ్యక్తి జీవితం ప్రార్థనామయం కావడం సహజ పరిణామం.

సూఫీ ఫకీరులలో విస్తృత ప్రచారంలో ఉన్న ఒక సంఘటన ఇందుకు చక్కని ఉదాహరణ.

కాఫిర్లుగా మారారని సూఫీ ఫకీరు నూరీపైన, ఆయన సహచరులైన ఇతర ఫకీరులపైన ఆరోపణ మోపబడింది. ఆ నేరానికై వారందరికీ మరణ శిక్ష విధించబడింది.

మరణ శిక్షను అమలుజరిపే సమయం వచ్చింది. అందుకై జల్లాద్ ఫకీరు విచ్చుకత్తితో నూరీ సహచరుడు ఒకని వద్దకు వచ్చాడు. వెంటనే నూరీ లేచి తన సహచరుని స్థానంలో తనను సమర్పించుకున్నాడు. అలా చేస్తూన్నప్పుడు ఆయన ముఖంలో ఆనందం తాండవించింది. ఆయన స్వరంలో నమ్రత తొణికిసలాడింది. ఈ దృశ్యాన్ని చూచి ప్రేక్షకులు నిర్ఘాంతపోయారు. వేలాది మంది దర్శకులు తెల్లబోయారు.

జల్లాద్ ఆశ్చర్యంతో ఇలా అన్నాడు - "ఓ యువకుడా! కత్తిని కలుసుకోడానికి ఎవ్వరూ ఉత్సుకత చూపరు. ఎవ్వరూ ధైర్యంగా ముందుకు రారు. అయినా, శిక్ష అనుభవించడానికి నీ వంతు ఇలా రాలేదు.''

ఈ మాటలకు ఫకీరు నూరీ చిరునవ్వుతో ఇలా అన్నాడు -

"నాకు ప్రేమయే ప్రార్థన. ప్రపంచంలో అన్నిటికన్నా విలువైనది మనిషి ప్రాణమని నాకు తెలుసు. అయితే, ప్రేమముందు అది దిగదుడుపే. ప్రేమమయుడైన వ్యక్తికి జీవితం మొత్తం ప్రార్థనయే. ప్రార్థనాశీలుడైన వ్యక్తికి కర్తవ్యం ఇదే - కష్టాన్ని ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు అతడు అందరికన్నా ముందుండాలి. సుఖాలూ, సౌకర్యాలూ అందేటప్పుడు అందరికీ వెనుక ఉండడానికి ప్రయత్నించాలి.''

ఫకీరు నూరీ చెప్పిన ఈ మాటలలో ఒక నిత్య సత్యం ఉన్నది - ప్రార్థనకు ప్రత్యేకమైన చట్రం ఏదీ ఉండదు. హృదయం లోతులనుండి సహజంగా అంకురించే దివ్య ప్రవాహం అది. పర్వతాల నుండి సెలయేరు ప్రవహించే విధంగా - ప్రేమమయుడైన వ్యక్తి చేసే ప్రతి కర్మలో ప్రార్థనా స్వరం ధ్వనిస్తుంది.

H H H

**స్వార్థ సంకుచితత్వాలు ఆధ్యాత్మిక దారిద్ర్యానికి లక్షణాలు.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : కృష్ణపరమాత్మ**
**కృష్ణాష్టమి:సెప్టంబరు 6**


1. **సంపాదకీయం :**
   ప్రేమయే ప్రార్థన 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం - 1 :**
   సర్వగుణ పరిపూర్ణుడు ఆయన 4
5. **ముఖచిత్ర కథనం - 2 :**
   శాశ్వత ధర్మ గోప్త శ్రీకృష్ణ పరమాత్మ 6
6. **గాయత్రీ సాధన :**
   వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి విశిష్ట ప్రక్రియలు 8
7. **బోధ కథ :**
   జై సోమనాథ్ 12
8. **భాగవత బోధ :**
   అధర్మ నిర్మూలన అనివార్య ఆవశ్యకత 15
9. **సంస్కృతి సౌరభం :**
   మానవీయతకు ప్రతీక "హిందూ" పదం 19
10. **వ్యక్తి నిర్మాణం :**
    స్వప్రయత్నంలో జీవన సాఫల్యం 22
11. **సాధు సంత్‌ల జీవితాలు :**
    పేదలపాలిటి పెన్నిధి - సెంట్ ఫ్రాన్సిస్ 24
12. **ఆచరణలో జీవన సాధన :**
    శాంతికుంజ్‌లో శిక్షణ శిబిరాలు 26
13. **ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 9**
    భాగవత భూమికి యాత్ర - 2 29
14. **మాతాజీ దివ్య జీవనం : 11**
    వ్యక్తమైన మహాశక్తి మహిమ 33
15. **యుగ గీత :**
    ఏది పాపం, ఏది పుణ్యం 37
16. **కృష్ణావతారం - 22 :**
    భీష్మునికి శాంతి ప్రదానం 39
17. **తత్వ చింతన :**
    సుఖమయ జీవనానికి మూలాధారం - ధర్మం 42
18. **మనం-మన ఆరోగ్యం :**
    నిత్యం మన శరీరంలో కలుస్తూన్న విషాలు 43
19. **వార్తలు :** 45


**నిజాయితీగా సంపాదించి, మంచికోసం ఖర్చుచేస్తేనే ధనానికి సార్థకత.**

# వేద మంత్రం

యే పాయవో మామతేయం తే అగ్నే పశ్యంతో అంధం దురితాదరక్షన్ ।
రరక్షా తాన్సుకృతో విశ్వవేదా దిప్సన్త ఇద్రి పవో నాహ దేభుః ॥

-(ఋగ్వేదం 1/147/3)

**భావార్థం** : పరోపకార, పరమార్థ కార్యములలో నింద, నిషేధం, హేళనలు, భయములకు తా విచ్చరాదు. అటువంటి మనుష్యులను పరమాత్మయే స్వయంగా రక్షిస్తాడు. అందువలన నిశ్చింతులై లోక కళ్యాణ కార్యాలలో నిమగ్నం కావాలి.

**సందేశం** : ఇతరులకు మేలు చేయుటయే పరోపకారం. ఇతరులకు మేలు చేయుటయే మనుష్య ధర్మం. ఇతరులకు ఉపయోగపడుటలోనే మానవ జీవన సార్థకత ఉన్నది. ఆ శక్తి కలిగి ఉండి సహాయం చేయకపోతే అతడు పశువుతో సమానం. ఎవరి కోసం వారు జీవిస్తారు. కానీ ఇతరుల కోసం వారు ఎంతగా జీవిస్తారో దానిని బట్టి వారి జీవితపు ఉత్కృష్టత తెలుస్తుంది. మన ఉనికిని కాపాడుకోవటానికి ఎంతైనా శ్రమిస్తాము. కానీ ఇతరుల కోసం ఎంత శ్రమించామో దానిని బట్టి దివ్యత్వం ప్రకటిత మవుతుంది.

ప్రతి మనుష్యునికి మరొకరి సహకారం అవసరం. సమర్థులలో కెల్లా సమర్థుడైన వ్యక్తికి కూడా ఇతరుల సహకారం ఆశించదగినదే. పారమార్థిక కార్యాల వలన మనుష్య జీవితం శోభిస్తుంది, మహిమ పెరుగుతుంది. నిజమైన పరోపకారి ఎప్పుడూ ప్రసన్న చిత్తంతో ఉంటాడు. ఆంతరంగిక ఆనందాన్ని అనుభవిస్తాడు. దివ్య ప్రకాశాన్ని దర్శిస్తాడు. వ్యక్తి ఎంత పరోపకారి అయితే అంతగా ఈశ్వరుని సామీప్యాన్ని పొందుతాడు. ఏ స్వార్థం లేకుండా ఇతరులకు మేలు చేసేవారు సత్పురుషులు. పరోపకారం కోసం సంకుచిత ఆలోచనలను వదలిపెట్టవలసిన అవసరం ఉన్నది.

పరోపకారం అంటే ఏమిటి? జాగ్రత్తగా పరిశీలిస్తే, దీనికి మూడు స్థితులు ఉన్నాయి. సలహా ఇవ్వడం, కార్యం నెరవేర్చుటలో సహకారం, సహాయం. తమ యోగ్యత, సామర్థ్యం, అనుభవం ఆధారంగా ప్రజలకు సన్మార్గంలో నడిచేందుకు సలహా ఇయ్యాలి. తగిన సమయంలో హితంతో కూడిన సలహా జీవితంలో దీపస్థంభం వలె పనిచేస్తుంది. ఇదేవిధంగా వీలైనప్పుడల్లా ఇతరులకు అన్ని విధాలుగా సహకారం, ఆర్థిక సహాయం ఇచ్చుటలో వెనుకడుగు పనికిరాదు.

పారమార్థిక కార్యం చేయుట అంత తేలికేమీ కాదు. ఈ మార్గంలో అనేకానేక బాధలు ఎదురవుతాయి. అవి మనస్సును చలింప చేసేంతగా ఉండవచ్చు. ఏ పుణ్యకర్మల ప్రభావం చేతనో మన మనస్సులో పరోపకార భావన జాగృతం అవుతుంది. ఆ సందర్భంలో సంకుచిత పరులైన సహచరులు హేళన చేస్తారు, రకరకాల ఆరోపణలు, నిందలు వేసి ఉత్సాహాన్ని నీరు కారుస్తారు. ఈ రోజుల్లో కొంత మంది పరోపకారాన్ని వ్యాపారం చేస్తున్నారు, పరమార్థం ముసుగులో జేబులు నింపుకుంటున్నారు. ఈ స్థితిలో ఒక నిజమైన పరోపకారికి తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవటం కష్టమే అవుతుంది. అన్ని విధాలైన వ్యతిరేకతలను అతడు సహించవలసి వస్తుంది. కానీ అతడు గుర్తుంచుకోవలసింది ఏమంటే - అతని అంతఃకరణలో పవిత్ర సంస్కారాలు ప్రోగుపడతాయి. అవి అతనికి మంచి దారి నేర్పరుస్తాయి. శుభ కార్యాలు చేసేవారికి వినాశనం, దుర్గతి ఉండవు. పరమేశ్వరుడు అన్ని సమయాలలో అన్ని విధాలుగా వారిని రక్షిస్తాడు.

ఎవరో ఏదో అంటారనే చింత లేకుండా కర్తవ్యపాలన చేయండి.

K K K

**ఆత్మపరీక్ష ఆధ్యాత్మిక జీవితానికి కొలబద్ద.**


## ముఖచిత్ర కథనం-1

# సర్వగుణ పరిపూర్ణుడు ఆయన

**- శ్రీకృష్ణునిపై స్వామి వివేకానంద**

నాకు తెలిసిన పురుషు లందరిలో అత్యంత పరిపూర్ణుడు శ్రీకృష్ణుడు. అద్భుతంగా వికసించిన వ్యక్తిత్వం ఆయనది. ఆయన మెదడు, ఆయన హృదయం, ఆయన హస్తం - అన్నీ సమానంగా వికసించాయి.

ఆయన జీవితంలో ప్రతి క్షణం కార్యశూరతతో, జీవంతో, జవంతో పొంగిపొరలింది. సజ్జనుడుగానో, యోధుడుగానో, మంత్రిగానో, మరొకరుగానో ఆయన అనుక్షణం కర్మలో నిమగ్నులు అయినారు. సజ్జనుడుగా ఆయన మహనీయుడు. విద్వాంసుడుగా ఆయన మహనీయుడు. కవిగా ఆయన మహనీయుడు.



అత్యంత పరిపూర్ణమైన, అత్యద్భుతమైన కార్యదీక్షను, మెదడుకూ గుండెకూ అద్భుత సమన్వయాన్ని మీరు భగవద్గీతలో, ఇతర గ్రంథాలలో దర్శిస్తారు. పరమ అద్భుతమైన హృదయం. సర్వాంగ సుందరమై మహిమాన్వితమైన భాష. అలాంటి హృదయం, అలాంటి భాష ఎక్కడా కనిపించవు.

ఆయన కార్యశూరత వేసిన ముద్ర ఇప్పటికీ ఉంది. అయిదువేల సంవత్సరాలు గడిచాయి. ఆయన కోట్లాదిమందిని ప్రభావితం చేశారు. ఈ విశాల విశ్వంపై ఆయన ప్రభావం ఎంత ఉన్నదో ఒక్కసారి ఆలోచించండి. మీకు తెలియవచ్చు, తెలియకపోవచ్చు. అయినా - ఆ ముద్ర, ఆ ప్రభావం సాటిలేనిది.

సర్వసమగ్రమైన ఆయన మానసిక స్థైర్యానికి నా జోహార్లు. ఆ మెదడులో బ్రహ్మముడులు లేవు. సాలెగూళ్లు లేవు. మూఢ నమ్మకాలు అసలే లేవు. ప్రతి వస్తువు ప్రయోజనం ఆయనకు పూర్తిగా తెలుసు. దేనికి ఏ స్థలం కేటాయించాలో నిర్ణయించే తరుణం వచ్చినప్పుడు - ఆయన అక్కడ ప్రత్యక్షం అవుతారు.

శ్రీకృష్ణుడు చేసిన మహత్కార్యం ఇది - ఆయన మన కళ్లకు ఉన్న మసకను తొలగించారు. ఎగువకూ, ముందుకూ కదను త్రొక్కుతూన్న మానవాళిని మరింత విశాల దృష్టితో, మరింత సమగ్ర దృష్టితో చూడడం ఎలాగో మనకు నేర్పా రాయన.

అందరిలో, అన్నింటిలో సత్యాన్ని చూడగలిగే వైశాల్యం ఉన్న తొలి హృదయం ఆయనది.

మనందరి కోసం, మనలో ప్రతి ఒక్కరి కోసం అందాలు చిందించే అమరవాణి వినిపించిన తొలిగొంతు ఆయనది.

ఆయన సందేశంలో మూల సూత్రాలు రెండు -

మొదటిది వివిధ సిద్ధాంతాల సమన్వయం.

రెండవది నిష్కామం.

మతాల చరిత్రలో ఒక బంగారు పుట ఇదిగో -

**ప్రేమకోసం ప్రేమ ।**
**పని కోసం పని ।**
**కర్తవ్యం కోసం కర్తవ్యం ॥**

- ఇదే మహామంత్రం.

ఈ మహామంత్రం తొలిసారిగా పూర్ణావతారం అయిన కృష్ణ పరమాత్మ నోటినుండి వెలువడింది. మానవజాతి చరిత్రలో తొలిసారిగా ఈ గడ్డమీదకు, ఈ భరతవర్షపు భూమిమీదకు

**భయంవల్ల జనించిన అనుశాసనం అస్థిరం.**

దిగివచ్చింది.

భయాన్నీ, ప్రలోభాలనూ బోధించే మతాలు శాశ్వతంగా కనుమరుగు అయినాయి. నరక భయం ఉన్నప్పటికీ, స్వర్గ సుఖాల ప్రలోభం ఉన్నప్పటికీ - భవ్యమైన, దివ్యమైన ఈ ఆదర్శం దిగివచ్చింది - ప్రేమ కోసం ప్రేమ, కర్తవ్యం కోసం కర్తవ్యం, పని కోసం పని.

ఒక మనిషి ఏ ఒక్క దర్శనాన్నీ అధ్యయనం చేయకపోవచ్చు. అతడికి నాడూ నేడూ ఏ దేవుడి మీదా నమ్మకం లేకపోవచ్చు. అతడు జీవితంలో ఒక్కసారి అయినా ప్రార్థన చేసిఉండకపోవచ్చు. అయినా, ఇతరుల కోసం తన జీవితాన్నీ, తన సర్వస్వాన్నీ త్యాగం చేయడానికి సిద్ధమయ్యే స్థాయికి అతడి సత్కర్మలు అతడిని తీసుకువస్తే - భక్తుడు తన ప్రార్థనల ద్వారా, వేదాంతి తన జ్ఞానంద్వారా చేరుకునే చోటుకే అతడు చేరుకుంటాడు. ఈవిధంగా వేదాంతి, కర్మయోగి, భక్తుడు ఒకే స్థలంలో కలుస్తారు. స్వార్థత్యాగమే ఆ స్థలం. మానవ జాతిలో ఎన్నెన్నో తత్వ దర్శనాలు ఉన్నాయి. ఎన్నెన్నో మతాలు ఉన్నాయి. వీటిమధ్య ఎన్నో విభేదాలు ఉన్నాయి. అయినా - తనను ఇతరుల కోసం త్యాగం చేసుకోవడానికి సిద్ధమైన వ్యక్తిముందు మానవాళి భక్తి ప్రపత్తులతో మోకరిల్లుతుంది.

కర్మయోగం ఇలా చెపుతోంది -

వ్యక్తి చేసే కర్మను దాని ఫలం అందేవరకూ ఎవ్వరూ నాశనం చేయలేరు. ప్రకృతిలో ఉన్న ఏ శక్తీ దాని ఫలితాన్ని అడ్డగించ లేదు. నేను ఒక చెడ్డ పని చేస్తే, అందుకు నేను బాధపడక తప్పదు. ఆ బాధను ఆపే శక్తి, దానిని నిలువరించే శక్తి ఈ విశాల విశ్వంలో ఎవ్వరికీ లేదు. అలాగే - నేను ఒక మంచి పని చేస్తే, అది ఫలితాన్ని ఇవ్వకుండా చేసే శక్తి ఈ విశ్వంలో ఎవరికీ లేదు. కర్మకు ఫలం ఉండితీరుతుంది. ఎవ్వరూ దానిని నివారించలేరు, అడ్డుకోలేరు.

కర్మయోగం అంటే ఇదే-

చనిపోయే క్షణంలో సైతం - ప్రశ్నలు అడగకుండా ఇతరులకు సాయపడు. కోటిసార్లు మోసపో. ఒక్క ప్రశ్న అయినా అడగకు. నీవు ఏమి చేస్తున్నావో ఆలోచించకు. ఇతరులకు నీవు చేసే దాన్ని ప్రదర్శించకు. వారి కృతజ్ఞతను ఆశించకు. దానం ఇచ్చే అవకాశం కల్పించినందుకు వారికి కృతజ్ఞుడుగా ఉండు.

కర్మయోగం అంటే ఏమిటి? పనిలోని రహస్యాన్ని తెలుసుకోవడం... కర్మయోగం పనిచేసే శాస్త్రం.

నిర్విరామంగా పని చెయ్యి. కానీ, పనితో బంధాన్ని వదులుకో. దేనితోనూ నిన్ను నీవు మమేకం చేసుకోకు. నీవు చూసేదంతా, దానిలోని బాధలూ, వేదనలూ అన్నీ ఈ ప్రపంచంలో తప్పనిసరిగా ఉండే పరిస్థితులు. పేదరికం, సిరి సంపదలు, సుఖ సంతోషాలు - ఇవన్నీ క్షణికమైనవి. అవి మన నిజ ప్రకృతికి, మన అసలు స్వభావానికి సంబంధించినవి కానే కావు.

దుఃఖం పనివల్ల కలుగదు. బంధనంవల్ల కలుగుతుంది. మనం చేసే పనితో మనం మమేకం కాగానే మనకు దుఃఖం కలుగుతుంది.

ఈ 'నేను, నాది' అన్నదే దుఃఖాలన్నింటికీ మూల కారణం. 'నాది' అనుకోగానే స్వార్థం ఏర్పడుతుంది. స్వార్థం దుఃఖాన్ని తెస్తుంది.

బంధన రాహిత్యం, నిష్కామం అన్నది శారీరికమైనది కాదు. మానసికమైనది.

ఈ బంధనాన్ని తొలగించుకోవడానికి మార్గాలు రెండు-

దేవునిమీద నమ్మకం లేనివారు "నేను బంధన రహితంగా ఉండాలి" - అని తమ మనోబలంతో, తమ వివేక బుద్ధితో దృఢంగా సంకల్పం చేసుకోవాలి.

దేవుని మీద నమ్మకం ఉన్నవారికి మరో మార్గం ఉంది. ఇందులో కష్టం తక్కువ.

వారు తమ పనుల ఫలితాలను భగవంతునికి సమర్పిస్తారు. వారు పని చేస్తారు. ఫలితాలగురించి ఎన్నడూ తాపత్రయపడరు. వారు దేన్ని చూచినా, దేన్ని అనుభవించినా, దేన్ని విన్నా, దేన్ని చేసినా - అన్నీ ఆ భగవంతుని కోసమే. మనం ఏ మంచి పని చేసినా - పొగడ్తకోసం, ప్రయోజనంకోసం చూడకూడదు. అవి భగవంతునివి, ఆ ఫలితాలను ఆ భగవంతునికి అర్పించు.

H H H

**దుర్గుణాల స్థానంలో సద్గుణాలను వికసింపజేసుకో; నీవు నీవే గురువువు అవుతావు.**

# ముఖచిత్ర కథనం - 2

# శాశ్వత ధర్మ గోప్త శ్రీకృష్ణ పరమాత్మ

సముద్రపు లోతును తెలుసుకోవడానికి ప్రయత్నించడం లాంటిదే శ్రీకృష్ణుడి పాత్రను పరామర్శించడం. ఇతడు సర్వధర్మాలకూ మొదలు, సర్వధర్మాలకూ మూదల అని వ్యాసాది మహర్షుల దర్శనం. చూడగలిగినవారికి చూడగలిగినంతగా దర్శనమిచ్చే పరిపూర్ణ పురుషుడు శ్రీకృష్ణుడు.



కృష్ణావతారమే లోకహితార్థం దిగివచ్చింది కాబట్టి కృష్ణుడి జీవితంలో తనకొరకు ఆచరించిన ధర్మమంటూ కనిపించదు. లోకహితార్థమై ఆవశ్యకతనుబట్టి ఇతడినుంచి నాలుగు వర్ణధర్మాలూ ఆయా సందర్భాల్లో వ్యక్తమయ్యాయి. గోవులను లాలించేటప్పుడు ఇతడు శూద్రుడు. గోవులను పాలించేటప్పుడు ఇతడు వైశ్యుడు. ఆర్తులకు ఆశ్రితులకు అభయమిచ్చి రక్షించేటపుడు ఇతడు క్షత్రియుడు. తన ఉపదేశంతో అజ్ఞాన తిమిరాలను హరిస్తున్నప్పుడు ఇతడు బ్రాహ్మణోత్తముడు. పవిత్రమైన ఈ నాలుగు ధర్మాలకూ కృష్ణుడు తన శరీరాన్ని వాహికగా నిలిపాడు. తాను దానికి అతీతంగా ఆవరించి ఉన్నాడు. ఆ వాహికనుంచి లోకానికి ఏ ధర్మం అవసరమైతే ఆ ధర్మం వ్యక్తమవుతూ ఉంటుంది.

తమ స్వధర్మాన్ని లోకహితంగా ఆచరించడానికి సంకల్పించినవారు సాధువులు. స్వధర్మాన్ని విడిచి పరధర్మాన్ని చేపట్టినవారు కాని, లేదా, స్వధర్మాన్ని స్వార్థంకొరకు వినియోగించుకొనేవారు గాని దుష్కృతులు. సాధువులకు రక్షణ ఇచ్చేందుకు, దుష్కృతులకు శిక్షణ ఇచ్చేటందుకు అన్ని కాలాల్లో దిగివస్తూనే ఉంటానని కృష్ణుడు చెప్పాడు. ప్రజలను స్వధర్మంలో సాధువులుగా సమర్థులుగా నిలపడమే ధర్మ సంస్థాపన. దానికొరకే పురాణ పురుషుడు మరలమరల దిగివచ్చేది. ఆ ధర్మ సంస్థాపన ప్రణాళికలో ఇమడని వ్యక్తులు కొంద రుంటారు. లోక శ్రేయస్సుకు కంటకంగా ప్రవర్తించే వారికి వారి ప్రవర్తనకు తగిన శిక్షణ ఇవ్వబడుతుంది. వారు మరీ వినిపించుకోనప్పుడు, వారుండటం లోకానికి ప్రమాదకరమైనప్పుడు శిక్షణలో ఒక భాగంగా వారికి శరీరాలు తొలగింపబడతాయి. అన్యాయం, అక్రమం చేసే వ్యక్తుల్ని పదవులనుంచి తొలగించడం లాంటిదే ఈదేహాల నుంచి తొలగించడం కూడా. కాబట్టే కృష్ణుడు దేహాలను తొలగించడం పెద్ద విశేషం కాదని అర్జునుడికి బోధించాడు. కాకపోతే దేహాలను కోల్పోయేవారి సంఖ్య అక్షౌహిణులలో ఉండటం విశేషమే. కాబట్టే కృష్ణుడంతటి పరిపూర్ణ అవతారం దిగిరావలిసి వచ్చింది.

భారత కాలం ద్వాపర కలి యుగాలకు సంధి. కృష్ణ నిర్యాణంతో కలియుగం ప్రారంభమైంది. చేయవలసిన ధర్మ సంస్థాపనచేసి రాబోయే క్రొత్తయుగానికి సమగ్రమైన ధర్మస్వరూపాన్ని ఉపదేశించడానికే శ్రీకృష్ణుడు దిగివచ్చినట్లు తోస్తుంది. అత డిచ్చిన సందేశమే అంతకు ముందున్న వేదశాస్త్రాలకూ, ఆ తరువాత వెలుస్తున్న వెలవబోతున్న ధర్మ దర్శనాలకు మూదల. కాబట్టే ఏ మహానుభావుడు దిగివచ్చినా భగవద్గీతను ఆశ్రయించి, ఉపాసించి,

**ఇంగితజ్ఞానం అందరికీ ఉంటుంది. కొందరిలోనే స్థిరపడుతుంది.**

ఉపదేశించడం జరుగుతోంది.

భారత కాలం నాటికి స్వధర్మ నిర్వహణకు గమ్యం లోకహితమని తెలసి వర్తించేవారి సంఖ్య తగ్గింది. స్వధర్మ నిర్వహణలో ఒడుదుడుకులు ఎదురైనా తట్టుకొని నిలబడటం ఆవశ్యకమనీ, అలా నిలబడినప్పుడు మాత్రమే ధర్మాద్వైతస్థితి సిద్ధించే అవకాశం ఉన్నదనీ గ్రహించగలిగేవారి సంఖ్య కూడా తగ్గింది. స్వధర్మ నిర్వహణ అర్థార్జన కోసం, కామతృప్తి కోసం అని భావించి స్వధర్మాన్ని తమ అర్థ కామాలను తీర్చే దాసిగా మాత్రమే వినియోగించుకొనే దుష్టుల సంఖ్య పెరిగింది. అర్థ కామాలకు జీవితంలో ప్రథమ స్థానం ఇచ్చినవాడికి తోడివాడితో ఘర్షణ రాకతప్పదు. ఆ ఘర్షణ ప్రతియిద్దరిమధ్యా రగలడం ప్రారంభించి ధర్మగ్లానిని సృష్టించింది. ఆగ్లానినుండి భూమిని రక్షించడంకోసం కృష్ణుడి రాక తప్పనిసరయింది. కృష్ణుడు దిగివచ్చి ధర్మపక్షాన నిలచి అధర్మ పక్షాన్ని అంతమొందించి, శాశ్వతమైన ధర్మాన్ని మరొక్కసారి సామాన్యుడికి కూడా బోధపడే తీరులో ఉపదేశించి, ఆ ఉపదేశానికి ఉదాహరణగా తన జీవితాన్నే అందించి, తన పాదాన్ని బాణానికి అప్పగించాడు. మళ్ళీ వలసినప్పుడల్లా వస్తాననీ, ఇదే సందేశాన్ని ఇస్తాననీ మాట ఇచ్చాడు.

వ్యాసుడు అతడి సందేశాన్ని గ్రంథస్థంచేసి మానవాళికి అందించాడు. ఆ సందేశం అనుభవంలోనికి వచ్చేటందుకు అతడి జీవితంతో ముడిపెట్టుకున్న కౌరవ పాండవ గాథను మహేతిహాసంగా మలచి అందించాడు. అతడి లీలామయ జీవితాన్ని శాశ్వత సృష్టి లీలలో దర్శించి భాగవతంగా గానం చేశాడు. భూమిపైన ఏనాడు ఏనరుడు విషాదంలో పడినా సేదతీర్చి దారిచూపి నడిపేటందుకు గీత దేశ కాలాలకు అతీతంగా నిలబడి తరతరాల మానవుల్ని తరింపజేస్తోంది. దాని వివరణగా భారతం, దాని అనుభూతిగా భాగవతం మానవ జీవితంలో శాశ్వతమైన ఆనందాన్ని పండిస్తున్నాయి. కృష్ణుడు స్వధర్మంలో మానవులను నిలిపి శిక్షణ ఇచ్చేటందుకు నాటినుంచి వ్యాస వాఙ్మయ భవనంనుంచి వ్యక్తమవుతూ మానవాళికి అభయమిస్తూనే ఉన్నాడు.

- డాక్టర్ మోపిదేవి కృష్ణస్వామి

H H H

## ప్రయోగాలన్నీ తనమీదనే

ఇంగ్లండుకు చెందిన ప్రసిద్ధ వైజ్ఞానికుడు డాక్టర్ డాల్టన్ తన ప్రయోగాలన్నిటినీ సాహసంతో తనమీద జరుపుకొని ఒక నిర్ణయానికి వచ్చేవాడు. ఇతర ప్రాణులమీద ప్రయోగాలుచేసి వాటిని బాధించటం మానవత్వానికి విరుద్ధమని అతడు భావించేవాడు. మానవుల ప్రాణం కంటె, జంతువుల ప్రాణం చిన్నది అనే సంకుచితమైన ప్రతిపాదనను ఈయన అంగీకరించేవాడు కాదు. అమోనియం క్లోరైడు వంటి హానికరమైన వస్తువుల ప్రయోగాలు కూడా ఈయన స్వయంగా తన శరీరం మీదనే చేసుకొనేవాడు. టిటనస్ వంటి టీకాలు ఈయన ఈ విధంగా కనుక్కొన్నవే. ఈయన ఎంతో బరువుని చాలా దూరం తానే మోసుకొని వెళ్ళి- అంత మాత్రాన గాని, ఆమాత్రం ప్రయోగాలను స్వయంగా చేసికోవటం వలనగాని మనిషికి ఏమీ హాని జరిగిపోదని నిరూపించాడు.

ఈయన మాంసాహారాన్ని విపరీతంగా విరోధించేవాడు. అందువలన ఈయనను హేళన చేసేవారు ఎక్కువయ్యేరు. ఆయన వాటిని లెక్కచేయక ధార్మిక విలువలకు అలవాలమైన భారతదేశానికి వచ్చివేసి, తన ప్రయోగాలన్నీ ఇక్కడే జరిపాడు. వైజ్ఞానికులలో శిఖరాగ్ర స్థానం ఆయనది. ఇలాంటి వ్యక్తులు సిద్ధులను సునాయాసంగా పొందగలుగుతారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**సత్కార్యాలకు ధనాన్ని వినియోగిస్తే, దానిపట్ల వ్యామోహం నశిస్తుంది.**

గాయత్రీ సాధన

# వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి విశిష్ట ప్రక్రియలు

*(లోకంలో సమస్యలు ఎదుర్కొనని వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. ఆయా వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి గాయత్రీ సాధనలో కొన్ని ప్రత్యేక ప్రక్రియలు ఉన్నాయి. అఖండజ్యోతి 2004 జూన్ సంచికలోని ఒక వ్యాసంలో పేర్కొనబడిన ఆ ప్రక్రియలను దిగువ ఇస్తున్నాం. పాఠకులూ, పరిజనులు వీటిని అనుష్ఠించి ప్రయోజనం పొందుతారని ఆశిస్తున్నాం. ఈ ప్రక్రియ పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా పరిజనులు సమాజంలోని తోటి వ్యక్తులకు మహత్తర సేవ అందించవచ్చుకూడా.)*

ఒకోసారి మనిషిమీద కష్టాలు వచ్చిపడతాయి. వాటినుండి గట్టెక్కడానికి ప్రత్యేకమైన మనోబలం అవసరం అవుతుంది. మనోబలం కొరవడితే మనిషి గాబరాపడతాడు. ఈ గాబరావల్ల మనస్సు అస్తవ్యస్తం అవుతుంది. ఈ అస్తవ్యస్తత కొత్త కొత్త కష్టాలను సృష్టిస్తుంది. కష్టాలు ఒంటరిగా రావు. అవి తమతోపాటు మరిన్ని ప్రమాదాలను తీసుకువస్తాయి. ఫలితంగా మనస్సు వికలం అవుతుంది. ఆ కారణంగా చింత, నిరాశ, నిస్సహాయత వంటి కొత్త కొత్త మానసిక బలహీనతలూ, అసంతులనాలూ కారు మబ్బుల్లా మనిషిని ఆవరిస్తాయి. ఫలితంగా-ఎదుట ఉన్న మామూలు పనిసైతం తలక్రిందులు అవుతుంది. ఉన్న ఆపదలకు కొత్త సంకటాలు వచ్చి చేరతాయి. మనిషి ఆపదల విష వలయంలో చిక్కుకుపోతాడు.

ఆపదలను దాటడానికి మిత్రుల సహాయం అవసరం అవుతుంది. అలాటి విపత్కర పరిస్థితులలో ఆంతరిక సహకారం మరింతగా అవసరం అవుతుంది. మనస్సును నిబ్బరంగా, స్థిరంగా, సంతులితంగా ఉంచుకోవాలి. ఆపదలను ఖచ్చితంగా విశ్లేషించాలి. సరిగా అంచనా వేయాలి. వాటినుండి బయట పడడానికి మార్గాలను దూరదృష్టితో కనుగొనాలి. అలా చేస్తే- ఆ కష్టాలు మనం అనుకున్నంత తీవ్రమైనవి కావని రుజవవుతుంది.

దూరదృష్టితో కూడిన మనోబలాన్ని దైవ సహాయంగా మనం పరిగణించవచ్చు. గాయత్రీ ఉపాసనలో కొన్ని ప్రత్యేకమైన ప్రక్రియలు ఉన్నాయి. అవి ఆధారంగా- ఆయా కష్టాలకు అనుగుణంగా ప్రత్యేకమైన మనోబలం లభిస్తుంది. ప్రత్యేకమైన విజ్ఞత లభిస్తుంది. పర్వతాలవంటి కష్టాలు దూది పింజల్లా, పెనుగాలికి చెదిరిపోయే పల్చటి మబ్బుల్లా తయారవుతాయి.

అలాంటి ప్రక్రియలు, ప్రత్యేక విధి విధానాలు ఇలా ఉన్నాయి-

## 1. రోగ నివారణ

రోగిగా ఏ స్థితిలో ఉండవలసివస్తుందో ఆ స్థితిలోనే మనస్సులో గాయత్రీ మంత్రాన్ని జపించాలి. ఒకసారి మంత్రాన్ని జపించిన తర్వాత రెండవసారి జపించడానికి ముందు ఒక 'బీజమంత్ర' సంపుటిని కూడ దానికి జోడించాలి. చలి ప్రధానమైన (కఫ) రోగాలలో 'ఏం' బీజ మంత్రం, ఉష్ణ ప్రధానమైన రోగాలలో 'ఐం' బీజ మంత్రం అపచ, విషప్రధాన, వాత రోగాలలో 'హూం' బీజమంత్రం ప్రయోగించాలి. రోగం నయం కావడానికై వృషభవాహిని, హరితవస్త్ర (ఆకుపచ్చ వస్త్రాలు ధరించిన) గాయత్రిని ధ్యానం చేయాలి.

ఇతరుల రోగాన్ని నయం చేయడానికి కూడ ఈ బీజ మంత్రాలనే, ఈ ధ్యానాన్నే ప్రయోగించాలి. పైవిధంగా ధ్యానం, జపం చేస్తూ జబ్బుపడిన అవయవాలను చేతితో నిమరాలి. జలాన్ని మంత్రించి దానితో రోగిని రుద్దాలి. ఆ జలాన్ని రోగిపై చల్లాలి. తులసి ఆకుల రసం, మిరియాల పొడి గంగాజలంతో కలిపి ఆ జలాన్ని ఇవ్వాలి. ఈ చికిత్సలు ఏ రోగికయినా ప్రయోజనం కలిగిస్తాయి.

## 2. విష నివారణ

రావిచెట్టు సమిధలతో హవనం చేసి ఆ హవన భస్మాన్ని దాచిఉంచుకోవాలి. మన ముక్కులో ఏ రంధ్రంనుంచి గాలి పీల్చి వదులుతున్నామో (కుడికాని ఎడమకాని) ఆవైపు చేతితో కొద్దిగా భస్మాన్ని ఉంచి, రెండవ చేతితో దాన్ని మంత్రిస్తూ ఉండాలి. మంత్రానికీ, మంత్రానికీ మధ్య 'హూం' బీజమంత్రాన్ని పఠించాలి. రక్తవర్ణం కలిగి అశ్వారూఢ అయిన గాయత్రిని ధ్యానిస్తూ ఆ భస్మాన్ని విషపురుగు కాటువేసిన స్థలంపై 3,4 నిమిషాలు రుద్దాలి. బాధ పోతుంది.

**సత్యాన్ని తెలుసుకోవడం జీవితానికి లక్ష్యం.**

పాము కాటు వేసిన స్థలంపై రక్తచందనంతో చేసిన హవనం భస్మాన్ని రుద్దాలి. మంత్రించిన నేతిని త్రాగించాలి. పసుపు పచ్చ ఆవాలను మంత్రించి, వాటిని నూరి, పది ఇంద్రియాల ద్వారాలపై కొద్దికొద్దిగా రాయాలి. అలా చేస్తే సర్పవిషం దిగుతుంది.

## 3. బుద్ధి వృద్ధి

గాయత్రి ప్రధానంగా బుద్ధిని శుద్ధిచేసే తీక్షణం చేసే, ఉన్నతం చేసే మంత్రం. మందబుద్ధులు, జ్ఞాపకశక్తి తక్కువగా ఉన్నవారు ఈ మంత్రంవల్ల ప్రత్యేకమైన ప్రయోజనం పొందుతారు. పరీక్షలలో తప్పే విద్యార్థులు, పాఠాలు సరిగా జ్ఞాపకం ఉంచుకోలేని విద్యార్థులు క్రిందివిధంగా ఉపాసన చేస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది-

సూర్యోదయ సమయంలో మొదటి కిరణాలు నీటిలో తడిసిన తలపై పడేటట్లు చూడాలి. తూర్పు వైపు ముఖం పెట్టి సగం తెరిచిన కళ్ళతో సూర్యుని దర్శనం చేస్తూ ప్రారంభంలో మూడుసార్లు 'ఓం'ను ఉచ్చరిస్తూ గాయత్రి జపం చేయాలి. కనీసం ఒక మాల (108 మారులు) జపం చేయాలి. నిప్పుపై కాచుకుంటున్న విధంగా-రెండు అరచేతుల చివరలు సూర్యునివైపు ఉంచాలి. ఈ స్థితిలో 12 మారులు గాయత్రీ మంత్రం జపించాలి. ఆ తర్వాత అరచేతులను ముఖం, కళ్ళు, ముక్కు, మెడ, చెవులు, తల మొదలైన శిరోభాగాలన్నింటిపై త్రిప్పాలి.

## 4. రాజకీయ సాఫల్యం

ప్రభుత్వ వ్యవహారాలు, కేసులు, రాజ్యస్వీకృతి, నియామకంవంటి వాటిలో సాఫల్యం కోసం గాయత్రిని ఉపయోగించవచ్చు. అధికారి ఎదుట ఉండవలసిన సమయంలోకాని, విజ్ఞాపన పత్రం వ్రాస్తున్న సమయంలోకాని ఏ ముక్కు రంధ్రంనుండి గాలి పీల్చి వదులుతున్నామో గమనించాలి. కుడివైపు ముక్కు రంధ్రం పనిచేస్తూ ఉంటే-మెదడులో పసుపురంగు జ్యోతిని ధ్యానం చేయాలి. మంత్రంలోని సప్తవ్యాహృతులు పఠిస్తూ (ఓం భూః భువః స్వః మహః జనః తపః సత్యమ్) గాయత్రీ మంత్రాన్ని మనస్సులో జపించాలి. ఏ వైపు ముక్కు రంధ్రం పని చేస్తోందో ఆవైపు అరచేతి గోళ్ళపై దృష్టి నిలపాలి. కరుణామయి అయిన భగవతిని ఆరాధన చేస్తూ, ప్రార్థన చేస్తూ రాజద్వారంలో ప్రవేశించాలి. సాఫల్యం లభిస్తుంది.

## 5. దారిద్ర్య నాశనం

దారిద్ర్యాన్ని నాశనం చేయడానికై గాయత్రిలోని 'శ్రీ' శక్తిని ఉపాసన చేయాలి. ప్రతీసారీ మంత్రం చివరలో 'శ్రీ' బీజమంత్రాన్ని మూడుసార్లు పఠించాలి. సాధన కాలంలో పసుపు రంగు బట్టలు, పసుపు రంగు పువ్వులు, పసుపురంగు యజ్ఞోపవీతం, పసుపురంగు తిలకం, పసుపు రంగు ఆసనం ఉపయోగించాలి. శుక్రవారంనాడు శరీరాన్ని పసుపు కలిపిన నూనెతో మర్దన చేయాలి. ఆదివారంనాడు ఉపవాసం ఉండాలి. పసుపు వస్త్రాలు ధరించిన, ఏనుగుపై అధిరోహించిన గాయత్రీ మాతను ధ్యానం చేయాలి. పసుపు రంగు లక్ష్మికి ప్రతీక, భోజనంలోకూడ ప్రధానంగా పసుపు రంగు పదార్థాలు తీసుకోవాలి. ఇలా సాధన చేయడంవల్ల సంపద వృద్ధి చెందుతుంది. దారిద్ర్యం నాశనం అవుతుంది.

## 6. సత్సంతాన ప్రాప్తి

సంతానం కలగకపోయినా, పిల్లలు పుట్టి చనిపోతున్నా, పిల్లలు రోగులుగా ఉంటున్నా, గర్భస్రావం జరిగినా, ఆడపిల్లలే పుట్టుతున్నా- తల్లి దండ్రులు బాధపడడం సహజం. భగవతి కృపద్వారా ఇలాంటి దుఃఖాలనుండి విముక్తి పొందవచ్చు. ఇలాంటి సాధనలో భార్యాభర్తలు ఇద్దరూ పాల్గొంటే మంచిది. వారిలో ఒకరే బరువంతా తమ భుజాలపై వేసుకుంటే సాఫల్యం పాక్షికంగా ఉంటుంది.

ఉదయం కాలకృత్యాలు ముగించుకుని తూర్పు ముఖంగా సాధనకు కూర్చోవాలి. కళ్ళు మూసుకోవాలి. తెల్లటి వస్త్రాలు, భూషణాలు ధరించి, కిశోర వయస్సుగల, కమలం పువ్వు చేతిలో ఉన్న గాయత్రీ మాతను ధ్యానం చేయాలి. 'యైం' బీజమంత్రం మూడు సంపుటులతో, చందన మాలతో గాయత్రీ జపం చేయాలి.

ముక్కుతో శ్వాస పీల్చి పొత్తి కడుపువరకు దానిని తీసుకువెళ్ళాలి. పొత్తికడుపులో ఎంత గాలి నింపగలిగితే అంత గాలి నింపాలి. ఆ తర్వాత శ్వాసను ఆపి 'యైం' బీజ మంత్రంతో కూడిన గాయత్రిని జపం చేయాలి. కనీసం ఒకసారి, అత్యధికంగా మూడుసార్లు జపం చేయాలి. ఆ తర్వాత నెమ్మది నెమ్మదిగా శ్వాస వదలాలి. ఈ విధంగా పొత్తికడుపులో గాయత్రీ

**మానవ హృదయాన్ని మించిన తీర్థం లేదు.**

శక్తిని ఆకర్షించి ధారణచేసే ఈ ప్రాణాయామాన్ని పదిసార్లు చేయాలి. ఆ తర్వాత పురుషులు తమ వీర్యకోశంలో, స్త్రీలు తమ గర్భాశయంలో తెలుపు రంగు జ్యోతిని ధ్యానం చేయాలి. ఆరోగ్యవంతులు, సుందరులు, తేజోవంతులు, గుణవంతులు, బుద్ధిమంతులు అయిన సంతానం కలగడానికి ఈ సాధన ఉపకరిస్తుంది. సాధన చేస్తున్న రోజులలో ప్రతి ఆదివారం పాలు, పెరుగు మొదలైన తెలుపు పదార్థాలతో భోజనం చేయాలి.

## 7. శతృత్వ సంహారం

ద్వేషం, కలహం, కోర్టుల చుట్టూ తిరగడం, మనస్పర్థలు మున్నగువాటిని తొలగించడం, అత్యాచారం, అన్యాయం, అకారణ ఆక్రమణ మున్నగు మానసిక ప్రవృత్తులను సంహరించడం సమాజంలో శాంతిని నిలిపిఉంచడానికి అవసరం అవుతాయి. ఇందుకోసం నాలుగు 'క్లీం' బీజ మంత్రాల సంపుటితోపాటు రక్తచందన మాలతో పడమర ముఖంగా కూర్చొని గాయత్రీ జపం చేయాలి. జప సమయంలో శిరస్సుమీద యజ్ఞ భస్మం తిలకం ధరించాలి. ఉన్ని ఆసనంపై కూర్చొనాలి. ఎర్రని వస్త్రాలు ధరించి, సింహాన్ని అధిరోహించిన, చేతిలో ఖడ్గం ధరించిన, కరాళ వదనం కలిగిన, దుర్గ రూపం ధరించిన గాయత్రీ మాతను ధ్యానం చేయాలి.

ఏ వ్యక్తుల ద్వేష దుర్భావనలను నివారించవలసి ఉన్నదో వారి పేర్లు రావి ఆకుమీద, చందనం సిరాతో, దానిమ్మ కలంతో వ్రాయాలి. ఈ ఆకును తలక్రిందులు చేసి ఒక్కొక్కసారి మంత్రం జపించిన తర్వాత జలపాత్రనుంచి చిన్న చెంచాతో జలం తీసుకుని ఆ ఆకుమీద జల్లాలి. ఈ విధంగా రోజూ 108 సార్లు మంత్ర జపం చేయాలి. ఇందువల్ల శతృవు స్వభావంలో మార్పు వస్తుంది. అతడి విద్వేష సామర్థ్యం తగ్గిపోతుంది.

## 8. ఇతరులను ప్రభావితం చేయడం

తనకు ప్రతికూలంగా ఉన్న వ్యక్తిని అనుకూలం చేసుకోవడానికి, ఉపేక్షించేవారిలో ప్రేమను జనింపచేయడానికి గాయత్రీ సాధన ద్వారా ఆకర్షణ-క్రియను జరపాలి.

మూడు ఓంకారాలతో గాయత్రీ జపం చేయాలి. తన త్రిపుటి (మెదడు మధ్య భాగం) నుండి నీలవర్ణం కలిగిన ఒక విద్యుత్ జ్యోతి యొక్క తాడులాంటి శక్తి వెలికివచ్చి తాను ఆకర్షించవలసిన వ్యక్తివరకు చేరుతోందనీ, అతడిని నలువైపులా పలుమారులు చుట్టి దగ్గరకు తెస్తున్నదనీ, ఈ విధంగా చుట్టబడిన ఆ వ్యక్తి అర్థ మూర్ఛావస్థలో నెమ్మది నెమ్మదిగా లాగికొనబడి వస్తాడనీ ధ్యానం చేయాలి. ఆకర్షించడంలో ఈ ధ్యానం ఎంతో ప్రభావం చూపుతుంది.

ఒక వ్యక్తి మనస్సులో, మెదడులో ఉన్న అనుచితమైన ఆలోచనలను తొలగించి, మన సముచిత ఆలోచనలను వాటిలో నింపాలంటే ఇలా చేయాలి- శాంత చిత్తుడవై, ఆ వ్యక్తి నీలాకాశంలో ఒంటరిగా నిద్రిస్తున్నట్లు ధ్యానించాలి. అతడి చెడు ఆలోచనలను తొలగించి అతడి మనస్సులో మంచి ఆలోచనలు నిండుతున్నాయని భావన చేయాలి. ఈ ధ్యాన సాధనలో శరీరం పూర్తి వదులుగా (శవాసనంలోవలె) ఉండాలి. నీల వస్త్రాన్ని ధరించాలి.

## 9. దుర్ముహూర్త, దుశ్శాసన పరిహారం

ఒకోసారి ఏదో పని మొదలుపెడతాం. ఎక్కడికో బయలుదేరతాం. చెడు శకునం ఎదురవుతుంది. దుర్ముహూర్తం వస్తుంది. అందువల్ల ముందుకు పోవడానికి సంకోచం కలుగుతుంది. అలాంటి సందర్భాలలో గాయత్రి ఒక మాల జపం చేసి పని ప్రారంభించాలి. ఇందువల్ల అనిష్టాలూ, అనుమానాలూ తొలగిపోతాయి.

### 10. పీడకలల ఫల నాశనం

ఒకోసారి భయంకరమైన కలలు వస్తాయి. ఆ కలలువచ్చే సమయంలో ఎంతో వేదన కలుగుతుంది. మేలుకున్న తర్వాత కూడ ఆ కల గుర్తుకు వచ్చి గుండె ఝల్లుమంటుంది. అలాంటి కలలు వచ్చినప్పుడు-వారం రోజులపాటు రోజూ పదిమాలల గాయత్రీ జపం చేయాలి. భగవతి గాయత్రికి పూజ చేయాలి. గాయత్రీ సహస్రనామం, లేదా గాయత్రీ చాలీసా పఠనం కూడా దుఃస్వప్న ప్రభావాన్ని హరిస్తాయి.

H H H

**ఆత్మిక పవిత్రతయే సిద్ధులకు మూలం.**

# బోధ కథ

# జై సోమనాథ్

"పాటన్ రాజ్య సేనాధిపతి వచ్చి ఉన్నాడు."

ఆ వార్త వినగానే కుమార్ చంద్రచూడ్ ఆశ్చర్యచకితుడు అయినాడు. అతడి ముఖంలో రంగులు మారుతున్నాయి. అతడిలోని కణకణం జాగ్రత్త పడుతోంది. మెలకువ వహిస్తోంది. మరుక్షణంలో అతడు గుర్రం ఎక్కాడు. అతడు తన తమ్ముడు రా బేంగార్‌కు ఆ వార్త పంపాడు. సేనాధిపతి రావచ్చు. సేన రావచ్చు. జయసింహుడే స్వయంగా రావచ్చు. ఎవరైనా పీకి పారవేయడానికి జునాగఢ్ పూరిపాక కాదు. తన తమ్ముడు 'రా' ఈసరికి నలువైపులా దూతలను పంపి ఉంటాడు. పాటన్ పట్టణం సేన ఎక్కడ ఉన్నదనే విషయం దాగదు.

'పాటన్ సేనాధిపతి ఒంటరిగా ఎందుకు వచ్చినట్లు? ఏదైనా సందేశం తీసుకుని వస్తే సరాసరి రావాలి. జునాగఢ్‌ను వదలి ఇక్కడికి ఎందుకు వచ్చాడు? జునాగఢ్‌ను ముట్టడించడానికా? మరి ఒంటరిగా రావడానికి కారణం? ఏది ఏమైనా ఇతడిని పట్టుకుని బంధించడమే మంచిది. ఇతడిని బంధిస్తే జయసింహుని పథకం విచ్ఛిన్నం అయినట్లే.'

కుమార్ గుర్రం పరుగులు తీస్తోంది. అతడి ఆలోచనలు ఇలా పరుగులు తీస్తున్నాయి. నేడు అతడిలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది.

"నల్ల గుర్రంపైన సవారీ చేస్తున్న పాటన్ సేనాధిపతి కేశవ్ ఇక్కడికి వచ్చాడా?"- అని కుమార్ ఒక గ్రామీణుణ్ణి అడిగాడు. కేశవ్ ఇక్కడికే వచ్చి ఉండాలి. ఇక్కడే ఆగి ఉండాలి. ఇక్కడ మంచినీళ్ళు త్రాగకుండా అతడు ముందుకువెళ్ళడం జరగదు. ముందున్నది ఎడారి. కనుక ఈ గ్రామంలో మంచినీళ్ళు తీసుకోకుండా వెళ్ళడం కుదరదు.

"కుమార్ వచ్చాడండి"- అని గ్రామీణుడు ధీర్‌సింగ్ చేతులు జోడించి జవాబు చెప్పాడు.

ధీర్‌సింగ్ మాటలతో కుమార్‌లో నూతన చైతన్యం పెల్లుబికింది. "జై సోమనాథ్!" అని అతడు నినదించాడు. అతడి గుర్రం పరుగుతీసింది. "జై సోమనాథ్!" అంటూ ధీర్‌సింగ్ తన ఒంటె వైపు పరుగెత్తాడు. ఒక్క క్షణంలో అతడు తన కర్తవ్యాన్ని నిర్ణయించుకున్నాడు-తాను కుమార్ వెంట వెళ్ళాలి.

కుమార్ కేశవ్‌ను దూరంనుంచి చూశాడు. ధీర్‌సింగ్ కుమార్‌ను అనుసరిస్తున్నాడు. 'సోమనాథ్ వెళ్ళాలనుకుంటే ఇలా చుట్టుతిరిగి వెళ్ళవలసిన అవసరం లేదే. కుమార్‌కు ఏమీ అర్థంకావడం లేదు. పాటన్ సేనాధిపతి సోమనాథుని దర్శనానికి ఒంటరిగా రావడమా! అది ఊహకందని విషయం. సముద్ర మార్గంలో నౌకలో వెళ్ళవచ్చు. సోమనాథ భగవానుని దర్శించడానికి వచ్చే యాత్రికులను జునాగఢ్‌లో ఎన్నడూ ఎవరూ అడ్డగించలేదు కదా. ముందుగా కబురుచేసి రావడానికి ఇతడికి ఇబ్బంది ఏమిటి?'

'ఈ పాటన్ ప్రజలు జిత్తులమారులు. ఇతడు ఎక్కడికి వెళ్ళదలచుకున్నారో మరి. మనం తన వెంటపడడం కనిపెట్టాడు. ఇటువైపు పోతున్నాడు'- అని కుమార్ తన మనసులో మాట పైకి అన్నాడు.

"ఇప్పుడిక ఎక్కడికి వెళ్ళగలడు" - అని ధీర్‌సింగ్ అన్నాడు. అతడు తన ఒంటెను మరింత వేగంగా దౌడు తీయించాడు.

"అదిగో ఆ గుట్ట కనపబడుతోంది. అది దాటేలోగా మనం అతడిని పట్టుకోవాలి."

వారు కేశవ్‌ను సమీపించారు. ఇక కేశవ్ పట్టుబడడం ఖాయమే. అతడి గుర్రం అలిసిపోయింది. చెమటలు కారుస్తోంది. కుమార్ మరింత దగ్గరకు వెళ్ళి, కుడి చేతితో శూలం తీసుకుని కేకపెట్టాడు- కేశవ్! పాటన్ రాజు సిద్ధరాజ్ జయసింహుని సేనాధిపతికి పారిపోవడం శోభించదు."

"ఈ గుట్ట దాటితే చాలు. గుట్ట ఎక్కు బేటా"- అంటూ కేశవ్ తన గుర్రాన్ని అదిలిస్తున్నాడు. అతడు ఆ కేక వినిపించుకున్నట్లు లేదు. తన గుర్రం తలను చరుస్తున్నాడు.

**పాపికి సాయపడేవాడుకూడ పాపి.**

"జై సోమనాథ్!"

కుమార్ చూస్తూ ఉండిపోయాడు. గుర్రం గుట్ట ఎక్కింది. కేశవ్ గుర్రంమీదనుండి క్రిందకి దూకి, నేలమీద సాగిలపడి సాష్టాంగ ప్రణామం చేశాడు.

"జై సోమనాథ్!"

కుమార్ చేతినుండి శూలం క్రిందపడింది. అతడూ చేతులు జోడించాడు.

"కుమార్!"

ధీర్‌సింగ్ గుట్ట ఎక్కే దారివైపు తన ఒంటెను మళ్ళించాడు. కుమార్‌ను ప్రోత్సహించాడు.

కుమార్ నవ్వుతూ అతడిని వారించాడు. "ధీర్‌సింగ్! నీకు పిచ్చెక్కిందా? ఉత్సాహం ఉరకలు వేయడంతో నీవునీ దేశ సంస్కృతిని మరచిపోతున్నావు. ఆ గుట్ట మీదనుంచి సోమనాథ భగవానుని ధ్వజం దర్శనం అవుతుందని నీవు మరచిపోయావా? ఇప్పుడు తొందర దేనికి? ఇక మనం కేశవ్‌తోపాటు భగవానుని దర్శనం చేసుకుందాం."

"జై సోమనాథ్!"

కేశవ్ గుట్టమీద నిలబడ్డాడు. అతడు స్థిరంగా ధీర్‌సింగ్‌వైపు చూచాడు.

"జై సోమనాథ్!"- అంటూ ధీర్‌సింగ్ చేతులు జోడించాడు. గుట్టమీదనుంచి సోమనాథ ఆలయ శిఖరంపై రెపరెపలాడే ధ్వజంయొక్క దర్శనం అవుతుందని ధీర్‌సింగ్ నిజంగానే మరచిపోయాడు. ఎక్కడవరకు ధ్వజ దర్శనం జరుగుతుందో అక్కడివరకు ఉన్న ప్రదేశమంతా సోమనాథ భగవానునిదే. ఆ స్థలంలో అడుగుపెట్టిన తర్వాత ప్రతి ప్రాణీ నిర్భయుడు అవుతాడు. సేనాధిపతి కేశవ్ ఇపుడు సోమనాథుని క్షేత్రంలో సోమనాథ భగవానుని శరణులో ఉన్నాడు.

"రా కుమార్! ఇంతవరకు వచ్చిన తర్వాత భగవానుని దర్శనం చేసుకోకుండా ఎలా వెళతావు? అయితే నా గుర్రం బాగా అలసిపోయింది." కేశవ్ స్వరంలో స్నేహభావన ఉట్టిపడుతోంది.

"నీతోపాటు మేముకూడా విశ్రాంతి తీసుకుంటాము. అయితే నీవు నిజంగా యాత్రకోసమే బయలుదేరావా?"

"రాజమాత సోమనాథ భగవానుని దర్శనం చేసుకోవాలని అనుకుంటోంది. ఆ సంగతి మీకూ తెలిసి ఉండవచ్చు. సముద్ర మార్గం విషయంలో చూడవలసింది ఏమీ లేదు. ఈ మార్గం పరిస్థితి ప్రస్తుతం ఎలా ఉందో నేను చూచి రావాలని నిర్ణయం జరిగింది."

"సోమనాథ యాత్రికులను మేము సత్కరించి పంపుతాము. ఆ విషయం నీకు తెలుసు కదా." కుమార్ స్వరంలో స్నేహం, కరుణ ఉట్టిపడ్డాయి.

"సేనాధిపతిగా కాక మామూలు యాత్రికునిగా భగవానుని దర్శనం చేసుకోవాలని నేను అనుకున్నాను. రాజవంశం వారికి రాజవంశంవారు సన్మానం చేయడం సముచితమే. ఎవరి దృష్టిలోనూ పడకుండా దర్శనం చేసుకోవాలన్నది నా కోరిక. నా మనసులో మరో కోరిక కూడా ఉంది." కేశవ్ స్వరంలో ఆర్ద్రత పొంగిపొరలింది.

"ఏమిటా కోరిక?" కుమార్ కళ్ళలో ఉత్సుకత కనిపించింది.

"ఆచార్య వసుమిత్ర దర్శనం. నా జీవితాన్ని తీర్చి దిద్దిన శిల్పి ఆయనే. ఆ విషయం నీకూ తెలిసి ఉండవచ్చు. జయసింహ మహారాజును కూడ ఆయన రూపుదిద్దారు..."

కేశవ్ తన మాట పూర్తిచేసే లోపుగానే కుమార్ ఇలా అన్నాడు-

"మిమ్మల్నే కాదు. మా అందరినీకూడ ఆయన మలచారు. మా అందరి జీవితాలనూ ఆయన చక్కదిద్దారు. సోమనాథ భగవానుని వలెనే ఆయన మా అందరికీ ఆరాధ్యులు."

కుమార్ చెప్పిన ఈ మాటలు విన్న కేశవ్ తన గతంలోని ఎన్నెన్నో జ్ఞాపకాలను నెమరువేసుకున్నాడు. అవన్నీ సజీవమై అతడిని చుట్టుముట్టాయి.

ఆచార్య వసుమిత్రుడు ఆ ఆలయానికి పూజారి మాత్రమే కారు. ఆలయం సంరక్షణలో నడుస్తున్న గురుకులానికి ప్రధాన కులపతికూడా. ఆయన ఆధ్వర్యంలో ఆలయం జన జాగరణకు కేంద్రం అయింది. ప్రతిభకు జీవం

**నిర్మల హృదయం భగవానుని నివాసం.**

పోసే కేంద్రం అయింది. ఆయన భావనలలోని అపూర్వమైన నిష్ఠ దేశ విదేశాలలో ఎందరెందరినో ప్రభావితం చేసింది. మహారాజులనుండి సామాన్య ప్రజలవరకు ఎందరెందరి వ్యక్తిత్వాలకో మెరుగులు దిద్దింది. ఆ వ్యక్తిత్వాలను ఉదాత్తం చేసింది. ఫలితంగా ఆయన కీర్తి దశదిశలా వ్యాప్తి చెందింది.

ఎన్నెన్నో జ్ఞాపకాలు, భావ పరంపరలు మనసులలో మెదులుతూ ఉండగా, కేశవ్, కుమార్‌లు ఆలయంలో ప్రవేశించారు. ధీర్‌సింగ్ వీరిని అనుసరించాడు. సోమనాథుణ్ణి దర్శనం చేసుకుని వారు ఆలయంనుండి బయటకు వస్తున్నారు. అదే సమయంలో ఒక మహర్షిలా ఆచార్య వసుమిత్రుడు అక్కడ కానవచ్చారు. ముగ్గురూ వంగి ఆయనకు పాదాభివందనం చేసేలోగా ఆయన వారిని తన హృదయానికి హత్తుకున్నారు. శిశువులవలె వారు ఆయనకు అతుక్కుపోయారు. ఒక్క క్షణంలో ఆచార్యుడు భావనా లోకంనుండి వెలికివచ్చి ఇలా అన్నారు-

"కుమార్! దేవాలయంలోని దేవతను ఆరాధించే వ్యక్తి అంతఃకరణలో దేవత్వం ఉదయించినపుడే అతడి జీవితం సార్థకం అవుతుంది. కేశవ్ సోమనాథ యాత్రకోసం వచ్చిన వ్యక్తి. అతడిని తగువిధంగా సత్కరించు."

ఇలా చెపుతూ ఆయన ముగ్గురి వీపులనూ తట్టి నెమ్మదిగా ఒకవైపుకు వెళ్ళిపోయారు. కుమార్ ధీర్‌సింగ్ చెవిలో ఏదో చెప్పాడు. ధీర్‌సింగ్ వేగంగా అక్కడనుండి వెళ్ళిపోయాడు.

వెళుతూన్న ఆచార్యుడు కనుచూపు మేరలో ఉన్నంతవరకు వారిద్దరూ ఆయనను కనురెప్పలు మూయకుండా చూస్తూ ఉండిపోయారు. ఆతర్వాత ఇద్దరూ తమ వాహనాలు ఎక్కి బయలుదేరారు. వారలా కొద్ది దూరం వెళ్ళారు. ఇంతలో వారికి "జై సోమనాథ్" అనే నినాదం దిక్కులు పిక్కటిల్లేలా వినిపించింది. ధూళి ఆకాశాన్ని అంటుతోంది. ఆ ధూళి మధ్య అక్కడక్కడ విద్యుత్ రేఖలు తళతళ మెరుస్తున్నాయి. ఎంత పెద్ద సేన వస్తున్నదో తెలియడం లేదు.

"జై సోమనాథ్!"

కుమార్, కేశవ్‌లు ఒక్కసారిగా నినదించారు. కేశవ్ ప్రశ్నార్థకంగా కుమార్ వైపు చూచాడు.

"సోమనాథుని దర్శనానికి ఒక బ్రాహ్మణ యాత్రికుడు వచ్చాడు. అతడిని సత్కరించే అవకాశాన్ని జునాగఢ్ 'రా' జారవిడుస్తాడా?"

"రా' బేంగర్ నాకు స్వాగతం ఇస్తాడా?" కేశవ్ విప్పారిన కన్నులతో కుమార్‌వైపు చూస్తున్నాడు.

"జై సోమనాథ్!" కోలాహలం పెరుగుతోంది. ధూళి మరింత పెరుగుతోంది. మరింత దగ్గరయింది. 'రా' యొక్క ఒంటెకు అలంకరించి ఉన్న రత్న ఆభరణాలు ధగధగా మెరుస్తున్నాయి. ఆ ఒంటెకు అలంకరించిన బంగారు నూపురాలు ఘల్లుఘల్లు మంటున్నాయి.

"జై సోమనాథ్!"

అంటూ కుమార్ చంద్రచూడ్ బిగ్గరగా నినదించాడు. తల కొద్దిగా వంచి "రా"పట్ల తన గౌరవాన్ని వ్యక్తపరచాడు.

"రా" యొక్క ఒంటె వచ్చింది. ఏ శత్రువు ఎదుట, ఏ వీరుని ఎదుట, చివరికి మృత్యు దేవత ఎదుట వంగని రత్న మకుటంతో అలంకృతమైన "రా" శిరస్సు "జై సోమనాథ్!" అంటూ వంగింది.

'ఇది సిద్ధరాజు జయసింహుని ప్రధాన సేనాధిపతికి లభించిన గౌరవం కాదు. సోమనాథ భగవానుని ఆరాధకునికి యాత్రికునికి లభించిన గౌరవం. ఆచార్య వసుమిత్రునికి లభించిన గౌరవం. ఆ బ్రహ్మర్షి మాటకు లభించిన గౌరవం'- అని కేశవ్‌కు తెలుసు. అతడి శిరస్సు కూడ వంగింది.

దానితోపాటు- తరతరాలుగా సాగుతూవచ్చిన పటాన్, జునాగఢ్‌ల మధ్య శతృత్వం సమాప్తమయింది. మైత్రితో నిండిన నూతన అధ్యాయం ప్రారంభమయింది.

వాస్తవానికి ఆలయంలోని దేవత తన ఆరాధకుల అంతఃకరణలలో జాగరణ అనే నవ్యజ్యోతిని వెలిగించాడు. వారిలో దేవత్వపు వెలుగు వ్యాపించింది. నూతన సాంస్కృతిక చైతన్యం వెల్లివిరిసింది.

సౌహార్దంతో నిండిన అద్భుత భావానుభూతితో గద్గదమైన స్వరంతో కేశవ్ నినదించాడు-

"జై సోమనాథ్!"

H H H

**మానసిక దౌర్బల్యమే అశాంతికి ముఖ్య కారణం.**

# అధర్మ నిర్మూలన అనివార్య ఆవశ్యకత

## సంహారం ఎందుకు?

ఈ సృష్టిని సంచాలన చేసే సత్తా మూడు ప్రధాన శక్తులద్వారా తన పని చేస్తుంది. బ్రహ్మ, విష్ణుమూర్తి, రుద్రుడు (మహేశ్వరుడు) ఆ శక్తుల పేర్లు. సృజన శక్తి బ్రహ్మ. పాలన శక్తి విష్ణుమూర్తి. సంహారక శక్తి రుద్రుడు. సృష్టిని క్రమబద్ధంగా నడిపించాలంటే ఈ ప్రక్రియలు మూడూ అవసరమే. ఈ ప్రక్రియలు పరస్పర పూరకాలు. సృజన, పాలన మనకు అర్థమయే విషయాలే. మరి సంహారం అవసరం ఏమిటి?

సంహారం జరగనిదే సృజనా జరగదు. పాలనా జరగదు. సంహార శక్తికి మరోపేరు శివుడు. శివం అంటే శుభం, కళ్యాణం. శివుడు రుద్రుడు కదా. అనగా- సంహారం వెనుక శివత్వం దాగి ఉంటుంది.

ఈ సంసారం ద్వంద్వాత్మకం. ఈ ప్రపంచంలో ఎల్లప్పుడూ తమోగుణం సత్వగుణాన్ని కబళించడానికి సిద్ధంగా ఉంటుంది. కనుక-తమోగుణాన్ని ఎదిరించడంకూడ సత్వగుణ స్థాపనలో ఒక అనివార్యమైన అంతర్భాగం.

## "వినాశాయ చ దుష్కృతామ్"

మంచికీ చెడుకూ మధ్య రాజీ అనేది లేదు. మంచి ఉన్న చోట చెడు ఉండలేదు. చెడు ఉన్న చోట మంచి అంత మవుతుంది. కనుక, చెడును అంతం చేయనిదే మంచిని స్థాపించడం సాధ్యం కాదు.

ఈ సృష్టిలో సమతూకాన్ని స్థాపించే సత్తా ఎప్పుడు అవతరించినా, దుష్టత్వాన్ని నాశనం చేయడం దాని ప్రముఖ కార్యాలలో ఒకటి అవుతుంది. "వినాశాయ చ దుష్కృతామ్"- అన్నది ఆ సత్తా ప్రకటించిన దాని కర్యక్రమం. ఎందుకంటే- ఎవరైనా సముచితమైన మాట చెప్పినప్పుడు దుష్టబుద్ధులు కొందరు దాన్ని అర్థం చేసుకోరు. అర్థం చేసుకుని కూడా దుష్ట కార్యాలు కొనసాగిస్తూ ఉంటారు. అలాంటి పరిస్థితిలో సమాజంలో సమతూకాన్ని నిలిపి ఉంచడానికై దండనీతిని, శిక్షా విధానాన్ని, అనుసరించడం తప్పనిసరి అవుతుంది.

## నర పశువులకు దండన తప్పదు

శ్రీకృష్ణుని అన్నగారు బలరాముడు దుర్యోధనునికి గదా యుద్ధంలో శిక్షణ ఇచ్చాడు. ఆ విధంగా అతడికి గురువు అయినా- అధర్మాన్ని వదలవలసిందని ఆయన కౌరవులను కోరినా, వారు ఆయన మాట వినలేదు. అప్పుడు బలరాముడు ఇలా ఆలోచించసాగాడు-

'నిజమే. తమ కులీనత, బల పౌరుషాలు, ధనముల గురించి గర్వించిన దుష్టులు శాంతిని కోరరు. పశువులను దారిలో పెట్టడానికి దండాన్ని ప్రయోగించడం అవసరం. అలాగే, అలాంటి దుష్టులను అణిచే మార్గం పద్ధతి నచ్చచెప్పడం కాదు. దండన విధించడం!'

బలరాముడు దుష్టత్వాన్ని పశుత్వంతో పోల్చాడు. పశువు అంటే అర్థం- పశు ప్రవృత్తులు నడిపించే నర పశువు. సామాజిక నియమాలనూ, కట్టుబాట్లనూ అంగీకరించని నర పశువు.

మీరొక రైతు అనుకోండి. మీరు చెమటోడ్చి పంట పండించారు. ఒక పశువు దాన్ని నాశనం చేస్తోంది. తినివేస్తోంది. మీరు దానికి సిద్ధాంతాలు బోధిస్తారు. చేతులు జోడించి దాన్ని ప్రార్థిస్తారు. నియమాలూ, కట్టుబాట్లూ వల్లిస్తారు. మరి అది వింటుందా? అది మీ పైరును సర్వనాశనం చేస్తుంది. అపుడు మీ పైరును కాపాడుకోవడానికి కర్ర పుచ్చుకోవడం తప్ప మరో మార్గ ఉంటుందా?

కనుకనే, సువ్యవస్థితమైన సమాజ వ్యవస్థలో ఒక విధానంగా దండనను స్వీకరించారు. అయితే దండన చివరి మార్గం. సామ, దాన, భేద ఉపాయాలు విఫలమైన తర్వాతనే దండన ఉపాయాన్ని స్వీకరిస్తారు.

కౌరవుల పక్షమూ, పాండవుల పక్షమూ యుద్ధానికి సన్నాహాలు చేసుకున్నాయి. అనవసరమైన రక్తపాతాన్ని నివారించాలని శ్రీకృష్ణుడు కోరాడు. అందువల్ల శాంతిదూతగా హస్తినాపురం వెళ్లేందుకు సన్నాహం చేస్తూ ఆయన యుధిష్ఠిరునితో ఇలా చెప్పారు-

త్యాగంద్వారా మనం గవ్వలు వదులుకుని వజ్రాలు పొందుతాం.

"అక్కడికి వెళ్ళి, మీ ప్రయోజనాలకు ఏమాత్రం భంగం కలుగకుండా-సంధి కోసం కౌరవులతో మాట్లాడతాను. వారి చేష్టలను కనిపెడతాను. భరతా! కౌరవుల యుద్ధ సన్నాహాల వివరాలు తెలుసుకుని మీ విజయం కోసం ఇక్కడికి తిరిగి వస్తాను."

ఈ ప్రపంచం అందరిదీ. దీని సంపదను కలిసిపంచుకుని అనుభవించే హక్కు అందరికీ ఉంది. కానీ, దుష్టత్వం అన్నింటినీ కబళించాలని చూస్తుంది. తానుతప్ప మరెవరూ బ్రతికి ఉండకూడదని కోరుతుంది. కనుకనే, సమాజ నిర్మాతలు నాలుగు వర్ణాల వ్యవస్థను ఏర్పరచి, అందులో క్షత్రియ వర్ణాన్ని దుష్టత్వాన్ని నిరోధించడంకోసం నిర్మాణం చేశారు. సమాజంలో దుష్టులను అదుపుచేయడం క్షత్రియుల ధర్మం. నిజమైన క్షత్రియులు ఉన్నచోట దుష్టత్వం నిలువజాలదు.

## దుష్ట శిక్షణ క్షత్రియ ధర్మం

క్షత్రియ ధర్మాన్ని వివరిస్తూ కృష్ణ పరమాత్మ యుధిష్ఠిరునితో ఇలా చెపుతారు-

"అతడికి (క్షత్రియునికి) ఈ సనాతన కర్తవ్యాన్ని విధాత విధించాడు- అతడు యుద్ధంలో విజయం పొందాలి. లేదా రణ రంగంలో ప్రాణం వదలాలి. ఇదే క్షత్రియునికి పరమ ధర్మం. దీనత్వంకాని, పిరికితనంకాని అతడికి శోభ ఇవ్వవు. ఈ పనిలో ప్రాణాన్ని త్యాగం చేయవలసివచ్చినా, అతడు మానవ జీవనపు చరమ లక్ష్యాన్ని పొందుతాడు."

ముందుగా తయారుకాకుండా యుద్ధానికి దిగితే ప్రయోజనం ఉండదు. తన బలాన్నీ, శత్రువుబలాన్నీ అంచనా వేసిన తర్వాతనే యుద్ధాన్ని ప్రారంభించాలి. ఏ విధంగా అయినా దుష్టత్వాన్ని నాశనం చేయడమే మన లక్ష్యం కావాలి. నియమం ప్రకారం నడుచుకోనివాడిని సంస్కరించడానికి అమలులో ఉన్న నియమాలు సాయపడవు. దుష్టుల బలహీనతలు ఏమిటి కనిపెట్టి, వాటిమీద దెబ్బకొట్టి అతడి దుష్టత్వాన్ని నాశనం చేయగలుగుతాము.

## వంచకుణ్ణి వంచనతో జయించు

జరాసంధుణ్ణి సంహరించడానికి కృష్ణ పరమాత్మ ఈ విధానాన్నే అవలంబించారు. సింహద్వారంగుండా అతడి రాజధానిలో ప్రవేశించలేదు. కోటగోడ దూకి ప్రవేశించారు. దానికి కారణం తెలుపుతూ ఆయన జరాసంధునితో ఇలా చెప్పారు-

"ధర్మభీరువులు నీతిగా ఉండి అతడి దుష్టత్వానికి సహకరిస్తూ ఉన్నంతవరకు అతడు ఉషారుగా ఉంటాడు. కానీ, తన అవినీతిపై దెబ్బ పడగానే అతడు కస్సుబుస్సుమంటాడు. అయితే, దుష్టత్వాన్ని నాశనం చేయడానికి మరో మార్గం లేనపుడు ఏం చేయాలి. 'శఠే శాఠ్యం సమాచరేత్'. వంచకుని పట్ల వంచనతోనే వ్యవహరించాలి."

కృష్ణ పరమాత్మ ఈ విధానంతోనే దుష్టులను నిర్మూలించారు. ఇతరులు నీతిగా, ధర్మంగా ఉండాలని జరాసంధుడు ఆశిస్తాడు. మరి అతడి ఆచరణ ఎలా ఉంది?

**జరాసంధ వధవెనుక నీతి:** కృష్ణ పరమాత్మ జరాసంధుణ్ణి గురించి యుధిష్ఠిరునితో ఇలా చెప్పారు-

"రాజా! జరాసంధుడు 86 శాతం రాజులను ఖైదు చేశాడు. 16 శాతం మాత్రమే మిగిలారు. వారిని కూడ ఖైదుచేసిన తర్వాత అతడు క్రూర కృత్యానికి ఒడిగడతాడు. అతడు చేసే ఈ పనికి ఆటంకం కల్పించే వ్యక్తి చిర కీర్తిని సంపాదిస్తాడు. జరాసంధుణ్ణి గెలిచే వ్యక్తి సమ్రాట్టు కావడం ఖాయం."

రాజులందరినీ బంధించి నరమేధం చేయాలన్నది జరాసంధుని ఆలోచన. అతడు దానికి ధార్మిక స్వరూపం ఇచ్చాడు. అతడు విస్తారమైన బలాన్ని సంపాదించాడు. కనుక, ఎదుటపడి యుద్ధంచేసి అతిని గెలవడం సాధ్యం కాదు. ఆ పరిస్థితులలో అతడిని అన్యాయాన్ని సాగనివ్వాలా? ధర్మపు ఉనికికే ప్రమాదం ఏర్పడినప్పుడు- ధర్మ రక్షణ కోసం ఏవిధంగా అయినా క్రూరమైన ఆ నర సంహారాన్ని అడ్డుకోవడం అన్నిటినీ మించిన ధర్మం. అన్యాయం చేయడం ఎంత పాపమో, అన్యాయాన్ని సహించడం కూడా అంత పాపం.

జరాసంధుడు తలపెట్టిన ఈ క్రూర కృత్యం సంగతి తెలిసినప్పుడు శ్రీకృష్ణుడు సమాలోచన కోసం సభాసదులను సమావేశపరచారు. ఆ సమావేశంలో ఉద్ధవుడు తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తపరచాడు-

భీముడు బ్రాహ్మణుని వేషంలో వెళ్లాలి. తనతో యుద్ధం చేయమని భిక్ష అడగాలి. భగవాన్! మీ సమక్షంలో భీమునికీ, జరాసంధునికీ మధ్య ద్వంద్వ యుద్ధం జరిగితే భీముడు అతడిని సంహరిస్తారు. అందులో సందేహం లేదు.

ఈ విధంగా సాధ్యమైన ప్రయత్నమంతా చేసి శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి సంహరింపజేశారు.

**నేటి పనిని రేపటికి వాయిదావేయకు.**

ముల్లును ముల్లుతోనే తీయాలి. ఉద్దేశ్యం వేరుగా ఉంటే, పని ఒకేవిధంగా ఉన్నా ఫలితం వేరుగా ఉంటుంది. కాలికి గుచ్చుకున్న ముల్లు ఉద్దేశ్యం శరీరానికి బాధ కలిగించడం. దానిని వెలికి తీయడానికి కాలిలో దిగే ముల్లు ఉద్దేశ్యం శరీరానికి కలిగిన బాధను తొలగించడం. మైత్రి, క్షమ, దయ, ప్రేమ, అహింస వంటివి ఎంతో విలువైనవి. కానీ, తన ఉనికిని కాపాడుకోవడం వీటన్నిటికన్న విలువైనది. ఎందుకంటే- ఉనికి భద్రంగా ఉన్నపుడే ఈ సద్గుణాలను ఆచరణలో పెట్టగలుగుతాము.

ధర్మ స్వరూపం ఏమిటో నిజంగా తెలియకపోవడంవల్లనే మనం పలుమారులు మోసపోయాం. ఫలితంగా వేల సంవత్సరాలు బానిసత్వాన్ని అనుభవించాం. మహత్తర లక్ష్యంకోసం చేసే ప్రతి పనీ సముచితమైనదే.

## సముద్ర మథనం తర్వాత మోహిని పాత్ర

సముద్ర మథనానికి ముందు విష్ణుమూర్తి దేవతలతో ఇలా చెప్పాడు-

''దేవతలారా! ఏదైనా గొప్ప పని చేయాలంటే శత్రువులతోకూడ కలసి పనిచేయాలి. పని పూర్తయిన తర్వాత మాత్రం వారితో పాము-ఎలుక తరహాలో వ్యవహరించవచ్చు.''

సమాజం సర్వతోముఖంగా వికాసం పొందడం, సుఖ శాంతులు సాధించడం-ఇదే ప్రధాన లక్ష్యం. ఇందుకోసమే కృషి చేయాలి. ఈ లక్ష్యానికి అడ్డుతగిలే శక్తులను ఓడించాలి.

సముద్ర మథనంవల్ల అమృతం వెలికివచ్చింది. దానిపై అసురులకుకూడ అధికారం వచ్చింది. అది చూచి భగవానుడు ఇలా ఆలోచించాడు-అసురులు పుట్టుకతోనే క్రూరులు. వీరిచేత అమృతం త్రాగించడం పాముకు పాలు పోయడంవలె అన్యాయం అవుతుంది. కనుక ఆయన మోహిని రూపాన్ని ధరించాడు. అసురులకు అమృతంలో భాగం అందకుండా చేశాడు.

దుష్టత్వాన్ని పోషించడం ప్రమాద భరితం. వ్యక్తిగత జీవితంలో దోషాలు, దుర్గుణాలు, కుటుంబ జీవితంలో వ్యామోహం కారణంగా కుటుంబ సభ్యుల ప్రతి కోరికనూ సమర్థించడం, సామాజిక జీవనంలో దురాచారాలనూ, గ్రుడ్డి నమ్మకాలనూ సహించడం, ఉపేక్షించడం- ఇవన్నీ పాముకు పాలుపోయడం వంటి పనులు. దుష్ట ప్రవృత్తులు ఎక్కడ ఉన్నా వాటిని అణచివేయవలసిందే. అలా చేయకపోతే మన ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది. సత్‌ప్రవృత్తియే, దేవత్వమే, అమరత్వానికి అధికారి. దుష్ట ప్రవృత్తికి, అసురత్వానికి, ఆ అధికారం లేదు.

అసురులు అమృతాన్ని లాగికొన్నపుడు భగవానుడు దేవతలతో ఇలా చెప్పాడు-

"దేవతలారా! మీరు విచారించకండి. నేను నా మాయతో వారిలో వారికి చీలిక తెచ్చి ఇపుడే మీ పని పూర్తి చేస్తాను.''

దుష్టత్వాన్ని ప్రతిఘటించడం దైవ కార్యం. భగవానుడు స్వయంగా ఈ పని చేస్తూ ఉంటాడు. ఈ పనిలో నిమగ్నులైన వ్యక్తులకు సాయపడతాడు కూడా. దుష్టత్వం వేరూని నప్పుడు అది ఎంతో వేగంగా వ్యాపిస్తుంది. అడ్డుకొనకపోతే, అది కొద్దికాలంలోనే అన్నింటినీ మ్రింగివేస్తుంది. మనం సజ్జనత్వానికే ఆశ్రయం ఇవ్వాలి. దుష్టత్వం ఎక్కడ ఉన్నా, దాన్ని ప్రతిఘటించాలి. జీవించు, జీవించనివ్వు- అనే సూత్రం ఆధారంగా ఈ ప్రపంచం నడుస్తోంది. సజ్జనత్వం ఈ సూత్రాన్ని పాటిస్తుంది. కానీ దుష్టత్వం జీవించనివ్వు అనే సూత్రాన్ని పాటించదు. కనుక సమర్థవంతులు సజ్జనత్వాన్ని రక్షించడానికి ముందడుగు వేయాలి. అది వారి కర్తవ్యం.

## రాజు ఒక వ్యవస్థాపకుడు

పృథు మహారాజు పృథివికి రాజు. రాజు పాటించవలసిన కర్తవ్యాన్ని ఇలా వివరించాడు-

రాజు అంటే అర్థం వ్యవస్థాపకుడు. ఏదో ఒక వ్యవస్థ మనకు బాధ్యతగా వస్తుంది. మరేదీ లేకపోయినా- మనం మన శరీరానికీ, కుటుంబానికీ వ్యవస్థాపకులమే కదా. కనుక, మనలో, మన కుటుంబ జీవనంలో జనించే దుష్ట ప్రవృత్తులను దృఢంగా నిర్మూలించాలి. అవినీతి పనులు చేసేవారు ఎవరైనా, మనం ఆ పనులను తప్పక ప్రతిఘటించాలి.

## గురువు అధర్మం చేసినా...

వశిష్ఠుడు నిమిని అకారణంగా శపించాడు. అందుకు నిమి ప్రతీకారం జరిపాడు. శుక మహర్షి పరీక్షిత్తుకు ఇలా చెపుతాడు-

గురువైన వశిష్ఠుడు శాపం ఇవ్వడం ధర్మానికి వ్యతిరేకమని నిమి భావించాడు. కనుక అతడుకూడ శాపం ఇచ్చాడు- 'మీరు ప్రలోభం కారణంగా ధర్మాన్ని నిరాదరించారు. కనుక మీ శరీరం పతనం చెందుగాక.'

వశిష్ఠుడు నిమి మహారాజుకు గురువు. అయినా నిమి ఆయనను వ్యతిరేకించాడు. మనం వ్యక్తులకు బద్ధులం కాము. ధర్మానికి బద్ధులం. రోగం మనకు వచ్చినా ఇతరులకు

**పవిత్రమైన ఆలోచనలు ఆరోగ్యం, బలం, దీర్ఘాయువులకు పునాదిరాళ్లు.**

వచ్చినా-మనం దాన్ని నయం చేయవలసిందే. అలాగే, ఎవరు అధర్మం జరిపినా మనం తప్పక దాన్ని ప్రతిఘటించాలి. భగవంతుని అవతారానికి ఇది ఒక ప్రధాన కర్తవ్యం అవుతుంది.

## దుష్టత్వాన్ని మొగ్గలోనే త్రుంచివేయాలి

కంస వధ తర్వాత అతడి రాణులను ఓదార్చుతూ శ్రీకృష్ణుడు (హరివంశంలో) ఇలా చెపుతారు-

"మసూచి వ్యాధిని అడ్డుకొనకపోతే అది వ్యాపించిపోతుంది. అలాగే, దుష్టత్వాన్ని అడ్డుకొనకపోతే అది సమాజమంతటికీ వ్యాపిస్తుంది. కనుక, చెడు మొదలుకాగానే దాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నించాలి.''

కృష్ణ పరమాత్మ జీవితాంతం ఈ పని చేశారు. తన భక్తులకు ఇందుకు ప్రేరణ ఇచ్చారు.

దుష్టత్వానికి ఒక లక్షణం విచ్చలవిడితనం. విచ్చలవిడిగా వ్యవహరించే వ్యక్తి సమాజానికి ఎంతో దుఃఖం కలిగిస్తాడు. అతడు ధర్మాన్నీ పాటించడు. నియమాన్నీ పాటించడు. అతడు ఎపుడూ తన చిత్తం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు. సమాజంలో విశృంఖలత్వం పెరిగితే మత్స్యన్యాయం అమలు జరుగుతుంది. పెద్ద చేప చిన్న చేపను తింటుంది. బలహీనుల ఉనికి అసాధ్యమైపోతుంది. కనుకనే-నిస్సహాయులనూ, బలహీనులనూ రక్షించడం దురాక్రమణ శక్తులను అదుపులో ఉంచడం బలవంతుల కర్తవ్యం అవుతోంది. మనం ఇతరులను అదుపు చేస్తూ ఉంటాం. మనం కుటుంబంలోని వ్యక్తులు, సహచరులు, మిత్రులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తే మౌన దర్శకులుగా మిగిలిపోతాం. వారికి సమర్థకులం అయిపోతాం. సంకోచం, వ్యామోహం మనచేత ఇలా ప్రవర్తింపజేస్తాయి. ఇది సముచితమా? అధర్మం చేసేవాడు ఎవడైనా, అతడిని అదుపుచేయవలసిందే.

## తన యదువంశానికీ శిక్ష

గోలోకానికి తిరిగిరావలసిందని బ్రహ్మదేవుడు ప్రార్థించినపుడు శ్రీకృష్ణుడు ఆయనతో ఇలా చెప్పాడు-

''ఇంకా ఒక పని మిగిలి ఉంది. ఆ పని ఇది-యదువంశంవారు బలం, విక్రమం, వీరతవం, శూరత్వం, సిరిసంపదల గర్వంతో ఉన్మాదులు అవుతున్నారు. పృథివి మొత్తాన్ని కబళించడానికి వారు సిద్ధమైనారు. చెలియలికట్ట సముద్రాన్ని అడ్డుకునే విధంగా నేను వారిని అడ్డుకున్నాను గర్విష్టులూ, విశృంఖల విహారులూ అయిన విశాలమైన యదువంశీయుల వంశాన్ని నాశనం చేయకుండా నేను గోలోకానికి తిరిగివస్తే-వీరు కట్టుబాట్లు అన్నింటినీ త్రెంచుకుని లోకాలన్నింటినీ సర్వనాశనం చేస్తారు.''

కనుక, దుష్టత్వానికై ఇతరులను దండించిన విధంగానే భగవానుడు తన వంశంవారిని కూడ సంహరింపజేశారు. నిజమైన క్షత్రియత్వం ఇదే. కృష్ణ పరమాత్మ జీవితమంతా ఈ పనే చేశారు. దానివెనుక ఆయన దుర్భావన కాక సద్భావనయే దాగిఉంది. తన వ్యక్తిగత స్వార్థాన్ని సాధించడానికి కాక, లోక కళ్యాణంకోసమే ఆయన అలా చేశారు.

దేశం మొత్తంలో అందరికన్నా బలశాలి అయి ఉండి కూడ ఆయన రాజుగా ఉండడానికి ఎన్నడూ అంగీకరించలేదు. నూటికి నూరుపాళ్లు కర్మయోగిగా నిరంతరం దుష్ట సంహారం అనే పవిత్ర కార్యంలో నిమగ్నం అయినారు.

## సంఘర్షణ రోగితో కాదు, రోగంతో

శస్త్ర చికిత్స పూర్తికాగానే వైద్యుడు తన పరికరాలను ప్రక్కనపెట్టి, మందు వేసి పట్టీచుట్టడానికీ, రోగి తిరిగి కోలుకోవడానికీ అవసరమయ్యే ఇతర సామాగ్రిని సమీకరించడంలో నిమగ్నం అవుతాడు. అలాగే-కృష్ణ పరమాత్మ ఎన్నడూ అనవసరంగా రక్తపాతం జరపలేదు. సంఘర్షణ ఏమేరకు అవసరమో ఆ మేరకే జరిపారు. జరిపించారు. నిరంతరం తన సహచరులకు అలాంటి ప్రేరణ ఇస్తూ వచ్చారు.

కనుక, శ్రీకృష్ణుని అనుచరులమూ, భక్తులమూ అని చెప్పుకునేవారి కర్తవ్యం ఆయన చూపి బాటను అక్షరాలా అనుసరించడం. నేడు మన లోపలా బయటా అన్నిరకాల దుష్ట ప్రవృత్తులూ, విజృంభిస్తున్నాయి. వీటినుండి విముక్తి పొందడానికి సంఘర్షణ తప్ప మరో దారి లేదు.

అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. మన సంఘర్షణ రోగితో కాదు, రోగంతో. అసురుడు నేడు ప్రతి శరీరాన్నీ, ప్రతి మనస్సును తన స్థావరంగా చేసుకున్నాడు. మన సంఘర్షణ అతడితోనే జరగాలి. అది మనతోనే ప్రారంభం కావాలి.

కదలిరండి! పవిత్రమైన ఈ దైవ కార్యంలో శౌర్యంతో, సాహసంతోకూడిన మీ సహకారాన్ని అందించండి. సుఖప్రదమూ, సుందరమూ అయిన సమాజాన్ని నిర్మించడంలో నిమగ్నులు కండి.

„ HHH

**మనిషి శీలానికి గీటురాయి పరోపకారం.**

సంస్కృతి సౌరభం

# మానవీయతకు ప్రతీక "హిందూ" పదం

'హిందూ' అనే పదంలో మానవతా ధర్మం నిండి ఉంది. లెక్కలేనన్ని మానవతా భావనలు దాగి ఉన్నాయి. శతాబ్దాలపాటు ఉదారత, సహనశీలతలకు పర్యాయ పదంగా ఉన్న ఈ పదాన్ని కొంతమంది అనాలోచితంగా వివాస్పదం చేశారు. వేదాలు, ఉపనిషత్తులు, ప్రాచీన సంస్కృత, పాళీ భాషలలో దీని గురించిన చర్చ లభించదు. అలాగని ఈ పదంలో ఉన్న భావనలు ఆ రోజులలో లేవని కాదు. ఆ సమయంలో ఈ భావాలను 'ఆర్య' అనే పదంతో వ్యక్తీకరించేవారు. 'ఆర్య' అన్న పదం శ్రేష్ఠమైన మానవీయతకు దృఢమైన కొలబద్ద. అప్పటినుండి భారతీయ జన జీవనం విభిన్న సంస్కృతులను, భాషలను తనలో ఇముడ్చుకుంటూ వచ్చింది. ఇంకో విధంగా చెప్పాలంటే - వివిధ సంస్కృతులు భారతీయ శ్రేష్ఠత్వంతో కలుస్తూ వచ్చాయి. శ్రేష్ఠ పురుషులు, సంస్కారవంతుల నివాసమైన మన దేశం అజనామ వర్షము, ఆర్యావర్తము, భారతవర్షము అని పిలువబడుతూ హిందుస్థాన్‌గా పిలువబడడం ప్రారంభమైంది. ఇక్కడ నివసించే వారిని ఆర్యులు, భారతీయులు, హిందువులు అని పిలిచేవారు.

పండిత జవహర్‌లాల్ నెహ్రూ తన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' పుస్తకంలో మన ప్రాచీన సాహిత్యంలో 'హిందూ' అన్న పదం ఎక్కడా కనిపించదు అని పేర్కొంటూనే హిందూత్వంలో నిండి ఉన్న భావాలను విరోధించేవారు కారు. మానవీయ శ్రేష్ఠత్వానికి కొలబద్ద అయిన ఈ పదాన్ని ఎవరు విరోధించగలరు? ఉదారత, సహనశీలతలతో నిండి, సమస్త విశ్వానికి తన ప్రేమను పంచి ఇచ్చే హిందూత్వం పట్ల అందరి శిరస్సులు సహజంగానే వంగి తీరుతాయి.

ఈ పదం మొదటిసారిగా ఎనిమిదవ శతాబ్దానికి చెందిన 'మేరు తంత్రం' అన్న గ్రంథంలో ప్రయోగించబడింది. ఇందులో కూడ 'హిందూ' అనే పదాన్ని ఏదో ఒక మత విశేషంగా తీసుకోలేదు. ఈ గ్రంథం 33వ అధ్యాయంలో ఇలా వ్రాసి ఉంది- "శక, హూణాది క్రూర జాతుల ఆటంకం వ్యాపిస్తుంది. కాబట్టి వారి క్రూరత్వాన్నుండి మానవత్వాన్ని రక్షించేవారే "హిందువులు".మేరు తంత్రమే కాక భవిష్య పురాణం, మోదినీకోశం, హేమంతకోసీ కోశం, బ్రాహస్పత్య శాస్త్రం, రామ కోశం, కాళికా పురాణం, శబ్దకల్పద్రుమ, అద్భుత రూపకోశం మొదలైన సంస్కృత గ్రంథాలలో ఈ పద ప్రయోగం లభిస్తుంది. ఈ గ్రంథాలన్నీ పదవ శతాబ్దం ప్రాంతానికి చెందినవిగా చెప్పబడుతోంది.

చరిత్రకారులు, అన్వేషకులలో ఒక పెద్ద వర్గం హిందూ పదానికి ప్రేరణ సింధునది అని అంగీకరిస్తోంది. సింధునది కారణంగానే గ్రీకు దేశస్థులు ఈ ప్రాంతవాసులను 'ఇన్దవాయి' అన్నారు. అదే తరువాత ఇండియన్‌గా మారింది. పండిత నెహ్రూ అభిప్రాయం ప్రకారం 'హిందు' పదం 'సింధు' నుండి వచ్చినది. ఇదే దీని పురాతన, నూతన నామం. ఈ 'సింధు' పదం నుండే హిందు, హిందుస్థాన్‌లేగాక ఇండస్, ఇండియా కూడ ఆవిర్భవించాయి. ఋగ్వేదంలో 'సింధు' పదం దాదాపు రెండు వందల చోట్ల ఉపయోగించబడింది. డా॥ వి.డి.సావర్కర్ తన పుస్తకం 'సెలెక్ట్ ఇన్‌స్క్రిప్షన్స్'లో ఇలా వ్రాశారు- 'సింధు నదికి తూర్పు, పశ్చిమ దిక్కుల మధ్యలో ఉన్న ప్రాంతాన్నీ, ప్రజలను 'పర్షియా' అనగా ప్రస్తుత ఇరాన్ శాసకులను జిరస్, దారా హిందు అని పిలిచేవారు.' ఆచార్య పాణిని 'అష్టాధ్యాయి'లో సింధు సింధూదేశంలో నివసించే జాతి అని వ్రాశారు.

సమకాలీన చరిత్రకారులు, అన్వేషకులు, శిక్షణా శాస్త్రవేత్తలు 'హిందూ' పదాన్ని పర్షియా భాషా పదంగా భావిస్తారు. పర్షియా భాషలో హిందూ, దానితో తయారైన అనేక పదాలు లభిస్తాయి. హిందువీ, హిందనియా, హిందుతనా, హిందూకుశ్, హిందీ మొదలైన పర్షియా పదాలలో ఈ మెరుపు చూడవచ్చు. పర్షియాకు తూర్పున భారత దేశమే నిజానికి హిందూదేశము. తూర్పు దిక్కులో సింధు నదిలో కలిసే మూడు నదులు జీలం, రావి, సట్లెజ్. పశ్చిమ దిక్కున కూడ మూడు నదులు దీనిలో కలుస్తాయి. అవి- సువాస్తు, కుంభార్కారా (కాబూల్), గోమల్ (గోమతి). ఈ విశిష్ట ధారలతో, సింధునది నీటితో తడిచే ప్రదేశం పేరు సప్తసింధు లేదా హప్తహిందు.

ప్రస్తుత భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌లు

**దివ్య జ్ఞానంకన్న దివ్య జీవనం మిన్న.**

ఈ ప్రాంత భాగాలే. పర్షియా అక్షరమాల నియమానుసారం సంస్కృత అక్షరం 'స' పర్షియా (పార్శీ) భాషలో 'హ'గా రూపాంతరం చెందుతుంది. ఈ కారణంగానే 'సింధు' పదం 'హిందు'గా మారింది. కాలాంతరాన దీని నుండి హిందూ లేదా హైందవ పదం ప్రయోగించబడింది. హిందూ పదం జెందావేస్తా, ధన్ దా వేస్తా లాంటి ప్రాచీన పర్షియా ధార్మిక గ్రంథాలలో ప్రప్రథమంగా లభించింది. ఒక పార్శీ గ్రంథం 'శీతర్'లోని 113వ శ్లోకంలో 'హిందూ' పదం లభిస్తుంది. ఇందులో వ్యాస మహర్షి గుస్తాశిస సమ్రాట్టుకు తన పరిచయాన్ని తెలియజేస్తూ 'హింద్'లో జన్మించినట్లుగా చెబుతారు. సంస్కృతం, పార్శీ భాషలేకాకుండా అనేక గ్రంథాలలో 'హింద్', 'హిందూ' పదాల ప్రయోగం జరిగింది.

శ్రీ వాసుదేవ విష్ణుదయాల్ తన గ్రంథం 'ది ఎస్సెన్స్ ఆఫ్ వేదాస్ అండ్ అలైడ్ స్క్రిప్చర్స్' 3-4 పేజీలలోను, ఆచార్య సత్యదేవ వర్మ ఇస్లాం మత గ్రంథం పవిత్ర ఖురాన్ సంస్కృత అనువాద భూమికలోను, శ్రీ తనసుఖరామ్ తన 'హిందూ మత పరిచయం' గ్రంథం 31వ పేజీలో, అరబ్బీ భాషకు చెందిన ఒక ఆంగ్ల కవి లబీ బిన్ అఖతబ్ బిన్ తుర్ఫా తన కావ్య సంగ్రహం 'సీరతుల్‌కుల్' లోను 'హింద్' 'వేద' పదాలను ప్రయోగించారని వ్రాశారు. ఈ మహాకవి ఇస్లాంకు 2300 సంవత్సరాల పూర్వానికి చెందినవాడు. గ్రీకు, పర్షియా, యూరప్, అరబ్బు దేశాలలో 'హిందూ' పదం వాడుకలో ఉంది అనే విషయం రెండు నిజాలను స్పష్టం చేస్తోంది. (1) అరబ్బీలో 'హిందూ' పదం లభిస్తుంది. (2) విశ్వభ్రమణంలో విభజింపబడిన అత్యధిక సమకాలీన దేశాలు ఈ పదాన్ని మత, సాంప్రదాయ పరమైన అర్థంతో కాక సద్గుణ సంపన్నమైన మానవజాతి లేదా ప్రాంతం అర్థంతో ప్రయోగించేవారు.

శ్రీరామ్‌ధారీసింగ్ దినకర్ తన "సంస్కృతి కె చార్ అధ్యాయ్" గ్రంథంలో ఇలా వ్రాశారు- 'పందొమ్మిదవ శతాబ్ద ప్రారంభంలో భారతదేశంలో ఫిరంగి మోతలకు జాగ్రత్తపడవలసి వచ్చినప్పటి నుండి చాలామంది 'హిందూ' పదాన్ని త్యజించి తమకు తాము ఆర్యులుగా చెప్పుకోవడం ప్రారంభించారు. ఈ రెండు పదాలకు అర్థం ఒకటే కావడం అందుకు కారణం. వి.డి.సావర్కర్ "హిందూత్వ" అన్న పుస్తకంలో ఇలా వ్రాశారు- "సింధునది నుండి ఉద్భవించిన హిందూత్వాన్ని ఉద్బోధించే కార్యాన్ని ఈ విశ్వం మాకిచ్చింది... మా హిందూ నామం ఎంత గౌరవశాలి అంటే దాని వేగంతో మా సర్వసమ్మత నామం భరతఖండం కూడ చరిత్ర పుటల కెక్కింది. ఇతర దేశాల వాసులుకూడ మా 'సింధు' లేదా 'హిందూ' నామంతో పరిచితులు. అందువలన మేము ఆ పేరుతోనే పిలువబడుతున్నాము."

హిందూపదం నుండి మానవీయ ఆదర్శాల పరిచయం లభిస్తుంది. అంతేకాక సింధు ప్రాంతంతో పరిచయం ఉన్న కారణంగా దీనితో మనం మన జాతి పరిచయాన్ని కూడ పొందుతాము. 'హిందూ' పదాన్ని మనం సాంప్రదాయిక, సంకుచిత భావాలతో జోడిస్తే- అది మన గొప్పతనాన్ని, విశాలతను, గర్వాన్ని, గౌరవాన్ని కుంచించుకుపోయిన మానసిక స్థితిలో బంధించాలని ప్రయత్నించినట్లే. భారత్‌లో తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే తాపత్రయంతో అన్ని మతాలు, సాంప్రదాయాలు, నమ్మకాలు, ఉపాసనా విధులు, భాష, వేష భూషలు, రీతిరివాజులు, మత విశ్వాసాలు పరస్పరం సంబంధం కలిగి ఉండకపోవచ్చు. కాని అందరూ తమ సమ్మిళిత పరిచయాన్ని ఒకే స్వరంలో గానం చేస్తూ ఇదే చెప్పారు-"సారే జహాసే అచ్ఛా హిందుస్తాన్ హమారా." హిందు, హిందుస్తాన్ ఈ అన్ని జాతులకు, సహజాతులకు, ఉపజాతులకు మాతృభూమి. ఇక్కడ నివసించడానికి అందరికీ అధికారం ఉంది.

మానవీయ గౌరవానికి ప్రతీకయైన ఈ పదంతో సంబంధాన్ని పెట్టుకోవడంలో మహారాణా ప్రతాప్, శివాజీలు దేశభక్తులుగా గర్వపడ్డారు. మహాకవి భూషణ్ తన ఆదర్శమైన శివాజీ వీరత్వాన్ని, పరాక్రమాన్ని, శ్రేష్ఠత్వాన్ని అనుభూతి పొందుతూ 'రాఖీ హింద్‌దానీ, హిందవాన్‌కో తిలక్ రాఖ్యో" మొదలైన పదాలను ప్రయోగించాడు. గురుగోవింద్‌సింగ్ కూడ ఈ పద నిహితార్థాన్ని భావోద్వేగంతో గానం చేశాడు. సంస్కృత వ్యాకరణాచార్యులు కూడ ఈ పదం అర్థాన్ని కొంచెం ప్రత్యేకంగానే చెప్పారు.

అద్భుత కోశరూపంలో ఇలా వ్రాసి ఉంది- "దుష్టత్వాన్ని నాశనం చేసేవారిని హిందువులు అంటారు."

హేమంత కోశం ప్రకారం నారాయణుని అనగా ఈశ్వరుడిని పూజించేవారు హిందువులు.

**వర్తమానాన్ని ఉపేక్షించే వ్యక్తి సర్వస్వాన్నీ కోల్పోతాడు.**

రామకోశంలో ఇలా వ్రాసి ఉంది- హిందూత్వం దుర్మార్గం కాదు. అధర్మంకాదు. ఎవరిపైనా కుట్రలు చేసేది కాదు. సత్యధర్మాన్ని, సత్యవచనాన్ని పాలించేవారు, పండితులు వేదధర్మ ఉపాసకులే హిందువులు.

'శబ్దకల్పద్రుమ' ప్రకారం 'హీన దుష్యాతి ఇతి హిందూ.' అనగా తమ హీనత్వాన్ని, చెడును అంగీకరించి వాటిని వదిలివేయడానికి సిద్ధపడేవారే హిందువులు.

మాధవాచార్యుని మాటలలో- 'ఓం'కార మూల మంత్రంలో నమ్మకం ఉన్నవారు, పునర్జన్మలో విశ్వాసం కలిగినవారు, గోసేవకులు, భరత ఋషిని తమ పూర్వ ఋషిగా నమ్మేవారు, హింసను అధర్మంగా భావించేవారే హిందువులు.

పారిజాతాపహరణం అనే ప్రాచీన నాట్యగ్రంథంలో ఇలా చెప్పబడింది-"తమ తపస్సుతో శారీరక దుర్గుణాలను, పాపాలను కడిగివేసుకునేవారు, దుష్టత్వాన్ని త్యజించేవారు, రాక్షసత్వంతో సంఘర్షణ జరిపేవారే హిందువులు.''

ఆచార్య వినోబా భావే ఇలా చెబుతున్నారు-"వర్ణాశ్రమాన్ని నమ్మేవారు, గోసేవకులు, వేదజ్ఞాన పూజారులు, అన్ని మతాలను గౌరవించేవారు, దైవీ తత్వాలను, దేవశక్తులను ఉపాసించేవారు, మోక్షప్రాప్తి జిజ్ఞాసను కలిగినవారు, పునర్జన్మ మీద విశ్వాసం ఉన్నవారు, అహింసను నిత్యమూ ఆచరించేవారు హిందువులు.''

డా॥ రాజబలి పాండ్యా మాటల ప్రకారం- భరతవర్షంలో జన, జాతులను కలిపిన సమాజం పేరు "హిందూ''. ఆ సమాజపు ధర్మం, నమ్మకాలు, విశ్వాసం, పరంపరల ఆత్మయే హిందూత్వం. బయట నుండి ఎన్ని సహజాతులు వచ్చినా వారు కూడ నెమ్మది నెమ్మదిగా హిందూ జాతిని లేదా హిందూత్వాన్ని ఏదో ఒక రూపంలో అంగీకరించారు. ఇదే వాస్తవిక హిందూత్వం.

మహనీయుడు శ్యామగుప్తుడు ఇలా చెబుతున్నాడు- "ద్రవిడ, ఆర్య సంస్కృతుల కలయికే హిందూత్వం అంటారు''.

పూజ్య విగుజియేనాథ్ మాటల ప్రకారం- హిందూత్వం ఒక సుందరమైన జాతీయ సమాజవాద నామం. ఇది భారత సమాజం మొత్తాన్ని ఏకం చేసింది. దీని ఉదాత్త సాంస్కృతిక భావనలు బౌద్ధ, జైన, శిఖ్కు, ముస్లిమ్, క్రైస్తవులు అందరినీ తన ప్రేమ, అభిమానాలతో అక్కున చేర్చుకుంటాయి.

పండిత రాంగోవింద్ త్రివేది అభిప్రాయం ప్రకారం- హిందూమతం, హిందూ సంప్రదాయం, హిందూ సంస్కృతి, హిందూ ఐక్యత, హిందూ పరంపర, హిందూ కళలు మొదలైన వన్నీ హిందూత్వ పరిధిలోకే వస్తాయి. హిందూత్వ ముఖమండలం ఎంత ప్రకాశవంతమైనది అంటే- హిందూత్వ నియమాలను ఏ కొంచెం అంగీకరించినవారయినా దానిని రక్షించడానికి తమ సర్వస్వాన్ని అర్పించడానికి సిద్ధపడతారు. దీని మానవీయ సంవేదనలతో కలగలసిన నమ్మకాలు, ఏ ధర్మం, సాంప్రదాయం లేదా మతాన్నైనా తన మమతతో ముంచెత్తుతాయి.

మహాత్మాగాంధీ హిందూత్వం పట్ల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఇలా చెప్పారు- నన్ను హిందూ మతాన్ని ప్రశంసిస్తూ మాట్లాడమని అడిగితే నేను కేవలం ఒకే ఒక మాట చెబుతాను- ఇది అహింస ద్వారా సత్యాన్వేషణ. ఈశ్వరుని పట్ల విశ్వాసం లేనివారు కూడ మేము హిందువులం అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే, హిందూమతం నిజమైన సత్యాన్వేషి. ఇది సత్యాన్ని విశ్వసించే మతం.

ప్రస్తుతం నమ్మకాలు మారిపోయాయి. చాతుర్యంతో తమ స్వార్థంకోసం, అహాన్ని స్థాపించుకోవడంకోసం కొందరు ఆకర్షక పదాల వలను విసురుతూ ఉంటారు. వేటగాడికి వేట వృత్తి, నక్కవినయాలు, తోడేలు ధూర్తత్వం - ఇవి సన్యాసులు, ఋషులు తమ సర్వస్వాన్ని బలిదానం ఇచ్చి స్థాపించిన ఆదర్శాలను స్థాపించలేవు.

ప్రస్తుతం ఆదర్శవాద ప్రామాణికతలలోనే హిందూత్వాన్ని అన్వేషించాలి. మానవ జీవితాన్ని శ్రేష్ఠంగా మలచుకోవడంతోనే, సద్గుణాలను పెంపొందించుకోవడంతోనే దీనిలో దాగి ఉన్న సత్యం తెలుస్తుంది. మత ఛాందసత్వం, సాంప్రదాయిక ద్వేషం కాక, 'వసుధైక కుటుంబక' మూల మంత్రమే హిందూత్వ సత్యం. స్వార్థం నుండి, అహంకారాల నుండి బయటపడి ఉదారతను, సహనశీలతను పాటించడం ద్వారానే మనం నిజమైన, మంచి మానవులం కాగలము. మానవీయ శ్రేష్ఠత్వానికి ఆఖరిబిందువే మన ఆర్యావర్తానికీ, హిందూత్వానికి గుర్తింపు అవుతుంది.

అనువాదం: డి.వి.ఆర్. మూర్తి

H H H

**నియమ రాహిత్యం దురలవాట్లకు పెద్దన్న.**

వ్యక్తి నిర్మాణం

# స్వప్రయత్నంలో జీవన సాఫల్యం

ఎంత ప్రయత్నించినప్పటికీ కొందరికి కోరిన సఫలత ప్రాప్తించదు. దానితో వారు ఈ ప్రయత్నాలూ, పురుషార్థం అంతా వ్యర్థం, అదృష్టమనేది ముఖ్యమనే భ్రమకు లోనౌతారు. వాస్తవంతో దీనికే సంబంధమూ లేదు. అదృష్టం మీద నమ్మకం పెట్టుకోవడం ఒక మానసిక దౌర్బల్యం. సఫలత కలుగలేదంటే ప్రయత్నంలో ఎక్కడో ఏదో లోప ముంటుంది. సంపూర్ణంగా సరైన రీతిలో చేసే ప్రయత్నంవల్ల విజయం తథ్యం. ఇందులో ఏ విధమైన సందేహమూ లేదు.

ఒకసారి ప్రయత్నం చేయగానే సఫలత కలగాలని లేదు. సఫలత కోసం నిరంతర ప్రయత్నం చేస్తూనే ఉండాలి. శారీరక శ్రమ, పురుషార్థ రూపంలో అవసరమైనంతగా పెట్టుబడి పెట్టాలి. వెంటనే సఫలత కలుగలేదు కనుక ఆ పని విజయవంతం కాదనుకోవడం అనుచితమే అవుతుంది. ప్రపంచంలో లింకన్ వంటి ఎందరో వ్యక్తులు వందలసార్లు సఫలత సాధించలేకపోయినా చివరికి తమ అభీష్టాన్ని నెరవేర్చుకోగలిగారు. నిజమైన ప్రయత్నశీలురు ఎన్నిసార్లు అసఫలులైనప్పటికీ ప్రయత్న లోపం చేయరు. ప్రతి ఓటమి తర్వాత నూతనోత్సాహంతో సఫలత కొరకు నిరంతరం శ్రమించాల్సి ఉంటుంది. బండరాయి ఒక్క దెబ్బతో పగలకపోతే మరిన్ని సార్లు కొట్టి పగలగొట్టవచ్చు.

ఓటమి నంగీకరించామంటే నిరాశను ఆహ్వానించినట్లే. నిరాశవల్ల ఎన్ని దుష్ఫలితాలు కలుగుతాయో వేరే చెప్పక్కర్లేదు. నిరాశ అనేది ఒక నాగపాశంలాంటిది. అది మానవుని క్రియాశీలతను పాములా చుట్టుకుని అతని ప్రగతిని ఆటంకపరచడమేగాక, తన విష ప్రభావంతో అతని జీవన తత్త్వాన్నే నష్టపరుస్తుంది.

ఆపదలు పర్వతశ్రేణుల్లాగా విస్తరించి ఉన్నట్లూ, దుర్భేధ్యాలన్నట్లూ కనిపిస్తాయి. కానీ వాస్తవంలో అది ఒక భ్రమ మాత్రమే. ఏదైనా ఒక కష్టం రాగానే అది ఎంతో కఠినమైందని ముందుగానే ఊహించుకొని మన శక్తి చాలదనీ, మనం దానిని సాధించలేమనీ అడుగు ముందుకువేయడానికే జంకుతాము. కానీ అక్కడ భయపడేంతగా ఏదీ ఉండదు.

ఫలితం కలుగదనే భావననే మనస్సులోకి రానీయకూడదు. ఫలాలను ఆశించకుండా నిరంతరం కృషి చేయడమే మన కర్తవ్యం. నడుస్తున్నపుడు పడతారు. ఇవాళ అడుగు ముందుకు వేస్తేనే రేపు గమ్యాన్ని చేరుకోగలుగుతాము. అడుగే వేయకపోతే గమ్యాన్ని ఎలా చేరగలం. కనుక ధైర్యంతో ముందుకు నడవాలి.

కష్టాలు కలిగినప్పుడు మానవుడు తల్లడిల్లిపోయి ఎవరైనా సహాయం చేయాలని కూర్చుంటాడు. కానీ వాస్తవంలో ఎలాంటి వారుంటారంటే ఎవరైనా బాధల్లో ఉన్నారంటే వారివేపు కన్నెత్తి చూడరు. ఇంక సానుభూతి మాట ఎక్కడిది? ఇతరుల కష్ట సుఖాల్ని తమవిగా భావించి ఎదుటివాడికి సేవచేయాలనుకునేవారు ప్రపంచంలో బహుకొద్దిమంది మాత్రమే ఉంటారు.

మన పరిస్థితులకు ఎదుటి వారిమీద కోపారోపణ చేయకూడదు. పరిస్థితులను వ్యక్తి తనకు తానే తయారు చేసుకుంటాడు. సుఖదుఃఖాలు అతని మనఃస్థితిపైన ఆధారపడి ఉంటాయి. భయాన్ని వదిలి నిర్మలమైన దృష్టికోణంతో ఉంటే ఎటువంటి పరిస్థితులైన మనల్ని విచతుల్ని చేయవు.

ప్రపంచంలో మన మాటలూ, మన నడవడికే శత్రువుల్ని, మిత్రుల్ని తయారు చేస్తాయి. ఈ ప్రపంచ మొక అతిథి గృహం. వచ్చే ప్రాణులు వస్తుంటారు. కొద్దికాల ముంటారు. తర్వాత వెళ్ళిపోతారు. ఇక్కడ శాశ్వతంగా ఉండేవారెవరూ లేరు. కనుక ఎవరితోనూ కఠోరమైన మాటలు మాట్లాడకూడదు. చెడుగా ప్రవర్తించి శత్రుత్వాన్ని పెంచుకోకూడదు. అందర్నీ తమ తోటివారుగా భావించి స్నేహ సౌజన్యాలను, సహానుభూతిని కనపరచాలి.

కష్టాలను అవరోధా లనుకుంటే ప్రపంచంలో ఎవరూ సంపన్నులుగా, సఫలురుగా ఉండేవారు కారు. కష్టాలనేవి లేని భాగ్యశాలి ఎవరూ ఉండరు.

పరిస్థితుల ముందు తను ఓడిపోయాననుకుంటే, కొద్ది బాధలకూ అవరోధాలకే నిరాశ మానవుల్ని క్రుంగదీస్తుంది. అదే ప్రగతికి పెద్ద ఆటంకమౌతుంది. ఉన్నతి, ప్రగతి

**మానసిక దౌర్బల్యాన్ని మించిన దోషం లేదు.**

ఆత్మవిశ్వాసంతో లభ్యమవుతాయి. ఆత్మబలం, శరీరబబలం జీవన పథంలో మానవుడిని అగ్రేసరుణ్ణి చేస్తాయి. బాధలు నిర్బలుణ్ణే చుట్టుకుంటాయి. ఆత్మవిశ్వాసం లేని వారిని ఓడిస్తాయి. కార్యశీలురినీ, ఆత్మబలం కలవారినీ అవి ఏమీ చేయలేవు.

ఆత్మవిశ్వాసమే ఆత్మబలం. తమకాళ్ళ మీద తాము నిలవగలిగి ఎవరి సహాయమూ అవసరంలేని వారిని వారి స్థానం నుండి ఎవరు కదిలించగలుగుతారు? ముందుకు వెళ్ళకుండా ఎవరు అడ్డగించగలుగుతారు?

ఇతర శక్తులు కూడ యోగ్యత కలవానికి సహాయపడతాయి. ఒక మనిషి అప్పుగానీ, ఏదైనా వస్తువుగానీ కావాలని ఇతరుల దగ్గరకు వెళ్తే తాము చేసే సహాయం సదుపయోగం అవుతుంది అనుకున్నప్పుడు సహాయం చేసేవారు సంతోషంతో సహాయం చేస్తారు. అతను నమ్మకమైన వాడన్న సంగతి వారికి తెలుసు. ఇంకొకరు వెళ్ళినప్పుడు ఏ సహాయమూ లభించదు. కారణం అతను తన యోగ్యతనూ, నమ్మకాన్నీ ఋజువుచేసుకోలేదు. అంతేగాని సహాయం లభించినవాడు అదృష్టవంతుడు, ఇంకొకడు అదృష్టవంతుడు కాదనీ కాదు. సహాయం చేయనివారిని దూషించకూడదు. ఎవరైనా యోగ్యులకు సహాయపడతారేగానీ అయోగ్యులకు సహాయపడరు. రైతు బాగా పాలిచ్చే ఆవుల్ని బాగా మేపుతాడు. పనికిరాని పశువుల్ని కసాయి వాడి కిస్తాడు. తోటమాలి ఆరోగ్యవంతమైన మొక్కల్ని బాగా కాపాడుకుంటాడు. పనికిరాని మొక్కల్ని ఏరివేస్తాడు. ఆ స్థానంలో మంచి మొక్కల్ని నాటుతాడు. భగవంతుడు కూడ యోగ్యమైన వారికే సహాయం చేస్తాడు. జపం చేసినా, మొక్కులు మొక్కినా అయోగ్యులకు నిరాశే మిగులుతుంది.

'ఉద్ధరేత్ ఆత్మనాత్మానామ్' అని గీతలో స్పష్టంగా విశదపరచారు. అనగా ఉన్నతిని కోరేవారు స్వయంగా ప్రయత్నం చేయాలి. శ్రేష్ఠ పురుషులకు కొద్ది ఆధారం దొరకవచ్చు. కానీ గమ్యంవైపు స్వయంగా పయనించాలి. గమ్యం చేరేంతవరకూ భుజాలమీద ఎవరూ మోసుకుపోరు. కడుపు పనిచేయకపోతే అన్నం అరగదు. కళ్లు సహకరించందే ఏ దృశ్యమూ చూడలేము. చావకపోతే స్వర్గాన్ని చూడలేము. అలాగే మన ప్రయత్నం లేకపోతే ఉన్నతిని పొందలేము.

గొర్రెల్లా కాక మన శక్తిని తెలుసుకుని ప్రగతి కొరకు ప్రయత్నించాలి. భగవంతుని శక్తిపుంజంలోని అణువులం మనమని తెలుసుకుని ఈ భూమిని స్వర్గంగా మార్చేటందుకూ, ఇక్కడ ప్రేమ, సహానుభూతులను పంచడానికీ మనం వచ్చామని గ్రహించాలి. మంచిని శిరోధార్యం చేసుకోవడమే జీవితం. అగ్రగాములమై మనభవిష్యత్తునేగాక, సమాజ భవిష్యత్తునుకూడ ఉన్నతికి తీసుకువెళ్ళడమే మన జీవితాని కర్థం.

H H H

## అహంకారం నరకానికి ద్వారం

ఒక సాధువు, ఒక బందిపోటు ఒకే రోజున మరణించటం సంభవించింది. యమధర్మరాజు దర్బారులో వారు హాజరుపరుచబడ్డారు. దొంగ తాను చేసిన దుష్కర్మలను ఒప్పుకొని, తగిన శిక్ష విధించమని శిరసు వంచి నిలబడ్డాడు. సాధువు తన పుణ్యకర్మల గురించి ఆత్మస్తుతి చేసికొంటూ, తక్షణం తన కోసం స్వర్గ ద్వారాలు తెరచి ఉంచమని ఆదేశించాడు. యమధర్మరాజు దొంగతో - ఈ రోజునుండి నీవు ఈ సాధువునకు సేవ చేయి. సత్సంగం వలన నీలో ఉద్భవించిన సద్భావనలు మరింత ప్రకాశవంతం కాగలవని అన్నాడు. దొంగ ఆనందంగా అంగీకరించాడు. కానీ సాధువు ఆ ఆదేశాన్ని తిరస్కరించి - ఇతని సాంగత్యం వల్ల నేను భ్రష్టుపట్టిపోతాను. కాబట్టి మీ నిర్ణయం నాకిష్టం లేదని అన్నాడు. ధర్మరాజు గంభీరంగా తల పంకించి "అయితే ఈరోజు నుండి నీవే ఈ దొంగకు సేవ చేయి. అప్పుడు గొప్పవాడిననే అహంకారం నీలో నశిస్తుంది." అని ఆజ్ఞాపించాడు.

ఎంతటి తపోసాధనలు చేసినప్పటికీ అంతరంగం లౌకిక కాంక్షలతో నిండిఉన్నవారికి చివరకు ఇదే గతి పడుతుంది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మహాపురుషులు నడిచిన బాటలో నడువు.**

సాధు సంత్‌ల జీవితాలు

# పేదలపాలిటి పెన్నిధి -సెంట్ ఫ్రాన్సిస్

సెంట్ ఫ్రాన్సిస్ ధనవంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రికి పెద్ద వస్త్రాల వ్యాపారం ఉండేది. ఫ్రాన్సిస్ మొదట్లో ఎంతో దర్జాగా జీవితం గడిపారు. షడ్రసాలతో కూడిన భోజనం చేసేవారు. ఖరీదైన దుస్తులు ధరించేవారు.

అయితే, అనంతర కాలంలో ఆయన హృదయం పూర్తిగా పరివర్తన చెందింది. ఆయనలో పేదరికంపై ప్రేమ జనించింది. ఆయన తన సర్వస్వాన్నీ త్యాగం చేశారు. పేదల సేవలో నిమగ్నం అయినారు.

ఒకరోజున ఒక బికారి వాళ్ల బట్టల దుకాణానికి వచ్చాడు. ఫ్రాన్సిస్‌ను ఇలా అడిగాడు-

"సోదరా! నేను ఆకలితో మాడిపోతున్నాను. చలితో చనిపోతున్నాను. నాకు తినడానికీ, ధరించడానికీ ఏదైనా ఇవ్వు."

అతడి దీన స్థితికి ఫ్రాన్సిస్ ఎంతో జాలిపడ్డారు. ఆయన ఆ పేదవానికి భోజనం పెట్టారు. వస్త్రాలు ఇచ్చారు. ఆయన తండ్రికి ఈ సంగతి తెలిసింది. ఆయనకు ఫ్రాన్సిస్‌మీద బాగా కోపం వచ్చింది. ఆయన ఇలా ఫ్రాన్సిస్‌ను కేకలు వేసారు-

"డబ్బు ఉన్నది ఇలా బికారులకు దోచిఇవ్వడానికి కాదు."

## సిరి సంపదలపట్ల విరక్తి

తండ్రి చెప్పిన ఈ మాటలకు ఫ్రాన్సిస్‌కు ఎంతో దుఃఖం కలిగింది. ఆయన ఆలోచన ఇలా సాగింది-

పేదలనూ, నిస్సహాయులనూ ఆదుకోవడానికి ఉపయోగపడని డబ్బు పనికిరానిది. వేలాది ప్రజలు మన కళ్లఎదుట ఆకలితో చనిపోతూ ఉంటే, అర్ధనగ్నంగా తిరుగుతూ ఉంటే - ఇలా డబ్బు కూడబెట్టి భోగ విలాసాలు అనుభవించే అధికారం మనకు ఎక్కడ ఉంది?

ఇలా ఫ్రాన్సిస్‌కు డబ్బుమీద విరక్తి కలిగింది. ఆయన విలాస జీవితానికి స్వస్తి చెప్పారు. సాదాగా జీవించసాగారు.

## మేలుకొన్న మానవత్వం

ఒక రోజున ఫ్రాన్సిస్ గుర్రంమీద ఎక్కడికో వెళుతున్నారు. దారిలో ఆయనకు ఒక కుష్టు రోగి కనిపించాడు. అతడు అర్ధనగ్నంగా పడి ఉన్నాడు. బాధతో విలవిలలాడుతున్నాడు. ఆర్తనాదాలు చేస్తున్నాడు. అతడి పరిస్థితి చూచినపుడు ఫ్రాన్సిస్‌కు మొదట అసహ్యం కలిగింది. అయితే మరుక్షణంలో ఆయన అంతరాత్మ ఇలా ప్రబోధించింది -

"ఫ్రాన్సిస్! నీకీ ఆలోచన ఎంతమాత్రం తగదు. ఇలాంటి వ్యక్తులకు నీవు సాయపడాలి. ఇతడిని అసహ్యించుకోవడం పూర్తిగా అనుచితం."

ఫ్రాన్సిస్ హృదయంలో మానవత్వం మేలుకున్నది. ఆయన వెంటనే గుర్రం దిగారు. ఆ కుష్టు రోగిని గుండెలకు హత్తుకున్నారు. ఆ తర్వాత అతడికి సేవ చేశారు. అతడి కుష్టు రోగాన్ని నయం చేశారు. తన దగ్గర ఉన్న బట్టలను, డబ్బును అతడికి ఇచ్చారు.

ఇలా ఉపకారం చేయడంవల్ల ఫ్రాన్సిస్ ఆత్మ కరుణతో పొందిపొరలింది. పేదరికంపట్ల ఆయన ప్రేమ ఎన్నోరెట్లు పెరిగింది. ఆయన రాత్రిం బవళ్లు పేదలగురించే చింతించసాగారు.

ఆయన ఇలా చింతలో మునిగి ఉండడం చూచి ఒక మిత్రుడు ఆయనను ఇలా అడిగాడు-

"సోదరా! ఈ మధ్య ఏదో దీర్ఘాలోచనలో పడినట్లు కనిపిస్తున్నావు. ఏమిటి సంగతి? పెళ్లి చేసుకోవాలని ఉందా?"

ఫ్రాన్సిస్ ఆయనకు ఇలా జవాబిచ్చారు-

**నిరాశ విజయావకాశాలకు గొడ్డలిపెట్టు.**

"నిజమే. అలాంటి ఆలోచనే కలుగుతోంది. ఒక అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాను. ఆ సుందరాంగి పేరేమిటో తెలుసా?''

మిత్రుడు ఇలా అన్నాడు-

"ఆమె ఎవరైనా ఎంతో అదృష్టవంతురాలు. చెప్పు- ఆమె ఎవరో?''

ఫ్రాన్సిస్ ఇలా జవాబిచ్చారు-

"ఆమె పేరు దారిద్ర్యం.''

ఫ్రాన్సిస్ తన ఆలోచనను ఆచరణలో పెట్టారు. పేదరికాన్ని వరించారు. అంతేకాదు. పేదలకు గొప్పసేవకుడు అయినారు.

**మోహబంధం నుండి విముక్తి**

ఒక రోజున ఫ్రాన్సిస్ ప్రార్థన చేయడానికి ఒక చర్చికి వెళ్ళారు. ఆ చర్చి పూర్తిగా శిథిలావస్థలో ఉంది. భగవానుని గృహం ఇలాంటి దురవస్థలో ఉండడం చూచి ఆయనను ఎంతో బాధ పడ్డారు. ఆయన ఇంటికి వెళ్లారు. ఇంటిలో ఉన్న వస్త్రాల మూటలు అమ్మివేశారు. తన గుర్రాన్ని అమ్మివేశారు. అలా వచ్చిన డబ్బంతా తీసుకువెళ్లి ఆ చర్చి అధికారికి ఇచ్చి, చర్చిని మరమ్మత్తు చేయించమని చెప్పారు.

ఈ సంగతి ఆయన తండ్రికి తెలిసింది. ఆయన ఫ్రాన్సిస్‌ను చావగొట్టాడు. ఆయనను బిషప్ (మతగురువు) దగ్గరకు తీసుకువెళ్లారు. ఆయనతో ఇలా అన్నారు- వీడు నా కుమారుడు. నా డబ్బంతా తగలేస్తున్నాడు. వీడికి నా ఆస్థి ఇవ్వను.

తండ్రి చెప్పిన ఈ మాటలు విని, ఫ్రాన్సిస్ ఆనందంతో నాట్యం చేశారు. ఆయన తన తండ్రితో ఇలా చెప్పారు-

"ఒక గొప్ప మోహబంధంనుండి మీరు నన్ను విముక్తి చేశారు. పరమార్థానికీ, పరమపితకూ పనికిరాని ఆ సంపదను నేను దూరంనుంచే నమస్కరిస్తున్నాను.''

ఇలా చెప్పి, సెంట్ ఫ్రాన్సిస్ తన దుస్తులనుసైతం విడిచివేశారు. తువ్వాలు చుట్టుకుని వెళ్లిపోయారు.

అనంతర కాలంలో ఆయన సెంట్ ఫ్రాన్సిస్ ఆఫ్ ఎసెసీ''గా, క్రైస్తవ భక్తులలో ఒక మహాభక్తుడుగా పేదలపాలిటి పెన్నిధిగా ప్రసిద్ధిపొందారు.

H H H

## చక్రాల కుర్చీ ఇచ్చే ప్రేరణ

సాహసాన్ని ప్రదర్శించటానికి దృఢమైన శరీర సౌష్టవం కల్గి ఉండాలనే నియమమేమీ లేదు.

మిలటరీ నుండి పదవీ విరమణ చేసిన లారెన్సు ఒక వ్యవసాయ కర్మాగారం నిర్మించాలని అనుకొన్నాడు. సంకల్పం గట్టిది కావటంతో కావలసిన ధనం, శ్రమశీలురాలైన జీవిత భాగస్వామిని వెదుక్కొంటూ వచ్చేరు. స్వల్ప కాలంలోనే కర్మాగార నిర్మాణం జరిగింది. దానిలో ఒక కోళ్ళఫారం కూడా ఉండేది. ఒకరోజున విపరీతంగా మంచుపడుతూ ఉండటంవల్ల ట్రక్కు దారిమధ్యలో ఇరుక్కొనిపోయింది. దానిని ఒక మైలుదూరం గెంటుకొంటూ రావలసి వచ్చింది. విపరీతమైన మంచు, చీకటి. దానికి తోడు పెద్ద గాలి. ఒక పెద్ద చెట్టు ఈతనిమీద పడింది. దానితో మంచులో కాళ్ళు రెండూ కూరుకుపోయాయి. ఇతడు కదలలేక పోయాడు. ట్రక్కుని బట్టి మర్నాడెప్పుడో లారెన్స్ జాడ తెలిసి అతనిని హాస్పటల్‌లో చేర్చగా - అతడి రెండు కాళ్ళూ తీసివేయవలసి వచ్చింది. మూడు నెలల తర్వాత హాస్పటల్ నుండి తిరిగి వచ్చిన లారెన్స్ కాళ్ళు కోల్పోయాననే ఆలోచన లేకుండా యథా ప్రకారం ఉత్సాహంతో భావి ప్రణాళికలు వేయసాగేడు. చక్రాల కుర్చీ సహాయంతో ట్రక్కు నడిపే ఏర్పాటు కూడా చేసికొన్నాడు. కాళ్ళు కోల్పోయిన వ్యక్తి ద్వారా ఇంత పెద్ద కర్మాగారం గతంలో కంటె గొప్పగా ఎలా నడుపబడుతోందో చూడాలనే కుతూహలంతో దూరం నుండి జనం వచ్చేవారు. అతడిని చూచి బ్రహ్మాండమైన ప్రేరణను పొంది వారు తమ సోమరితనానికి, చేతకానితనానికి స్వస్తి చెప్ప ప్రయోజకులుగా కృషి ప్రారంభించేవారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**గురువు అడుగు జాడలు జీవన లక్ష్యానికి రాచబాటలు.**

## ఆచరణలో జీవన సాధన

# శాంతికుంజ్‌లోని శిక్షణ శిబిరాలు

పరమ పూజ్య గురుదేవుల జీవిత ఉత్తరార్ధంలోని ఒక అతి విలువైన సంఘటన గాయత్రి తీర్థం- శాంతికుంజ్ స్థాపన. ఉత్తరాంచల్ ముఖద్వారమందు గంగానది ఒడిలో హిమాలయముల నీడలో ఈ పవిత్ర ఆశ్రమం ఈనాటి వరకు లక్షలాది వ్యక్తుల జీవితాలను జ్ఞానజ్యోతితో అలరారజేసింది. అసంఖ్యాక వ్యక్తులు జీవన సాధనలో ప్రేరణ పొంది పారంగతులైనారు. ఇక్కడి వాతావరణంలో తపఃశక్తి అంతటా వ్యాపించి ఉంది. ఇక్కడ ప్రతిరోజు 24 లక్షల గాయత్రి మంత్ర జపం జరుపబడుతూ ఉంది. దానితోపాటు యజ్ఞాగ్ని నుండి బయలుదేరిన పొగతో వాతావరణం సువాసనలను వెదజల్లుతూ ఉంటుంది. గురువర్యులు తమ చివరి 20 సంవత్సరాల జీవితం ఇక్కడే గడిపేరు. మాతృస్వరూపిణి, శక్తిస్వరూపిణి మాతా భగవతీదేవి శర్మగారు 1971 నుండి 1994వరకు 24 సంవత్సరాల మహత్తర జీవితాన్ని తపఃచర్యతో పాటు ఆశ్రమవాసుల ఆలనా-పాలనా కూడా చూస్తూ గడిపేరు. బ్రహ్మవర్చస్ శోధ సంస్థానం, దేవసంస్కృతి విశ్వవిద్యాలయము-విలక్షణమైన ఈ రెండు సంస్థలు శాంతికుంజ్ గౌరవాన్ని ఎన్నోరెట్లు ఇనుమడింపజేస్తూ ఉన్నాయి. ఈలాంటి స్థలంలో కొన్నాళ్లపాటు నివసించే అవకాశాన్ని ఓ సౌభాగ్యంగా భావించాలి.

ఇక్కడ సంవత్సరం పొడవునా శిక్షణ శిబిరములు జరుగుతూనే ఉంటాయి. ఎందరో ఈ శిక్షణ శిబిరాల్లో పాల్గొని లాభాన్వితులై వెళ్తూ ఉంటారు. రమారమి 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సంస్థ ఎల్లప్పుడూ క్రియాశీలంగా ఉంటుంది. అది మిక్కిలి చలికాలం అవనీయండి, ఎండాకాలం కానివ్వండి. ఈ ఆశ్రమం వెలసిననాటి నుండి అనేక రకాల శిక్షణ శిబిరాలలో పాల్గొని అసంఖ్యాకులైన వ్యక్తులు లాభాన్వితులైనారు. వీరిలో కొందరు సమయదానులుగా, జీవనదానులుగా మారిపోయారు కూడా. ఈ ఆశ్రమం సమాజమునకై "సంఘ సేవకులను'' తయారుచేసే కర్మాగారం అనడంలో అత్యుక్తి ఏమాత్రం లేదు.

ఇక్కడ జరిగే శిక్షణ శిబిరములు ఈ క్రింద విధంగా ఉన్నాయి:

**సంజీవని సాధనా శిబిరం:** ఇది తొమ్మిది రోజుల శిబిరం. ప్రతి నెల 1వ తేదీ మొదలు 9 వరకు, 11 తేదీ నుండి 19 వరకు, 21వ తేదీ నుండి 29 వతేదీ వరకు జరుగుతూ ఉంటాయి. ఈ శిబిరంలో 24 వేల గాయత్రి మంత్ర జప అనుష్ఠానం చేయించబడుతుంది. ఈ శిబిరానికి వచ్చిన వ్యక్తులకు ముందు రోజు సాయంకాలం రక్ష ఇవ్వబడుతుంది. ఇందుకై ఒక రోజు ముందు ఇక్కడికి చేరుకోవాలి. శిబిరం ముగిసే రోజున మధ్యాహ్నం గదులు ఖాళీ చేసి తిరుగు ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

ఈ శిక్షణ శిబిరంలో ప్రతిరోజు ఉదయం నిష్ణాతులైన కార్యకర్తలద్వారా ఆధ్యాత్మికతలోని వివిధ విషయాలపై ప్రేరణాత్మకమైన ఉద్బోధనలు ఇవ్వబడుతాయి. ఉదయం వేకువనే లేవాల్సి ఉంటుంది. శీతాకాలంలో ఉదయం 4గం॥కు, ఎండాకాలం (వేసవిలో) ఉదయం 3-30కి॥ లేవాల్సి ఉంటుంది. స్నానాదులు ముగించుకుని గాయత్రి మాత హారతిలో పాల్గోవాలి. ఆ తరువాత పరమపూజ్య గురుదేవుల ఉపదేశాలు వింటూ ధ్యానం. ఆ తరువాత యజ్ఞశాలలో యజ్ఞం. తదుపరి అఖండ దీపాన్ని దర్శించి గురుసత్తా చరణ పాదుకలకు శ్రద్ధాంజలి ఘటించే కార్యక్రమం ప్రారంభమౌతుంది. 8గం॥ నుండి 9 గం॥వరకు ప్రబోధనలు. తరువాత భోజనం, తరువాత విశ్రాంతి.

మధ్యాహ్నం మరల ప్రబోధన. దీని ద్వారా సాధకులకు ఉపాసన, ఆరాధన, సమాజసేవ ఎలా చేయాలన్నది తెలియపరుస్తారు. తొమ్మిదిరోజుల శిబిరంలో ఒకరోజు బ్రహ్మవర్చస్, దేవసంస్కృతి విశ్వవిద్యాలయముల సందర్శనకు కేటాయించబడింది. ఓ రోజు ప్రజ్ఞా పురాణంపై ప్రదర్శనాత్మకమైన (ఆడియో-వీడియో) బోధన ఉంటుంది. ఆరోగ్య సూత్రాలు, గ్రామవికాస పథకాలపై రెండురోజులు ఇష్టా-గోష్ఠులు కుడా జరుగుతాయి. ఈ విధంగా సాధకులకు కొత్త మార్గాలను సూచించడం జరుగుతుంది. ఈ తొమ్మిది రోజుల శిక్షణ శిబిరాన్ని

**ఆత్మ నిర్మలంగా ఉంటే, ప్రార్థన ఫలిస్తుంది.**

తల్లి కడుపులో ఉన్న తొమ్మిది నెలలలా భావించాలి. ఆఖరి రోజు వీడ్కోలు. కళ్లవెంబడి కన్నీరు కారే పరిస్థితుల్లో ఒకరి నుండి ఇంకొకరు దూరం అవుతారు. ఈ శిబిరంలో శిక్షణ పొందిన తరువాత తమలో ఏదో మార్పు వచ్చినట్లు పొడచూపుతుంది. ఈ శిబిరం పై ఆరోగ్యవంతులు, ఉత్సాహవంతులు ముందుగా అనుమతి పొంది రాగలరు. రెండు నెలల ముందుగా శిక్షణ విభాగం, శాంతికుంజ్, హరిద్వార్-249411కి తమ దరఖాస్తులు పంపాలి. అనుమతి పొందిన తరువాత ఈ శిక్షణ శిబిరంకై రైలు రిజర్వేషను చేసుకోవాలి.

**నెలరోజుల యుగ శిల్పి శిబిరం:** ఈ శిక్షణ శిబిరం ప్రతి నెలా 1వ తేదీనుండి 29వ తేదీ వరకు జరుపబడుతూ ఉంది. ఒక రోజు ముందు శాంతికుంజ్ చేరుకోవాలి. ముందురోజు సాయంకాలం సంకల్పగోష్ఠిలో పాల్గొనాలి. ఈ శిక్షణ శిబిరం ఒక ప్రత్యేకత సంతరించుకున్నది. దీనిలో సంగీతం, మాటా-మంతీ, కర్మకాండలు, స్వయం ఉపాధిగా వేరువేరు కుటీర పరిశ్రమలు - అనే విషయాలలో శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ శిబిరంలో ఓ నెల శిక్షణ పొందిన తరువాత వ్యక్తి తన కాళ్ళపై తాను నిలబడి ఓ సంస్థని నడిపే యోగ్యత సంపాదించుకున్నవాడౌతాడు. దినచర్య 9 రోజుల జీవన సాధన శిబిరంలోలా ఉంటుంది. ప్రతిరోజూ ప్రజ్ఞాయోగం నేర్పబడుతుంది. యుగఋషి పరమపూజ్య గురుదేవుల ద్వారా సూచించబడిన సూర్య నమస్కారములు, పలువిధములైన ఆసనములు నేర్పబడుతవి, ఒకసారి నేర్చుకుని రోజులో 15 నిముషాలు సాధన చేస్తే శరీరాన్ని ఆరోగ్యంగానూ మనస్సుని ఆహ్లాదకరంగానూ ఉంచుకోగలము. డప్పు వాయించడం, తదితర సంగీత శిక్షణ కూడా ఇవ్వబడుతుంది. ప్రజ్ఞాపురాణం, మూలికావైద్యం (ఆయుర్వేదం) హరికథా కాలక్షేపం మొదలగు యోగ్యతలతో సాధకులు ఆదర్శ స్వచ్ఛంద సేవకులుగా, శ్రమదాసులుగా, ఆశ్రమం సురక్ష మొదలగువాటిలో ఆరితేరిన వారుగా రూపొందుతారు.

నెల రోజుల యుగ శిల్పి శిక్షణ శిబిరంలో సాధకులకు బేకరీ, అగర్‌బత్తీలు చేయడం, చెట్లపెంపకం, స్క్రీన్ ప్రింటింగ్, ప్లాస్టిక్ మోల్డింగు, లేమినేషను, పండ్లతో వివిధరకాల జాములు చేయడం నేర్పిస్తారు. రచనా వ్యాసంగం ద్వారా సమాజ నిర్మాణానికై వేరు వేరు విషయాల్లో శిక్షణ ఇవ్వబడుతుంది. సాధకులను రెండు పర్యాయములు బ్రహ్మవర్చస్ శోధ్‌సంస్థాన్‌కి తీసుకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు జరుపుతారు. ఈ వైద్య పరీక్షలద్వారా ఆహార నియమాలు, ఉపాసన, శ్రమచేయడం వల్ల కలిగే మార్పులను విశ్లేషిస్తారు. వైద్యుల సలహామేరకు వనమూలికల ద్వారా వైద్యం, సాధన విధుల ద్వారా తమ ఆరోగ్యాన్ని చక్కబరచుకొవడం ఎలా అన్న విషయాలు చెప్తారు. సాధకులు తమ బృందం నాయకునితో, శాంతికుంజ్ వరిష్ట కార్యకర్తలతో ఓ గ్రూప్‌ఫోటో తీయించుకుంటారు. ఆఖరి రోజు ఒక అందమైన ప్రమాణ పత్రం అందజేస్తారు. ఆరోగ్యవంతులైన సాధకులు ముందుగా అనుమతిపొంది సంవత్సరంలో ఎప్పుడైనా ఈ శిబిరానికై శాంతికుంజ్ రాగలరు.

**పరివ్రాజక శిక్షణ:** ఇది ఉత్తమ శ్రేణి యుగశిల్పి శిక్షణలాంటిది. సమయదానం ఇవ్వదలచే కార్యకర్తలకు ఒకనెల రోజుల యుగశిల్పి సాధన తరువాత మరో నెల రోజుల గాఢమైన తర్ఫీదు ఇవ్వబడుతుది. ఈ శిబిరం రెండు నెలలది. ప్రతి నెల 1వ తేదీ నుండి రానున్న నెల 29వ తారీకు వరకు జరుగుతుంది. సాధకులకు గట్టి శిక్షణ ఇచ్చి, సమయదానానికై ప్రజ్ఞాపీఠాల్లో, శక్తిపీఠాలలో పూర్తిగా వికసించిన కేంద్రాలలో పనిచేయడానికై మూడునెలలు మొదలు ఆరునెలల వరకు సేవలందించేందుకు (సమయదానం) పంపబడుతారు. ఇప్పుడు ఈ శిబిరం అనంతరం పై మెట్టు శిక్షణ, ధర్మవిజ్ఞాన కేంద్రం (దేవసంస్కృతి విశ్వవిద్యాలయం)లో ప్రారంభించడం జరిగింది. మూడు నెలల డిప్లమా కోర్సులు నడుపబడుతున్నాయి. అన్ని మతాల మూల సూత్రాలననుసరించి దేవతార్చన విధులలో పారంగతులైన సాధకులు ఎక్కడైనా దేవాలయ అర్చకులుగా విరాజిల్ల గలరు.

**స్వావలంబన శిబిరం:** ఈ శిబిరం ప్రతినెలా 10వ తేదీ నుండి 28వ తేదీవరకు, ఒకనెల 29వ తేదీనుండి రానున్న నెల 6వతేదీవరకు జరుపబడుతూ ఉంటుంది. ఈ శిబిరంలో ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధి, ఆపద నివారణ, ఉద్యానాల పెంపకం, వనమూలికలు ఔషధాల చెట్ల పెంపకం, గోసంరక్షణలపై, స్వయంఉపాధి పథకాల పై శిక్షణ ఇవ్వబడుతుంది. ఓ ఏడాదిలో 12 శిబిరాలు జరుగుతూ ఉంటాయి. గ్రామాభివృద్ధికై కావలసిన మెలకువలు బోధపరచి వ్యక్తిని చక్కని కార్యకర్తగా మలచడం

**దృష్టికి అనుగుణంగా జరుగుతుంది సృష్టి.**

జరుగుతుంది. దీనికి కావలసిన యోగ్యత - గ్రామీణాభివృద్ధిలో అభిరుచి, యుగశిల్పి శిబిరంలో నెలరోజుల శిక్షణ.

**మూడు మాసాల సంగీత శిక్షణ శిబిరం:** ఈ శిబిరం ఒకనెల 1వ తేదీన మొదలై మూడో నెల 29వతేదీన ముగుస్తుంది. ఈ శిబిరంలో యుగశిల్పి శిబిరంలో పాటించే నియమాలు, దినచర్య యథాతథంగా పాటించాల్సి ఉంటుంది. రోజుకి 4 గంటలు డప్పు (ఖంజీరా) వాయించడంలో శిక్షణ ఉంటుంది. హార్మోనియమ్, తబలాలపై 2 గంటల సాధన, ఒక గంట సామూహిక గీతాల పై శిక్షణ ఇవ్వబడుతుంది. కర్మ కాండలు, వాటిపై ప్రవచనాలు కూడా ఉంటాయి.

**అంతఃశక్తి జాగరణ శిబిరం (మౌనసాధన):** ఇది 5 రోజుల శిబిరం. ప్రతి నెలా 1 నుండి 5 వరకు, 6 నుండి 10వరకు, 11 నుండి 15 వరకు, 16 నుండి 20 వరకు, 21 నుండి 25 వరకు, 26 నుండి 31వరకు నడుపబడుతూ ఉంటాయి. ఈ శిబిరంలో సాధకులు ఓ గదిలో 5 రోజులు పూర్తి మౌనవ్రతం ఆచరించవలసి ఉంటుంది. రోజూ గాయత్రి యజ్ఞం చేయాలి. తరువాత అఖండదీప దర్శనం, కల్పసేవనములకై ఒకేసారి బయటకి వస్తారు. ముందుగా శాంతికుంజ్ నుండి అనుమతి పొందిన తరువాత ఈ శిబిరమునకై ఓ రోజుముందుగా చేరుకోవాలి, ముందురోజు సాయంకాలం ఎంపిక ఉంటుంది. 35 గదులుగల ఓ భవనంలో శిబిరంలో పాల్గొనే పరిజనులకు నివాసం ఏర్పరచబడింది. ప్రతి గదిలో ఓ స్పీకరు ఏర్పరచబడింది. అత్యవసర పరిస్థితులలో గదిలో ఉన్న ఓ కాలింగ్ బెల్ నొక్కితే సహాయకుడు వస్తాడు. తమ అవసరాలను, సమస్యలను కాగితం పై వ్రాసి ఇవ్వాలి. రోజు మొత్తంలో 10 రకాల సాధనలు ఆడియో సిస్టం ద్వారా చేయించబడుతాయి. మౌనంగా ఉంటూ సాధకులు చేసిన సాధనలు చాలా లాభాలను చేకూర్చగలవు. ఇందులో పాల్గొనేటందుకు వ్యక్తి ఆరోగ్యం బాగుండాలి. మానసిక పటుత్వం, గతంలో పాల్గొన్న శిక్షణ శిబిరాలలో తీరుతెన్నులను పరీక్షించిన తరువాతనే ప్రవేశానికి అనుమతి ఇస్తారు. ఈ శిబిరం ఓ ప్రత్యేకత సంతరించుకున్నది. ఆఖరి రోజు సంస్థ అధిపతి సమక్షంలో శిబిరంలో పాల్గొన్న సాధకులు గాయత్రి మంత్రం పఠించి మౌనవ్రతం విడనాడుతారు.

శరీర పటుత్వం, మానసిక స్థాయి పెంపొందించడానికై రకరకాల శిబిరాలు నడుపబడుతూ ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులు, స్కౌవుట్‌లు, ప్రజాహిత సంస్థల సహకారంతో వేసవిలో 5 రోజుల అతిథి శిబిరాలు, శ్రాద్ధ తర్పణానికై వచ్చిన వ్యక్తులకు ఓ రోజు శిబిరాలు కూడా నడుపబడుతూ ఉంటాయి.

ఓ నియమిత ప్రణాళిక ప్రకారం శిక్షణ శిబిరాలు నడిపే ఆధ్యాత్మిక కేంద్రం దేశంలో మరొకటి లేదనడంలో అతిశయోక్తి లేదు. పరిజనులు, పాఠకులు ఈ పవిత్రమైన ఆధ్యాత్మిక కేంద్రాన్ని దర్శించడానికి మనఃపూర్వంకంగా ప్రయత్నించగలరు.

H H H

## 119 రోజుల సమ్మె

అసెంబ్లీలో బాంబును విసిరిన సర్దార్ భగత్‌సింగ్‌ను అరెస్టు చేశారు. జైలులో భగత్‌సింగ్, అతని అనుచరులు చాలా కష్ట సాధ్యమైన జీవితాన్ని గడుపవలసి వచ్చింది. దానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ప్రభుత్వం విప్లవ వీరులపట్ల సముచితంగా వ్యవహరించినంతవరకు సమ్మె జరుపుతామని ఆయన ప్రభుత్వానికి తెలియజేశాడు. భగత్‌సింగ్ బయట ఉంటే దుష్ట శక్తులతో పోరాడగల యోధుడని ప్రజలు అనుకొనేవారు. అంతరంగంలోని శక్తులతో పోరాడలేడని భ్రమపడేవారు. కానీ బయట ఎలా ఉంటే లోపల అలాగే ఉంటుంది. లోపలి స్థితికి రూపమే బయట స్థితి. రెండు మూడు రోజుల్లో సమ్మె విరమించబడుతుందంటూనే 119 రోజులు గడిచాయి. ప్రజలు ఆందోళన చెందసాగేరు. ప్రభుత్వం భగత్‌సింగ్ ముందు ఓటమితో తల వంచక తప్ప లేదు. అతని కోర్కెలు నెరవేర్చటానికి ప్రభుత్వం భగత్‌సింగ్ కాళ్ళముందుకు వచ్చింది.

- ప్రజ్ఞాపురాణం నుండి


**దుష్ట ప్రవృత్తులను దహించేదే తపస్సు.**

ధారావాహికం: దివ్యజీవన దర్శనం - 9

# భాగవత భూమికి యాత్ర - 2

## పాఖండ ఖండినీ పతాక

గురువునుండి శిక్షణ పొందిన తర్వాత స్వామి దయానంద దేశ పర్యటన చేస్తూ హరిద్వార్‌లో జరిగిన కుంభమేళాకు వెళ్ళారు. పర్యటనలో ఆయన వివిధ స్థలాలలోని ప్రజలతో వైదిక ధర్మంపై చర్చ జరిపేవారు. సంప్రదాయాల, కట్టుబాట్ల వెనుక ఉన్న మూలసూత్రాలను తెలుసుకుని వాటిని అనుసరించాలని చెప్పేవారు. కుంభమేళాకు వేలాదిగా ప్రజలు వస్తారు కనుక ఆయన అందులో పాల్గొన్నారు. గ్రామాలకు వెళితే 50-100 మంది ప్రజలతో మాత్రమే సంపర్కం ఏర్పడుతుంది. కుంభమేళాలో వేలాది మంది వ్యక్తులను ఒకేసారి కలుసుకోవచ్చు. హరిద్వార్ చేరుకున్న స్వామి దయానంద అక్కడ ఒక చిన్న శిబిరం ఏర్పాటు చేశారు. దాని వెలుపల 'పాఖండ ఖండినీ పతాక' (దురాచారాలను ప్రతిఘటించే జెండా) అని వ్రాసి ఉన్న జెండాను ప్రతిష్ఠించారు. ఆ జెండా ప్రజల దృష్టిని ఆకర్షించింది. స్వామీజీ శిబిరం వెలుపల నిలబడి విగ్రహారాధన, శ్రాద్ధకర్మ, అవతారాలు, పురాణాలు, కర్మకాండ మున్నగువాని పేరిట జరుగుతూన్న దురాచారాలను ఖండించసాగారు. కులభేదాలు, అంటరానితనం, బాల్య వివాహాలు, సతీ సహగమనం, వివాహాలలో జరుగుతూన్న దురాచారాలు, గ్రుడ్డి నమ్మకాలను ఖండిస్తూ ఆయన ప్రసంగించసాగారు. వారి మాటలలో కొత్తదనం ఉంది. హేతుబద్ధత ఉంది. ప్రజలు వాటిని అర్థం చేసుకోసాగారు. ఆయనను కొందరు వ్యతిరేకించారు. కొందరు సమర్థించారు.



కుంభమేళాలో, తర్వాత చేసిన యాత్రలలో దొరికిన సమర్థకులతో స్వామీజీ ఆర్యసమాజం అనే సంస్థకు పునాది వేశారు. ఆయన జీవితాంతం పర్యటనలు జరిపారు. రాజులు, మహారాజులనుండి పండితులు, విద్వాంసులవరకు అన్ని వర్గాలవారినీ ఆయన కలుసుకున్నారు.

తండ్రిగారు శ్రీరామ్‌కు ఈ విషయాలన్నీ వివరించారు. స్వామ దయానంద గురించి వారింకా ఇలా చెప్పారు- స్వామి దయానందపై ఎపుడూ కుట్రలు జరుగుతూ వచ్చాయి. ఒక కుట్ర ఫలితంగానే ఆయన మరణించారు. జోధపూర్‌లోని కొందరు వ్యక్తులు ఆయన వద్ద పనిచేసే వంటవాణ్ణి తమవైపుకు త్రిప్పుకున్నారు. అతడి ద్వారా స్వామీజీకి విషం ఇప్పించారు. ఆ విషం త్రాగిన స్వామీజీ విపరీతంగా బాధపడ్డారు. ఆ విషం వల్లనే ఆయన చనిపోయారు. చనిపోతూ చనిపోతూ ఆయన ఆ వంటవాణ్ణి పారిపొమ్మన్నారు. ఈ విషయం ప్రజలకు తెలిస్తే, వారు అతడిని ప్రాణాలతో వదలరని ఆయన భయపడ్డారు. ఆయన అతడిని క్షమించారు. అతడు పారిపోయేందుకు ఏర్పాటు చేశారు.

శ్రీరామ్ ఈ సంఘటనను ఎంతో శ్రద్ధగా వింటున్నాడు. వాటిపై తన అభిప్రాయాన్ని వ్యక్తపరచలేదు.

తండ్రిగారు మథురలోని ఇతర స్థలాల వివరాలను, గాథలను వినిపించారు. ఈ వనిహాల్, మథురల యాత్రలో తండ్రిగారి సాన్నిధ్యంలో శ్రీరామ్‌కు ఒక సంస్కారం కలిగింది. భారతీయ ధర్మ సంస్కృతుల పట్ల ఒక దృక్పథం అతడికి ఏర్పడింది. విధి అతడికి నిర్ణయించిన బాధ్యతను నిర్వహించడం కోసం బయటనుంచి ప్రత్యేక సహకారం అతడికి అవసరం లేదు. అయితే- శుకునివంటి ముక్త ఆత్మ, ఆప్తకాముడు సైతం తన తండ్రి వేదవ్యాసునినుండి భాగవత కథను వినవలసివచ్చింది.

## సూక్ష్మజగత్తు సంకేతం

పండిట్‌జీ భవంతిలో ఆయన సోదరులు ముగ్గురు, వారి కుటుంబాలవారు ఉండేవారు. 20-25 మందితో నిండిన ఉమ్మడి కుటుంబం అది. సోదరుల మామగార్లవైపు బంధువులు తరచు వచ్చిపోతూ ఉండేవారు. మేనత్తలూ, సోదరుల కుమారులూ, ఇతర బంధువులూ వచ్చిపోతూ ఉండడంతో, భవంతి అంతా సందడిగా ఉండేది. నవ్వులతో, హాస్య వినోదాలతో గృహ వాతావరణం నిండి ఉండేది. పండిట్‌జీ ఊరిలో ఉన్నపుడు గ్రామంనుండి, పరిసర గ్రామాలనుండి వచ్చే వ్యక్తులతో ఆయన గది నిండి ఉండేది.

**తన మనస్సును జయించినవాడు ప్రపంచ విజేతకన్న బలవంతుడు.**

సహపడులోని భాగవత సప్తాహంనుండి తిరిగివచ్చిన తర్వాత పండిట్‌జీకి ఒకరోజున గుండెల్లో నొప్పి వచ్చింది. కూర్చొని మాట్లాడుతూ మాట్లాడుతూ ఆ నొప్పివల్ల ఒరిగి కూలబడిపోయారు. **'నమః భగవతే వాసుదేవాయ'** మంత్రం ఆయన నోటినుండి వెలువడింది. ఆ తర్వాత మాట పడిపోయింది. ఇంటిలో అలజడి చెలరేగింది. హాస్య వినోదాలు భయాందోళనలుగా మారిపోయాయి. చుట్టూ ఉన్న వ్యక్తులు పండిట్‌జీకి సపర్యలు చేశారు. ఈ సంఘటన పగటిపూట జరిగింది. వెనువెంటనే చికిత్సకు ఏర్పాట్లు జరిగాయి. కొద్దిసేపటికి ఆయనకు స్పృహ వచ్చింది. మూడు నాలుగు రోజుల తర్వాత ఆయన మామూలు మనిషి అయినట్లు కనిపించింది.

పండిట్‌జీకి ఆరోగ్యం తిరిగి వచ్చింది. అయితే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు ఆయనకు సలహా ఇచ్చారు. గుండె జబ్బు వచ్చిందని వారు చెప్పారు. విశ్రాంతి అవసరమని చెప్పారు. పర్యటనలు చేయకూడదు. పని ఒత్తిడి తగ్గించుకోవాలి. వ్యక్తులను కలుసుకోవడం సాధ్యమైనంత తగ్గించాలి- అని సలహా ఇచ్చారు. పండిట్‌జీ అందరి సలహాలూ విన్నారు. పని ఒత్తిడి, వ్యక్తులను కలుసుకోవడం ఏమీ తగ్గలేదు. పైగా భజన, పూజలలో మరింత సమయం గడపసాగారు. అందువల్ల పురాణం చెప్పడం కొంచెం తగ్గింది.

తండ్రిగారి జబ్బును, ఆ తర్వాత ఆయనలో వచ్చిన మార్పులనూ శ్రీరామ్ చాలా నిశితంగా పరిశీలిస్తున్నాడు. రోగగ్రస్తులైన ఇతరులను కూడ అతడు చూచి ఉన్నాడు. వారు చికిత్స తర్వాత ఆరోగ్యవంతులు అవుతారు. పూర్వంవలె రోజువారీ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఎప్పటిలా పనిపాటలు చేసుకుపోతూ ఉండడానికి వారికి హెచ్చు సమయం పట్టదు. ఆహార విహారాలు, అలవాట్లు, దినచర్య, రోజువారీ వ్యవహారాలు అన్నీ యథాప్రకారం సాగిపోతాయి. జబ్బువల్ల కొంచెం నీరసం వచ్చినా, దాని ప్రభావం దినచర్యలో కానవస్తుంది. అయితే స్వభావంలో, ప్రవృత్తులలో మాత్రం మార్పు రాదు.

### తండ్రిగారి భాగవత బోధ

పండిట్‌జీ నూటికి నూరు పాళ్ళు సాత్విక స్వభావం కలిగినవారు. అయినా ఆయనలో చిత్రమైన మార్పు వచ్చింది. ఆయన తమ వ్యవహారాలన్నీ ముగించుకుంటున్నట్లు అనిపించింది. పొరుగూరికి వెళ్లేటపుడు మనిషి తన సామాను సర్దుకుంటాడు. సమయానికి పనులన్నీ పూర్తయ్యేందుకు హడావుడి పడతాడు. అలాంటి ఆతురత పండిట్‌జీలో కనిపించింది. పిల్లల పెళ్లి పేరంటాలు, తమ్ముళ్ల, చెల్లెళ్ల అవసరాలు, అభ్యాగతుల జిజ్ఞాసలు- వీటన్నిటినీ పరిష్కరించడంలో ఆయన హెచ్చు సమయం గడుపుతున్నారు.

విక్రమ శకం 1961 (క్రీ.శ. 1923)లో ఆషాఢ మాసం వస్తోంది. ఒకరోజున తండ్రిగారు శ్రీరామ్‌ను పిలిపించి ఇలా చెప్పారు- కనీసం తొమ్మిది రోజులపాటు ప్రతిరోజూ రెండు గంటలు నా దగ్గర కూర్చో. నేను చెప్పేదాన్ని శ్రద్ధగా విను.

తండ్రిగారి ఆజ్ఞ శిరోధార్యం కావలిసిందే కదా. ముందు రోజున తండ్రిగారు శ్రీరామ్‌కు క్షురకర్మ చేయించారు. ఏడు రోజుల పాటు వ్రత నియమాలు పాటించాలని అతడికి చెప్పారు. రోజుకు ఒకసారి మాత్రమే భోజనం, ఒకసారి మాత్రమే ఫలాహారం. అది ఏకాశన వ్రతం. తండ్రీ కొడుకులు ఇద్దరూ నేలమీద ప్రక్కవేసుకుని నిద్రపోయే ఏర్పాటు చేశారు.

మరునాడు ఉదయం తండ్రిగారు భాగవత పురాణం ప్రారంభించారు. అది శ్రీరామ్‌కు మాత్రమే ఏర్పాటుచేసిన శిక్షణ తరగతి. అందులో పాల్గొనడానికి ఇతరులెవరినీ పిలువరాదు. భాగవతంలోని కథా భాగం, సిద్ధాంత భాగం కలిపి ఒక రోజు పురాణం రెండు గంటలలో పూర్తయ్యేది. ఇలా భాగవతం వినిపించడం వెనుకగల ఉద్దేశ్యం ఆయనకు మాత్రమే తెలుసు. అది ఏమిటో ఆయన తన చిరంజీవికిసైతం చెప్పలేదు. భాగవతంలోని మూల సూత్రాలయిన జీవిత సత్యాలను, జగత్తు సత్యాలను పరిచయం చేయడమే ఆ ఉద్దేశ్యమేమో.

భాగవతంలోని మూల సూత్రం ఏమిటి? విషమ పరిస్థితులలో సైతం ధర్మాన్ని సాధన చేయడం. తన అభ్యుదయానికీ, నిఃశ్రేయసానికీ- ఇహపర సుఖాలకు- నిష్ఠతో కృషిచేయడం. పరమేశ్వర సమర్పితమైన జీవితాన్ని గడపడం.

పృథివిపై కలియుగం ఆరంభం కావడంతో- అనగా విషమ పరిస్థితులు, జటిలతలు, ఆత్మిక ఉన్నతికి ఆటంకాలు ఆధిపత్యం వహించడంతో- భాగవత కథ ప్రారంభం అవుతుంది. ఈ పరిస్థితులను నాశనం చేయడానికై పరీక్షిత్తు బయలుదేరతాడు. అపుడు కలియుగం క్షమించమని అతడిని కోరుతుంది. భాగవత శాస్త్రం ప్రకారం కలియగం అశుభాలకూ, వైపరీత్యాలకూ మరో పేరు. పరీక్షిత్తు కలిని దండించడం మొదలుపెడతాడు. పృథివిని విడిచిపెట్టి వెళ్లడానికి కలి అంగీకరిస్తాడు. అయితే, తనకు ఆశ్రయం

**రాగ ద్వేషాలనూ, క్రోధాన్నీ జయించడమే శౌర్యం.**

ఇవ్వమని అడుగుతాడు. పరీక్షిత్తు కలికి మొదట నాలుగు స్థలాలలో, ఆ తర్వాత అయిదు స్థలాలలో ఉండడానికి అవకాశం ఇస్తాడు. ఈ అయిదు స్థలాలలో మొదటి నాలుగు- అసత్యం, మదం, ఆసక్తి, నిర్దయ. కలి బ్రతిమాలిన మీదట అయిదవ స్థలం కూడ అతడికి ఇస్తాడు. అది రాజస గుణం. రాజస గుణం అంటే లోభం, ఆడంబరం, దర్పం, సంకుచితత్వం. ఈ వికృతులు ఉన్నచోట కవియొక్క దుష్ప్రభావం ఉంటుంది. అనగా-దుఃఖ దైన్యాలు ఉంటాయి.

ఈ దుఃఖ దైన్యాలనుండి బయటపడడానికి మార్గం ఏది? ప్రభు సమర్పిత జీవితం. ఇతర మార్గాలన్నీ సమస్యలను మరింత జటిలం చేస్తాయి. ఆపదలను మరింత భయంకరం చేస్తాయి.

ఇదీ భాగవతం ఇచ్చే ఒకే ఒక సందేశం.

శృంగిముని శాపంవల్ల పరీక్షిత్తు వారం రోజులలో మరణించవలసి ఉంది. అయినా ఆయన విచారించలేదు. ఎందుకంటే, ఆయన ప్రభు సమర్పిత జీవితం గడుపుతున్నాడు. కనుక తన చివరి వారంరోజులనూ అత్యంత ఉత్తమంగా గడపడానికి పథకం వేసుకున్నాడు. పరిస్థితులు, ఘటనలు కలిసివచ్చి, ఆయన ఆ ఏడు రోజులూ ఆధ్యాత్మిక చర్చలో గడిపాడు.

భాగవత కథ వింటూ గడిపాడు. కథ వినడం పూర్తయిన తర్వాత ఆయన మృత్యువును ఒక అతిథిలా స్వాగతించాడు. ఒక మహోత్సవం జరిపినట్లు ఆయన మృత్యువును ఆహ్వానించాడు.

ఇక్కడ- వారం రోజుల సాన్నిధ్యంలో తండ్రీ కొడుకులు భాగవత కథలను ఆస్వాదించారు. ఆ కథల ద్వారా అధ్యాత్మపై, తత్వజ్ఞానంపై చర్చ జరిపారు. జ్ఞాన, కర్మ, భక్తి మార్గాల సాగరంలో మునకలు వేశారు.

భాగవతంలోని ఏకాదశ స్కంధం విశుద్ధమైన తత్వజ్ఞానాన్ని ప్రతిపాదిస్తుంది. వేదవ్యాస భగవానుడు ఈ స్కంధంలో ముక్తికి, నిఃశ్రేయస్సు సాధనకు వివిధ మార్గాలను వివేచన చేశారు. ఆ వివేచనలో లలితమైన, మృదుమధురమైన భాషను వాడారు. సాధారణంగా- తత్వజ్ఞానంపై చర్చ నిగూఢంగా ఉంటుంది. గహనంగా ఉంటుంది. గంభీరంగా ఉంటుంది. అది పండితులకే అర్థ మవుతుంది. వేదాంతం, యోగం, సాంఖ్యం, మీమాంస మున్నగు శాస్త్రాలు ఇలాంటివి. ఈ శాస్త్రాలలో దార్శనిక సిద్ధాంతాలు గణిత సూత్రాల తరహాలో ప్రతిపాదించబడ్డాయి. భాగవతంలోని ఏకాదశ స్కంధంలో దార్శనిక సిద్ధాంతాలను కావ్య భాషలో నిరూపించారు.

## నీవు భగవానునికి చెందావు

భాగవత కథ వింటూన్న రోజులలోకూడ శ్రీరామ్ ఏకాంతంలోకి వెళ్లేవాడు. ధ్యానంలో లీనం అయ్యేవాడు. చివరి రోజు కథ వినిపించిన తర్వాత ఒక చిత్రమైన సంఘటన జరిగింది.

తండ్రిగారు కథ వినిపించే పద్ధతిలో, పాఠం చెప్పే తరహాలో భాగవతం చెపుతూ వచ్చారు. అనుష్ఠానంలోవలె విధి విధానాలు అవసరం అనిపించలేదు. కనుకనే, పూర్ణాహుతి రోజున యజ్ఞ యాగాలు, భోగం అర్పించడం మున్నగు కార్యక్రమాలు జరగలేదు.

కథ విన్న తర్వాత కుమారుడు తండ్రిగారిని ఇలా అడిగాడు- కథా శ్రవణం తర్వాత దక్షిణ ఇస్తారు కదా. కానుకగా నేను మీకు ఏమివ్వను?

తండ్రిగారు తన అనుంగు తనయుని ముఖం చూస్తూ ఉండిపోయారు. శ్రీరామ్ అదే ప్రశ్న మళ్లీ అడిగాడు. పండిట్‌జీ పిల్లవాడి చేయి పుచ్చుకుని అతడిని దగ్గరకు లాక్కున్నారు. గుండెలకు హత్తుకున్నారు. ఆ ప్రశ్నకు జవాబు మాత్రం ఇవ్వలేదు. శ్రీరామ్ మూడవసారి అదే ప్రశ్న అడిగాడు.

"నిన్ను నీవు కానుకగా ఇవ్వు." -అని తండ్రిగారు జవాబిచ్చారు.

నేను మీవాడినే కదా. నన్ను నేను భగవానునికి కానుకగా సమర్పించుకోవా లన్నది మీ ఉద్దేశ్యం అయితే- అందుకోసం సంకల్పం చేయించండి- అని శ్రీరామ్ కోరాడు.

తండ్రిగారు చేతిలో జలం తీసుకుని శ్రీరామ్‌చేత సంకల్పం చేయించారు.

తండ్రిగారినుండి ఆశీస్సు పొందిన తర్వాత శ్రీరామ్ మామూలు ప్రకారం ఏకాంతంలోకి వెళ్లిపోయాడు. గుహలోకి వెళ్లిన సంఘటన నాటినుండి అతడు అడవిలోకి వెళ్లడం మానివేశాడు. అయితే, అతడు ఎక్కడికి వెళతాడో తల్లికి తప్ప మరెవరికీ తెలియదు. ఆ రోజున అతడు ఏకాంతంలోకి వెళ్లిన తర్వాత

**భూత భవిష్యత్తుల చింత వదలి వర్తమానంలో శాంతంగా, స్థిరంగా ఉండడమే మానసిక ఆరోగ్యం.**

గంటలు గడిచిపోయాయి. సాయంత్రం అవుతోంది. అయినా అతడు తిరిగిరాలేదు. తల్లి ఆందోళన పడింది. పిల్లవాణ్ణి ఎక్కడికి పంపారు. ఇంతవరకు తిరిగిరాలేదు- అని ఆమె పండిట్‌జీని అడిగింది. పండిట్‌జీకూడ కలత చెందారు. అతడు హిమాలయం వెళ్లడానికి బయలుదేరిన సంఘటన ఆయనకు గుర్తుకువచ్చింది. నొచ్చుకుంటూ ఆయన ఇలా జవా బిచ్చారు- ఎక్కడికైనా వెళ్లిపోలేదు కదా. తల్లికికూడ ఆ అనుమానం కలిగింది. అయినా, తనను తాను సంబాళించుకుంటూ ఇలా అన్నది- గౌరీబాగ్ శివాలయంలో ఒకసారి వెదికించండి. భక్తి తన్మయత్వంలో అక్కడే ఉండిపోయాడేమో చూడండి.

గౌరీబాగ్ గ్రామానికి మైలు మైలున్నర దూరంలో ఉన్న ఒక చిన్న తోట. ఆ తోటలో మామిడిచెట్లు, జామచెట్లు, వేపచెట్లు ఉన్నాయి. ఏడాది పొడుగునా అక్కడ ప్రశాంతంగా ఉంటుంది. సోమవారం, పూర్ణిమ, శివరాత్రి రోజులలో జనం శివాలయానికి వస్తారు. మిగతా రోజులలో అక్కడ ప్రశాంతంగా ఉంటుంది. ఈ తోటలోనే శ్రీరామ్ తన ఏకాంతం, ధ్యానం సాగించేవాడు.

## గహనమైన ధ్యాన సమాధిలో

తండ్రిగారు స్వయంగా పరుగు పరుగున ఆ గౌరీబాగ్‌కు వెళ్లారు. ఆయన వెంట ఇద్దరు ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. అక్కడ శ్రీరామ్ ఒక చెట్టుక్రింద పద్మాసనంలో ధ్యానముద్రలో కూర్చొని ఉండడం చూచారు. పండిట్‌జీ అతడిని పిలిచారు. సమాధానం లేదు. శ్రీరామ్ నిశ్చలంగా కూర్చొని ఉన్నాడు. ఆయన రెండవసారి, మూడవసారి, నాల్గవసారి పిలిచారు. ప్రయోజనం లేకపోయింది. అతడి చేతులు పుచ్చుకుని ఊగించే ప్రయత్నం చేశారు. కొద్ది ఒత్తిడి తగలగానే శ్రీరామ్ ముందుకు పడిపోయాడు. ధ్యాన సమయంలో ఒడిలో పెట్టుకున్న చేతులు ఊగించిన కారణంగా ప్రణామ స్థితిలో కలుసుకున్నాయి. ప్రణమిల్లడానికి ముందుకు వంగి నుదురు నేలకు తాకించిన స్థితిలో అతడు ఉన్నాడు. వంగిన తర్వాత ఆ స్థితిలోనే ఉండిపోయాడు. పండిట్‌జీ ముఖంలో ఆందోళన కనిపించింది. బాబూ, బాబూ అన్నారు. పేరు పెట్టి పదిమారులు పిలిచారు. అతడిని ఇటూ అటూ ఊగించడానికి, త్రిప్పడానికి ప్రయత్నించారు. గట్టిగా పట్టుకుని కూర్చొనబెట్టాలని చూచారు. కాని శ్రీరామ్ శరీరం బిగుసుకుపోయి ఉంది. అశక్తమై ఉంది. అశుభాన్ని శంకించి, ఆయన గోళ్లవద్ద వ్రేళ్లు ఉంచి చూచారు. నాడి పరీక్షించారు. గుండె కొట్టుకుంటోందో లేదో పరిశీలించారు. ఆ విధంగా అతడిలో ప్రాణం ఉన్నదో లేదో కనుగొనే ప్రయత్నం చేశారు. అయినా ఒక నిర్ణయానికి రాలేకపోయారు. తండ్రిగారి నోటినుండి తీవ్రమైన రోదన ధ్వని వెలికివచ్చింది. ఆయనవెంట వచ్చిన వ్యక్తుల ముఖాలు పాలిపోయాయి.

ఆ ధ్వనికి శ్రీరామ్ ధ్యాన సమాధినుండి వెలికివచ్చాడు. అతడు తనకు తానుగా లేచి కూర్చున్నాడు. తనను తాను సంబాళించుకునే ముందు తండ్రిగారికి అభివాదనం చేశాడు. కుమారుడు ప్రణామం చేయగానే, పండిట్‌జీకి తన పిల్లవాడు తనకు దక్కాడనే నమ్మకం కలిగింది. "నీవు మరో లోకానికి వెళ్లిపోయావని నేను భయపడ్డాను''- అని ఆయన అన్నారు.

శ్రీరామ్ వెంటనే జవాబు చెప్పలేదు. ఇంటికి వెళ్లిన తర్వాత తండ్రిగారు అదే మాట తిరిగి చెప్పారు. భగవానునికి ధన్యవాదాలు చెప్పసాగారు. అప్పుడు శ్రీరామ్ ఇలా అన్నాడు-

"మీరు దేవునికి ధన్యవాదాలు ఎందుకు చెపుతున్నారు? మీరు నన్ను దేవునికి అప్పగించి ఉన్నారు కదా. నేను ఇకనుండి ఆయన పనే చేయాలని నాకు ఆశీస్సు ఇవ్వండి.''

తాఈజీ అప్పుడు అక్కడే ఉంది. ఆమెకు ఈ మాట ఏమాత్రం నచ్చలేదు. ఆమె భర్తతో ఇలా అన్నది - "మీరు శ్రీరామ్‌కు ఏమేమి నూరిపోశారో నాకు అర్థంకావడం లేదు. నాకు ఈ మాటలవల్ల విపరీతంగా భయం కలుగుతోంది.''

శ్రీరామ్ కొన్నిరోజుల తర్వాత ఆ అనుభవం గురించి తన మిత్రులతో చెప్పాడు. తనను తాను భగవానునికి సమర్పించుకున్న తర్వాత తన మనస్సులో అపూర్వమైన శాంతి స్థిరపడిన అనుభూతి కలిగింది. ధ్యానంలో కూర్చొనగానే ప్రపంచం అదృశ్యం అయిన అనుభూతి కలిగింది. తన చుట్టుపక్కల ఏమీలేని అనుభూతి. ధ్యానంలో అలా ఎంతసేపు కూర్చొనడం జరిగిందో ఏమాత్రం తెలియలేదు. అయితే ఆ సమయంలో ఒక అద్భుత సంఘటన జరిగింది. అది ఒక ఆంతరిక అనుభూతి. అదొక కల. అదొక దివ్య దర్శనం. దాన్ని గురించి శ్రీరామ్ ఏమీ చెప్పలేదు. ప్రత్యక్షంగా జరుగుతూన్నట్లు అనిపించిన సంఘటన యొక్క అనుభూతి అది. అది జరిగిన సమయంలో కూడ ధ్యానంలో ఉన్నట్లు తనకు అనిపించలేదు.

H H H

**ద్వేషించని, కోరని వ్యక్తి నిత్య సన్యాసి.**

మాతాజీ దివ్య జీవనం - 11

# వ్యక్తమైన మహాశక్తి మహిమ

శాంతికుంజ్, బ్రహ్మవర్చస్, గాయత్రీ తపోభూమి కార్యకర్తలు, గాయత్రీ పరివార్ పరిజనులు ముందే తమ మాతలోని మహిమాన్వితమైన శక్తితో సుపరిచితులు. ఆమె శక్తులమీద ఇతరులకి అనుమానా లుండేవి. వారిని రకరకాల శంకలు, కుశంకలు చుట్టుముట్టి ఉండేవి. ఈ మిషన్ ఎవరిద్వారా నిర్వహించబడుతోంది? ఎలా జరుగుతోంది? అని వా రాలోచించే వారు. ఇటువంటి మాటలు ముక్కలు ముక్కలుగా అనేకమంది మనోభావాలలో కలసి వందనీయ మాతాజీ వరకు చేరుకునేవి. కానీ మాతాజీ మీద వీటి ప్రభావం పడలేదు. ఆమె బ్రహ్మదీప యజ్ఞం సమాప్త మవగానే తన ఆరాధ్యుని చరణాలకు భావపూరిత శ్రద్ధాంజలి అర్పించడానికి తగు ప్రయత్నాలు చేయటంలో నిమగ్నమైంది. ఆమె దీనిని ఒక విశ్వవ్యాప్త ఉత్సవంగా రూపొందించడానికి నిశ్చయించుకుంది. తద్వారా ఆమెయేకాక ఆమె సంతానం కూడా తమ ప్రభువుకు తమ భావములు, శ్రద్ధ సమర్పితం చేయగల్గుతారు.

28 ఏప్రియల్ 1990లో బ్రహ్మదీప యజ్ఞములు చేయాలనే సంకల్పమును పరమపూజ్య గురుదేవులు స్వయంగానే నిర్ణయించారు. ఏకాంత వాసంలో ఉన్నప్పటికీ ఆయన ఆ రోజు దగ్గరగా ఉన్న కార్యకర్తల సమావేశం ఏర్పరచి 7-8 జూన్ జ్యేష్ఠ పూర్ణిమనాడు భోపాల్, కోరబా, ముజఫర్‌పూర్, అహ్మదాబాద్, లక్నో, జైపూర్‌లలో ఈ యజ్ఞములు జరపాలని నిర్ణయించారు. క్రమశిక్షణ కలిగిన ఆయన పరిజనులు తమ సద్గురువు ఆదేశం శిరసావహించి జూన్ 2, 1990 నాడు ఆయన మహాప్రయాణ సమాచారం అందినా తమకు అప్పచెప్పబడిన పనిని పరిపూర్ణంగా చేయుటకు ఏకనిష్ఠులై పనిచేస్తూనే ఉన్నారు. అందరి భావనలలో తడబాటులున్నా గురుదేవుల ఆదేశం సర్వోపరి. ఎవరు కూడా గురుదేవుల ఆదేశాలను నెరవేర్చుటలో ఏ విధమైన ఏమరపాటు చేయలేదు. కానీ అందరి మనస్సులో శాంతికుంజ్ వెళ్ళి తమ ప్రభువుకు శ్రద్ధాంజలి అర్పణ చేయాలని ఉంది, ఆయనకు తమ భావ పుష్పములు అర్పించాలని ఉంది.

తమ బిడ్డల మనో భావములు మాతాజీకి తెలుసు. ఆమెకు తన సంతానం బాధ తెలుసు. అందుకోసమే ఆమె సంకల్ప శ్రద్ధాంజలి ఉత్సవం జరప బడుతున్నదని ప్రకటించారు. దీనికి ఏర్పాట్లు చేయడం ఒక సవాలే. జూన్ నెలలో పదిహేను రోజులు, జూలై, ఆగస్ట్, సెప్టెంబరు నెలల వ్యవధి మాత్రమే ఉన్నది. ఇందులో కూడా చాలాకాలం వర్షాకాలం. ఇంత స్వల్ప వ్యవధిలో కుంభమైళా లాంటి కార్యక్రమం నిర్వర్తించవలసి ఉన్నది. కుంభమేళాకి ప్రభుత్వం తన సామర్థ్యంతో, వనరులతో ఒక సంవత్సరం ముందునుంచి ఏర్పాట్లకి ప్రయత్నం మొదలుపెడుతుంది. కానీ ఇక్కడ ఏవిధమైన ప్రభుత్వ సహకారం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. 1990లో ఉత్తర భారత దేశస్థులకు మాత ఇచ్చే ఒక సంకేతం ద్వారా ఆమె సంతానం ఏమి చేయగలదో చూసే అవకాశం వచ్చింది. ఉపాధ్యాయులు, రైతులు, న్యాయాధీశులు, చికిత్సకులు, ఇంజనీర్‌లు, కలెక్టర్ మొదలగు అధికారులు ఎందరో ఈ మిషన్‌తో సంబంధాలు కలిగి, వీరిలో 20 వేలమంది స్వచ్ఛంద సేవకులుగా సెప్టెంబరుకే వచ్చేశారు. రాగానే ఏ విధమైనటువంటి ఉద్యోగ స్థాయి లేక చదువు స్థాయి, జాతివర్ణముల పట్టింపు లేకుండా అందరూ తమకు ఇవ్వబడిన పనిలో నిమగ్నమయ్యారు.

ఇ.పి.టెంట్‌లు, షామియానాలు, విద్యుత్, నీరు మొదలగు వ్యవస్థ, ఎత్తుపల్లాలు ఉన్న స్థలము చదునుచేయుట, భోజనము కొరకు కావలసిన పెద్ద గుంటలు మొదలగునవి ఏర్పాట్లు చేయుట - ఇలాంటి అనేక పనులు వీరందరూ కలసి మెలసి పూర్తిచేశారు. ఈ పనులన్నీ చాలా విశాలమైన క్షేత్రంలో ఏర్పాటు చేయబడ్డాయి. పూర్తి హరిద్వార్ నగరంలో పదిహేను మైళ్ళ పొడవు, ఎనిమిది మైళ్ళ వెడల్పు ఉన్న క్షేత్రంలో కన్‌ఖల్ నుంచి మోతీచూర్ వరకు ఇరవై నాలుగు నగరములు నిర్మించటానికి వ్యవస్థ చేయబడింది. ఈ పనులన్నీ జరుగుతున్నప్పుడు వందనీయ మాతాజీ స్వయంగా మొత్తం క్షేత్రం పర్యటించిరి. ఒక్కొక్క చోట ఆమె కారు దిగి వచ్చి పనిచేస్తున్న వారి ఉత్సాహమును పెంచింది. పనిచేస్తున్న కార్యకర్తలు కూడా ఆమె

**ఎంత మంచి పని చేసినా, ఫలితంపై దృష్టి ఉంటే బాధ తప్పదు.**

తమకు అంత దగ్గరగా రావటం చూసి ఆనందించారు. మాతాజీ ఈ విధంగా ఒక రోజు హఠాత్తుగా అన్ని చోట్లకి వెళ్ళటం జరిగింది. దీని గురించి అడిగినపుడు మొదట, "పిల్లలు పనిచేస్తున్నారు. నేనక్కడికి వెళితే వాళ్ళకి హుషారుగా ఉంటుంది" అంది.

ఆమెను ఇంత మాత్రమేనా, లేక ఇంకా ఏమైనా ఉన్నదా? అని అడిగినపుడు ఆమె కొంచెం ఆలోచిస్తూ ఇలా చెప్పారు- చూడండి, పిల్లలు పనిచేస్తున్న ప్రదేశాలలో భయంకరమైన విష సర్పా లున్నాయి. అవి కాటువేస్తే మనిషి మంచినీరు కూడా అడగడు. నేను వాటిని అక్కడనుంచి పంపించి వేయుటకు వెళ్ళాను. నేను ఈ విషజీవాలకు - మీరు ఇక్కడ నుంచి వెళ్ళిపొండి అని చెప్పాను. ఇప్పుడు ఇక్కడ పని జరుగుచున్నది. చాలామంది ఇక్కడకు వస్తారు. అటువంటప్పుడు మీరందరు ఇక్కడ ఉండటం మంచిది కాదు, అన్నాను. నా మాటలు ఆ విష ప్రాణులకు అర్థమయ్యాయి. ఇంక అవి వెళ్ళిపోతాయి. అడిగిన వ్యక్తికి మాతాజీ మాటలు సమంగా అర్థం కాలేదు కాబోలు. అతను మళ్ళీ అడిగాడు - "మాతాజీ, ఈ విషజీవులను చంపేయవచ్చుకదా." ఈ మాట వినగానే మాతాజీ స్వరం చాలా తీవ్రమైంది - "ఏం? ఎందుకు చంపాలి? అవి మీకు ఏ విధమైన హాని కలగజేశాయి? వారు నివసించే స్థలములను సర్వనాశనం చేయటమేకాక మీరు వాటిని చంపుతారు కూడానా? అవి నా సంతానం కాదా ఏమిటి?" ఈ మాటలు వినే వ్యక్తిని కుదిపివేశాయి. మాతాజీ మనుష్యులకే కాక సమస్త ప్రాణులు, వనస్పతులు, పశుపక్ష్యాదులకి కూడా తల్లే. అందుకే అవి ఆమె మాటలు వింటాయి. అర్థం చేసుకుంటాయి. మాతాజీ కూడా అన్ని ప్రాణుల భావాలు అర్థం చేసుకో గల్గుతుంది.

ఇటువంటి మమతామయి మాత ప్రేమతో తడిసిన వేలాదిమంది ప్రజలు శ్రద్ధాంజలి ఉత్సవం ఏర్పాట్లు చేయటంలో నిమగ్నులై ఉన్నారు. ఈ ఏర్పాట్లలోని ప్రతి అడుగులో మాతాజీ మహిమ ప్రకటిత మవుతూనే ఉన్నది. అనుమానాలున్న కొంతమంది 'ఇంత విస్తృత స్థాయిలో ఏర్పాట్లు జరుగుచున్నవి. అంతమంది వస్తారా ఏమిటి?' అని సందేహ పడుతున్నారు. వారి ఆలోచనలలో కొంత అర్థ మున్నది. ఎందుకనగా అప్పుడు అయోధ్య గందరగోళంలో, మండల్ కమిషన్ ప్రతిక్రియగా దేశవ్యాప్తమైన ఆందోళన జరుగుచున్నది. బస్సులు, రైళ్లు, కార్లు చివరకు ఫైర్‌బ్రిగేడ్ వాహనాలు కూడా కాల్చి వేయబడుతున్నాయి. రోడ్లు, ప్లాట్‌ఫార్మ్‌ల మీద విచిత్రమైన ఏకాంత మున్నది. మనుష్యుల రాకపోకలు లేవు. కానీ మహాశక్తి మహిమ ఇటువంటి పరిస్థితులలో కూడా తన చమత్కారం చూపించింది. శ్రద్ధాంజలి ఉత్సవానికి ఎంతమంది వ్యక్తులు రావల్సిఉన్నారో అందరూ వచ్చారు. ఈ లక్షలాదిమంది మనుష్యులకు మార్గంలో ఏ విధమైన ఉపద్రవం ఎదురవలేదు. ఏవిధమైన జన, ధన హాని జరగలేదు. అక్టోబరు 1 నుంచి 4 వరకు జరిగిన అన్ని కార్యక్రమాలలోను పూర్తిగా పాలుపంచుకున్న పరిజనుల సంఖ్య 5లక్షలు దాటింది. రోజువారీగా ఒక లక్షమందికంటే ఎక్కువ మంది వస్తూ, వెళుతూ ఉండేవారు. హరిద్వార్ మొత్తం పసుపు పచ్చని బట్టలు కట్టుకొన్న స్త్రీ పురుషులతో నిండిపోయింది.

నగరం, ఇతర ప్రాంతాల పత్రికా విలేఖరులు, దూరదర్శన్, ఆకాశవాణి ప్రతినిధులు అందరూ ఈ వ్యవస్థను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. ఆనాటి ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ శ్రీసత్యనారాయణరెడ్డి గారుకూడా ఈ కార్యక్రమానికి వచ్చారు. ఆయన ఈ ఏర్పాట్లన్నీ చూసి ఇదంతా ఖచ్చితంగా దివ్యమైనది, దైవీప్రేరణతో జరిగినదని తన భావాలను తెలిపారు. శరత్ పూర్ణిమ సాయంకాలం ఈ దివ్యత ఇంకా ఎక్కువ దీప్తివంతమైంది. సాయంత్రం 6.30కు దీపయజ్ఞం ప్రారంభానికి ముందే ఆ విశాల సభా ప్రాంగణమంతా పూర్తిగా నిండిపోయింది. 1,20,000 దీపముల విరాట్ మహాయజ్ఞం ప్రారంభమైనది. "యన్మమండలం దీప్తికరం విశాలం" స్వర లహరి మధ్య దీపములన్నీ వెలిగాయి. ఈ దృశ్యం కన్నులారా చూడవలసిందే. అది శరత్ పూర్ణిమ రాత్రి కానీ పూర్ణిమ చంద్రుడుకూడా చిన్నచిన్న దీపముల సమన్విత కాంతి ముందు చిన్నబోయాడు. మహాశక్తి మహిమ ఈ లెక్కలేనన్ని దీపముల కోటి కోటి జ్యోతి కిరణాల నుంచి ప్రకటితమవుతున్నది.

అక్టోబరు4, 1990. వీడ్కోలు సమయం ఆసన్నమైనది. అందరి హృదయాలు బరువెక్కాయి. మహాశక్తి చేసిన అనేక చమత్కారాలు చూసే అవకాశం ఈ రోజులలో చాలా మందికి వచ్చింది. ఆ చమత్కారాలలో ఒకటి ఏమిటంటే - లక్షలాదిమంది నిత్యం భోజనం చేసినా, శాంతికుంజ్ అన్న

**తపస్సు అంటే తీవ్రమైన నిష్ఠ.**

భాండాగారం పరిపూర్ణంగా నిండి ఉన్నది. ఎవరికీ ఎక్కడా ఏలోటూ రాలేదు. అన్నపూర్ణ ఎలాగ ఎప్పుడు ఈ చమత్కారం చేసినదో తెలియదు! తమ తల్లినుంచి వీడ్కోలు తీసుకుంటున్న పరిజనులందరూ మాతాజీ తమ తల్లే కాక పూర్తి దేశానికి తల్లి, ఆమె దేశానికి ప్రాణదాయిని శక్తి అని అనుభూతి చెందారు.

## సంస్కృతి సంవేదనల విస్తరణ

మాతృసత్తాలోని జాతీయ సంవేదనల అనుభూతి గతంలో కూడా అందరికీ అప్పుడప్పుడు లభించేది. కానీ శ్రద్ధాంజలి ఉత్సవం తర్వాత జాతి కొరకు ఆమెలో కలత అధికమైంది. ఎటువంటి అనుష్ఠానముల పరంపర ఆచరిస్తే జాతి ప్రాణములకు నూతన స్ఫూర్తి లభిస్తుందో, దేశ సంస్కృతి సంవేదనలు పూర్తిగా విస్తరించగలవో అని ఆమె నిరంతరం ఆలోచిస్తూ ఉండేది. ఆ రోజులలో తమ దగ్గరఉన్న వాళ్ళతో ఆమె చర్చిస్తున్నప్పుడు ఈ ఆలోచనలు బహిర్గతమవుతూ ఉండేవి. మిషన్ పనులన్నీ చేసుకుంటూ మాతాజీ దేశాన్ని పటిష్టం చేయుట గురించి నిరంతరం ఆలోచిస్తూ ఉండేది. ఈ ఆలోచనలతో, చర్చలతో చాలాకాలం గడిచిపోయింది. శాంతికుంజ్ క్రియాకలాపాలలో అనేక క్రొత్తక్రొత్త కార్యక్రమాలు ఈ కాలంలోనే జోడించబడ్డాయి. పరమ వందనీయ మాతాజీ పర్యవేక్షణలో, ఆమె సూత్ర సంచాలనలో ముందుకంటే వ్యవస్థ అత్యంత తీవ్రగతితో సజావుగా ముందుకు సాగుచున్నది.

ఈ కాలములోనే ఆమె హిమాలయ యాత్రకు ప్రణాళిక వేసుకుంది. ఈ ఆలోచన హఠాత్తుగా తీసుకున్న నిర్ణయం. మాతాజీ హిమాలయాలకి వెళుతుందని తెలిసి దగ్గరగా ఉన్న పరిజనులు కొద్దిగా భయపడ్డారు. మాతాజీ హిమాలయాలలోనే ఉండిపోవాలని అనుకుంటారేమో అని భయపడ్డారు. అనేక మందికి ఆమె హిమాలయాల హిమ శిఖరముల మధ్య మహాసమాధి తీసుకోదలుచుకున్నారా అనే అనుమానంకూడా వచ్చింది. ఎందుకంటే గురుదేవులు లేకపోవటం వల్ల ఆమె మనస్సు ఏ విధంగానూ ప్రపంచంలో నిలబడుట లేదు. అంతర్యామి అయిన జననివద్ద తన పిల్లల మనస్సులోని ఈ అనుమానాలు దాగలేవు. ఆమె నవ్వుతూ ఇలా అన్నది - "గురూజీ లేకుండా ఈ దేహం నిలబెట్టుకోవడం నాకు చాలా కష్టంగానే ఉంది. కాని నా పిల్లలంటే కూడా ప్రేమ తక్కువగా లేదు. నేను ఇంకా కొన్ని రోజులు మీ కొరకు ఉంటాను. ఇక్కడే శాంతికుంజ్‌లోనే ఉంటాను. హిమాలయాలు వెళ్ళుటకు వేరే కారణా లున్నాయి. అవి నేను తిరిగి వచ్చాక మీకు తెలుస్తాయి."

అందరికీ ఈ విధంగా తాను తిరిగి వస్తుందనే నమ్మకం కలిగించాక ఆమె హిమాలయాలలోని గంగోత్రికి యాత్ర మొదలుపెట్టింది. ఆమెతో పాటు శైల దీదీ, డాక్టర్ ప్రణవ పండ్యా, చిన్మై కొంతమంది ఇతర కుటుంబాల వారు వచ్చారు. ఇద్దరు, ముగ్గురు అదృష్టవంతులైన వ్యక్తులుకూడా ఈ యాత్రలో పాలుపంచుకోగల్గారు. హిమశిఖరాల మధ్యకు చేరుకున్న మాతాజీ భావాలలో ఒక విచిత్రమైన మార్పు కనిపించింది. ఆమెను చూసేవారికి ఒక ఆడపడుచు తన పుట్టింటికి వచ్చినట్లుగా అనిపించింది. ఈమె తనంతట తానుగాకాక తండ్రి అయిన హిమవంతుని పిలుపుతో అక్కడకు వచ్చినట్లు ఉన్నది. కాంతివంతమైన ఆమె ముఖమండలం మీద ఆనందరేఖలు ప్రస్ఫుటిత మయ్యాయి. అనేక స్థలములలో ఆమె ఆగి ధ్యానమగ్నురాలైంది. గంగోత్రి వద్ద భగీరథ శిలమీద ఆమె చాలాసేపు ధ్యానమగ్నురాలై కూర్చుంది. అక్కడ ధ్యానంనుండి బయటకు వచ్చాక ఆమె ముఖంలో ఒక విశేషమైన నిర్దేశం పొందిన ప్రసన్నత కనిపించింది. ఇక్కడే ఆమె యాత్రను విరమించి శాంతికుంజ్‌కు తిరిగి వచ్చారు.

తిరిగి వచ్చాక ఆమె ఒక భవ్య శపథ ఉత్సవంలో రాష్ట్రవ్యాప్త అశ్వమేధ మహాయజ్ఞముల గురించి ప్రకటన చేసింది. ఈ ప్రకటన చేస్తున్నప్పుడే ఈ సందేశం తమకు హిమాలయాల నుండి లభించినదని తెలిపారు. హిమాలయాలలో నివసించే దివ్యశక్తులు దేశాన్ని సమర్థవంతంగాను, శక్తివంతంగాను చేయుటకు అశ్వమేధ మహాయజ్ఞ మహానుష్ఠానాలు చెయ్యాలి, చేసి తీరాలని తెలిపారు. అంతేకాక మాతాజీ మహాయజ్ఞాలకు తాను స్వయంగా వస్తున్నానని తెలిపింది. ఆమె వస్తుందని తెలిసిన పరిజనుల ఉత్సాహం ఆకాశాన్ని అందుకుంది. అందరూ తమతమ క్షేత్రాలలో ఈ మహాయజ్ఞమును నిర్వహించుటకు పోటీపడ్డారు. కానీ ఈ అదృష్టం కొన్ని విశేష స్థలములకు మాత్రమే లభించింది. మాతాజీ తన పర్యవేక్షణలో ఈ మహాయజ్ఞ కర్మకాండను తయారు చేయించింది. పరిజనులకు

**శ్రద్ధ అంటే ఆచరించడంలోని నిత్యనూతన శక్తి.**

దీని విస్తృత వివరణ ఇచ్చుటకు అఖండజ్యోతి సంపాదక మండలి నవంబరు 1992 అఖండజ్యోతి పత్రికను అశ్వమేధ యజ్ఞ ప్రత్యేక సంచికగా అందించిరి. క్షేత్రాలలో చాలా విస్తృతమైన ఏర్పాట్లు దీని కొరకు చేయబడ్డాయి. ఈ పనులన్నీ వందనీయ మాతాజీ పర్యవేక్షణలో పూర్తిచేయబడ్డాయి.

ఈ ఏర్పాట్లు పూర్తికాగానే పరమ వందనీయ మాతాజీ జైపూర్‌లోని ప్రథమ అశ్వమేధం కొరకు తన యాత్ర ప్రారంభించింది. ఈ యాత్ర భిలాయి (మధ్యప్రదేశ్), గునా (మధ్యప్రదేశ్), భువనేశ్వర్ (ఒరిస్సా), లక్నో (ఉత్తరప్రదేశ్), భడౌదా (గుజరాత్), భోపాల్ (మధ్యప్రదేశ్), నాగ్‌పూర్ (మహారాష్ట్ర), బ్రహమపుర్ (ఒరిస్సా), కొరబా (మధ్యప్రదేశ్), పట్నా (బీహార్), కురుక్షేత్ర (హరియానా), చిత్రకూట (ఉత్తరప్రదేశ్) మొదలగు స్థలాలలో జరిగే అశ్వమేధ మహాయజ్ఞముల వరకు సాగింది. ఈ స్థలాలన్నింటికి వెళ్ళటానికి పరిపాలనా వ్యవస్థ ఆమెకు ప్రభుత్వ విమానమును ఇచ్చింది. ఆమెకు రాజకీయ అతిధిగా సన్మానం ఇవ్వబడింది. శ్రీయుతులు దిగ్విజయ్‌సింగ్, లాలూ ప్రసాద్ యాదవ్, బిజూ పట్నాయక్, చిమన్‌భాయి పటేల్ మొదలగు అనేక రాష్ట్రముల అప్పటి ముఖ్యమంత్రులు ఆమె వాత్సల్యం పొంది అనుగ్రహితులయ్యారు. అప్పటి మధ్యప్రదేశ్ గవర్నర్ మహమద్ షెఫీ కురైశీ, అప్పటి ఉత్తర్ ప్రదేశ్ గవర్నర్ శ్రీ మోతిలాల్ వోరా, అప్పటి ప్రతిపక్ష నేత శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి మొదలగు అనేక విశిష్ట వ్యక్తులు ఈ అశ్వమేధ కార్యక్రమాలలో పాల్గొని, మాతాజీ హృదయంలో సంపూర్ణ దేశం కొరకు వాత్సల్యం నిండి ఉందని గుర్తించారు.

మాతాజీ అశ్వమేధ యాత్ర అనుభూతులు, జ్ఞాపకాలు అద్భుతమైన అనేక ఖండములు గల గ్రంథంగా ప్రచురించవచ్చు. ఆమె ఎక్కడికి వెళ్ళినా, ఉన్న తక్కువ సమయంలో అక్కడి కార్యక్రమములలో పాల్గొని, ఆ తరువాత అనేక మందిని కలిసేది. అతి విశిష్ట వ్యక్తులనుంచి అతి సామాన్య వ్యక్తుల వరకు అందరూ ఆమెను కలసి ధన్యులయ్యారు. సమయం లేకుండా ఇంత బిజీగా ఉన్నా ఆమె తన భావుకులైన పిల్లలను మరువలేదు. వారి ఆహ్వానంపై వారి ఇళ్ళకు కూడా వెళ్ళింది. దేశంలో ఈ విధంగా అనేక ఇళ్ళు ఆమె చరణ ధూళితో తీర్థములుగా మారాయి. ఆమె ఆ రోజు ఎక్కడ కూర్చున్నదో ఆ స్థలమును అనేకులు తమ ఉపాసనా క్షేత్రంగా చేసుకున్నారు. వీరు తరువాత రోజులలో అనేక దివ్య అనుభూతులు పొందారు. వారి అంతర్ చేతనలో ఒక అలౌకిక కాంతి అవతరించింది.

ఆమె ఎక్కడికి వెళ్ళినా వరదానాలు, ఆశీస్సులు పంచిపెట్టారు. అనేర స్థలములలో ఆమెను అనేక పాత గుర్తులు చుట్టుముట్టాయి. ఆమె ఇదివరకు వేరొక రూపంలో అక్కడకు వచ్చినట్లు అనుభూతి చెందేది. చిత్రకూటంలో ఈ సత్యమును అందరూ ప్రత్యక్షముగా కళ్ళారా చూశారు. చిత్రకూట అశ్వమేధంలో ఆమె శారీరకంగా చాలా బలహీనంగా ఉన్నది. ఈ శారీరక అశక్తత ఉన్నప్పటికీ ప్రభుశ్రీరామ్, మాతా సీత, తమ్ముడు లక్ష్మణునితోపాటు ఎక్కడికి వెళ్ళాడో ఆ స్థలాలన్నింటికి వెళ్ళింది. ఈ స్థలాలలో వారికి అనేక ఋషిమునుల సాంగత్యం లభించింది. మాతాజీ ఈ స్థలాలన్నింటికి పట్టుబట్టి వెళ్ళింది. కామదగిరి, స్ఫటికశిల, గుప్త గోదావరి మొదలగు అన్ని స్థలాలకి ఆమె అత్యంత శ్రద్ధా భావాలతో నిండిన మనస్సుతో యాత్ర చేశారు. ఈ స్థలాలన్నింటిని ఆమె ఆ చుట్టుపక్కలే తన శ్రీరాముడు ఉన్నాడా అన్నట్లు చూసింది. స్ఫటికశిల మీద అయితే ఆమె కొద్దిసేపు కూర్చుందికూడా. కూర్చుంటూ ఇలా అంది - 'చూడు! కాలం మారిపోతే ఎంత మార్పు వస్తుందో. త్రేతాయుగంలో ఇంకోలాగా ఉండేది. ఇప్పుడు ఇలా ఉంది'.

విన్నవాళ్ళకి కొంత అర్థమైంది. కొంత అర్థం కాలేదు. మళ్ళీమళ్ళీ అడిగినప్పుడు ఆమె చిన్నగా నవ్వింది అంతే. తమ పిల్లలకు ఆనందాన్నిస్తూ, జాతి ప్రాణాలలో నూతన స్ఫూర్తి కలిగిస్తూ ఆమె ఈ యాత్ర కొనసాగుతోంది. ఆమె ఈవిధంగా యాత్రలు చేయటం చూచి విదేశాలలో ఉన్న పరిజలనుల మనస్సులో వారి మాత వారి వద్దకు కూడా వస్తే బాగుంటుందనే కోరిక తీవ్రమైనది. వారి ఇళ్ళుకూడా విశ్వజనని చరణ ధూళితో తీర్థ భూములుగా మారాలి. తన విదేశీ పిల్లల ఈ పిలుపును ఆమె త్రోసిపుచ్చలేకపోయింది. అందరి ప్రబల ప్రేమ కారణంగా విశ్వమాత విశ్వయాత్ర కొరకు తన అంగీకారం తెలిపింది. ఆమె చెప్పిన వస్తాను అనే మాటతో అనేక హృదయాలు పులకించి ప్రఫుల్లితమయ్యాయి.

H H H

**ఒక్కరిమీదనే ఉండే ప్రేమ బంధించబడిన ప్రేమ లేక మమకారం.**

## యుగ గీత

# ఏది పాపం, ఏది పుణ్యం ?

కృష్ణ పరమాత్మ సాధకులకు రానున్న అనుమానాన్ని ముందే ఊహించి, తర్వాతి శ్లోకంలో ఇలా చెపుతున్నారు-

**యథైధాంసి సమిద్ధోగ్నిర్ భస్మసాత్ కురుదేర్జున।**
**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా॥ -4:37**

అనగా-

ఓ అర్జునా! మండుతున్న అగ్ని కట్టెలను ఎలా కాల్చి బూడిద చేస్తుందో, అలా జ్ఞానమనే అగ్ని సర్వ కర్మలనూ భస్మం చేస్తుంది.



### కర్మవాసనలూ, పాప పుణ్యాలూ

ఈ శ్లోకంలో కృష్ణ పరమాత్మ 'కర్మ' అనే శబ్దాన్ని ప్రయోగించారు. గతంలో మన జీవితంలో స్వార్థపరత్వం, కోరికలవల్ల ప్రేరేపించబడి చేసిన కర్మలవల్ల ఉదయించిన 'వాసన'లు-వీటికి సంకేతం ఆ కర్మ శబ్దం. ఈ 'వాసన'లే ఏ కర్మకు అయినా ప్రేరకాలు అవుతాయి. వాటి శుభ అశుభ లక్షణాలవల్లనే వ్యక్తికి సుఖ దుఃఖాలు కలుగుతాయి. అశుభ వాసనలే పాప కర్మలకు జన్మ నిస్తాయి. మండుతూన్న అగ్ని కట్టెను కాల్చి బూడిద చేసే విధంగా, జ్ఞానమనే అగ్ని కర్మలనూ, వాసనలనూ అన్నింటినీ భస్మం చేస్తుందని కృష్ణ పరమాత్మ చెపుతున్నారు. సాధకుడు జ్ఞాని. అతడి అహంకారం భస్మమై పోయింది. అతడు సమర్పణ భావంతో కర్మ చేస్తూ జీవిస్తున్నాడు. కనుక అతడి పాపం దగ్ధం అయిపోతుంది. అహంకారంతో నిండిన జీవితంలో ప్రోగుపడిన పాపాలు విశుద్ధమైన ఆత్మవరకు చేరవు. కనుక అవి మిగిలి ఉంటాయి. దుఃఖపెడుతూ ఉంటాయి. మనిషి జ్ఞానమనే అగ్నితో వాటిని దగ్ధం చేయనంతవరకు, పరమపిత, సచ్చిదానంద స్వరూపి అయిన ఆ పరమాత్మకు తాను శరణు పొందనంతవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. పరమాత్మ ఇచ్చిన జ్ఞానమనే చికిత్స ఎంతో అసమానమైనది. ఎందుకంటే, ఎంతటి పతితులకయినా, పాపుల్లోకల్లా పాపులకయినా ఇది ఆశా కిరణంగా కనిపిస్తుంది.

మనిషి ఎందుకు పాపం చేస్తున్నాడు? ఎందుకు పాప కర్మలలో మునిగితేలుతూ ఉంటాడు?- అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. కర్మ ఎపుడు పాపం అవుతుంది, ఎపుడు పుణ్యం అవుతుంది అనే చిక్కు సమస్య యుగ యుగాలుగా మనిషి మనసును వేధిస్తూ వస్తోంది. దేవతలకు సైతం దుర్లభమైన మానవ శరీరాన్ని పొందికూడా మనిషి పాప కర్మలకు ఎందుకు పాల్పడతాడు? ఇది కూడ మనిషికి అర్థంకాని విషయం.

పరమపూజ్య గురుదేవులు తన కలం ద్వారా ఈ ప్రశ్నలకు సమాధానం ఇలా చెపుతారు-

"మామూలు మనిషి చేసే కర్మను ప్రేరేపించే తత్వాలు- అతడి అభిరుచులు, అతడి అలవాట్లు, పూర్వజన్మల నుండి

**తానే సర్వాంతర్యామి అని తెలియడం 'మహావిద్య'.**

వచ్చిన అతడి ప్రవృత్తులు, వీటన్నింటినీ అనుసరించి అతడు తన జీవశక్తిని వృథా చేసుకుంటాడు. దాన్ని చెల్లా చెదరు చేసుకుంటాడు. మరో ప్రక్క సాధనలో మునిగి దివ్య కర్మలు చేసే వ్యక్తి విధాత ఇచ్చిన 'కర్మ స్వాతంత్ర్యాన్ని' సక్రమంగా వినియోగించుకునే సామర్థ్యం కలిగి ఉంటాడు. అతను తన అభిరుచులను, అలవాట్లను, ప్రవృత్తులను కొత్త తరహాలో మలచుకుంటాడు. అతడి అంతరంగంలో కొత్త సంస్కారాలు జన్మిస్తాయి. అపుడు స్వార్థపరత్వాన్ని పెంచి పోషించే లాలస, అహంకారపు జెండా ఎత్తుకు ఎగురవేయాలనే కోరిక మిగలవు. లోకంపట్ల కరుణతో, ఆత్మవికాస సోపానాలను ఒక్కొక్కటిగా ఎక్కుతూపోవాలనే ఉద్దేశ్యంతో అతడి ప్రతి కోరికా నిండి ఉంటుంది. ఈ కర్మయే పుణ్యకర్మ అవుతుంది. ఇందుకోసమై సాధకుడు మొదట సుసంస్కృతుడు కావలసి ఉంటుంది. సంస్కారవంతుడు కావలసి ఉంటుంది.'' (అఖండజ్యోతి 1942 ఆగస్టు సంచిక, 36వ పుట).

వాస్తవం ఇదే. స్వార్థ, అహంకారాల ప్రేరణలేని పని, గౌరవం అంటే ఏమిటో తెలిసిన పని పుణ్యకార్యం అవుతుంది. అంతరంగంలో గ్లాని, హైన్యం, కుంచించుకుపోవడం అనే గాయాలు కలిగించే పని పాపకార్యం అవుతుంది.

'పాపం' అనే ఇరుసుపై క్రైస్తవ మతం పునాది నిర్మించబడింది. పాపాలకు ప్రాయశ్చిత్తం (కన్ఫెషన్) అనే ప్రక్రియ ప్రభువు ద్వారాలను చేరుకోవడానికి రాజమార్గమని ఆ మతం చెపుతోంది. భారతీయ సంస్కృతిలోని సిద్ధాంతం మరో అడుగు ముందుకుపోతుంది. పరిష్కరించబడిన మార్గాన్ని అనుసరిస్తుంది. ప్రతి శ్వాసలో యోగాన్నీ, ప్రతి శ్వాసలో జీవన సాధననూ జీవించే మంత్రాన్ని ఉపదేశిస్తుంది.

జీవన సాధన నిగ్గుతేలిన కొలదీ పాపకర్మలు చేయడం సాధ్యపడదు. పాపకర్మలు చేయకపోవడం మనిషికి సహజ లక్షణం అవుతుంది.

### గాయత్రీ మంత్ర మహిమ

రోజువారీ జీవితంలో ఏర్పడే కషాయ కల్మషాల, పాపకర్మల బీజాలను కాల్చి బూడిద చేయడానికై, వాటి స్వరూపాన్ని మార్చడానికై పరమపూజ్య గురుదేవులు ఇందుకోసమే గాయత్రి జ్ఞాన గంగను ప్రవహింపజేశారు. నిషేధాలలో చిక్కుకున్న ఆ గాయత్రీ సాధనను వ్యక్తి వ్యక్తికీ అందించారు. పాపనాశకం అయిన సవితా దేవుని తేజాన్ని ధరించే ప్రేరణను గాయత్రీ మంత్రంలోని భర్గతత్వం ప్రసాదిస్తుంది. ఈ జ్ఞానం జీవితంలో అంతర్భాగం అయితే వ్యక్తి భవ బంధనంలో ఎన్నడూ చిక్కుకోడు.

Ð(Ç¡ºÈò-KÓ<-OH.Õ)

## సత్సంగం ఒక గంగ

రామకృష్ణ పరమహంస సతీమణి శారదాదేవి మహిళలకు ప్రత్యేకంగా సత్సంగ కార్యక్రమాన్ని నిర్వహించేది. వారిలో అధిక శాతం స్త్రీలు ధార్మిక స్వభావులు, సంపన్న గృహాలకు చెందినవారు ఉండేవారు. కానీ ఖ్యాతి చెందిన ఒక వేశ్యకూడ సత్సంగానికి రావటం ప్రారంభించింది. అది చూచి మిగిలిన మహిళలు చెవులు కొరుక్కోసాగేరు. ఆమె రావటం పట్ల తమ అభ్యంతరాన్ని తెలుపుతూ శారదమాతకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని విన్న మాతాజీ "సోదరీమణులారా! సత్సంగం గంగవంటిది. ఆ గంగలో చేపలు, కప్పలు నివసించినంత మాత్రాన అది అపవిత్రం కావటల్లేదు కదా! కొద్దిపాటి మాలిన్యానికే అశుద్ధమయ్యే గంగ ఇంకేమి పవిత్రం. మీరు సత్సంగం స్థాయిని శక్తిని తెలుసుకోవటానికి ప్రయత్నించండి. సత్సంగాన్ని గంగామాతగా భావించి దానిలో మునిగి మీరు పునీతులై అందరినీ తరించ నివ్వండి'' అని వారికి తెలియజేసింది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**యజ్ఞం అంటే పూజ్య భావంతో, సమర్పణ బుద్ధితో చేసిపెట్టే పని.**

## కృష్ణావతారం-21

# భీష్మునికి శాంతి ప్రదానం

**తథా పౌలస్త్యతనయో రావణో నామ రాక్షసః।**
**రామేణ నిహతో రాజన్ సానుబన్ధం సహానుగః॥**

రాజా! పులస్త్య కుమారుడు విశ్రవుడు, వాని కుమారుడు రావణుడు. ఆ రాక్షసుని శ్రీరాముడు క్రియాత్మకములైన ఉపాయములతోను, యుక్తితోను, నేర్పుతోను మిత్రసహితుడు సేవకసహితుడు నై సంహరించెను.

(1) ధర్మముతో పాటు పరాక్రమము ద్వారా, పురుషార్థము ద్వారా, సమయానుకూలమైన కార్యకౌశల్యము ద్వారా కార్యము సిద్ధించును.

**క్రియా బలవతీ రాజన్ నాన్యత్కించిద్ యుధిష్ఠిర ।**
**దైత్యాశ్చ దానవాశ్చైవ రాక్షసాః పార్థివాస్తథా ।**
**క్రియాభ్యుపాయైర్నిహతాః క్రియాం తస్మాత్ సమాచర॥**

రాజా! కార్యకౌశలమే బలవంతమైనదిగాని మరి యేవస్తువు కాదు. యుధిష్ఠిరా! దైత్యులు, దానవులు, రాక్షసులు, ఎందరో భూపాలురు క్రియాత్మకములైన ఉపాయముల ద్వారానే సంహరింపబడిరి. అందువలన నీవు కూడ క్రియాత్మకమైన ఉపాయమునే ఆశ్రయించుము.

(1) వట్టి సిద్ధాంతములవలన ఏమియు కాదు. సాఫల్యమును పొందుటకు తగిన కార్య పద్ధతిని తెలిసికొనవలెను.

కృష్ణుడు చెప్పిన దాని ననుసరించి యుధిష్ఠిరుడు భీముడు దుర్యోధనుని యుద్ధమునకై పిలిచిరి. భీమునితో వానికి భయంకర యుద్ధము జరిగెను. ఇరువురు యుద్ధము చేయుచుండిరి. అప్పుడే బలరాముడు గూడ తీర్థయాత్రలు చేయుచు అక్కడకు వచ్చెను. భీముడు తన గదతో దుర్యోధనుని తొడలను విరుగగొట్టెను. నియమ విరుద్ధముగ జరిగిన గదా యుద్ధమును జూచి బలరాముడు ఉత్తేజితు డయ్యెను. భీముని సంహరింప పరుగిడెను. కృష్ణుడు ఆయనను వారించి ఇట్లు పలికెను.

**ఆత్మవృద్ధిర్మిత్ర వృద్ధి ర్మిత్ర మిత్రో దయ స్తథా ।**
**విపరీతం ద్విషత్స్వేతత్ షడ్విధా వృత్తిరాత్రనః ॥**

**ఆత్మన్యపి చ మిత్రే విపరీతం యదా భవేత్ ।**
**తదా విద్యా న్మనోగ్లాని మాశు శాన్తికరో భవేత్ ॥**

అన్నా! తన వృద్ధి ఆరువిధములుగ ఉండును- తన వృద్ధి, మిత్రవృద్ధి, మిత్రునియొక్క మిత్రవృద్ధి, శత్రుపక్షమున దీనికి విపరీతి పరిస్థితి అనగా శత్రుహాని, శత్రుమిత్రహాని, శత్రువుయొక్క మిత్రునియొక్క మిత్రహాని. తనకు తన మిత్రునికి దీనికి విపరీత పరిస్థితి కలిగనచో మానసికగ్లానిని అనుభవించవలెను. మిత్రుల యొక్క ఆ హానిని నివారించుటకు త్వరగా ప్రయత్నశీలుడు కావలెను.

(1) అన్ని విధముల మనకు మన మిత్రునకు ఉన్నతి కలుగుటకై ప్రయత్నపరులమై యుండవలెను.

(2) నిజమైన సహాయకుడు చక్కగా ఉపయోగపడును. అందువలన మంచి మిత్రులను ఏర్పాటు చేసికొనవలెను.

**జన్మప్రభృతిలబ్ధశ్చ పాపశ్చైవ దురాత్మవాన్ ॥**
**నిహతో భీమసేనేన దుర్బుద్ధిః కులపాంసనః ॥**

దురాత్ముడు, దుర్బుద్ధియు, పాపియునగు ఈ దుర్యోధనుడు పుట్టుకనుండియే లోభి. కురుకుల కళంకుడు. ఇతడు భీముని చేతిలో చచ్చెను.

(1) దుష్టుని శిక్షించినచో అందరు సంతోషింతురు.

(2) సమయానుసారముగ పాపమునకు శిక్ష లభించును.

కృష్ణుడు భీముని సమర్థించి, దుర్యోధనుని నిందింపగా బలరాముడు అక్కడనుండి వెళ్లిపోయెను. కాని దుర్యోధనుడు ఉత్తేజితుడై కృష్ణుని పరుషముగా పలికెను. కృష్ణుడు వానిని నిందించుచు ఇట్లు పలికెను-

**విషం తే భీమ సేనాయ దత్తం సర్వే చ పాండవాః ।**
**ప్రదీపితా జతుగృహే మాత్రాసహ సుదుర్మతే ॥**

**ఇతరుల శ్రేయస్సుకోసం సమర్పించడం వల్ల నీకు లభించింది యజ్ఞ శేషం.**

దుర్మతీ! నీవు భీమసేనునికి విషము పెట్టతివి, పాండవులనందరిని తల్లితో పాటు లక్కయింటిలో పెట్టి తగుల బెట్ట ప్రయత్నించితివి.

(1) మానవుడు సఫలుడైనపుడు తన్ను తాను పొగడుకొనును, అసఫలుడైనపుడు ఇతరులను నిందించును. అందువలన ఇతరులను దోషులనుగా భావింపక తన కర్మలను గూర్చి విచారింపవలెను.

**హతస్త్వమసి గాన్ధారే సభ్రాతృ సుతబాంధవః ।**

**సగణం ససుహృచ్చైవ పాపం మార్గమనుష్ఠితః ॥**

గాంధారీనందనుడా! నీవు పాపపు మార్గమున అడుగుపెట్టితివి. అందువలన నీవు సోదరులతోను, పుత్రులతోను, బంధువులతోను, సేవకులతోను, సుహృదులతోను చంపబడితివి.

(1) సమాయానుసారముగ పాపఫలమును తానే అనుభవింపవలసి వచ్చును.

(2) పాపకర్మలు చేయువాని సహచరులుగూడ దండింపబడుదురు.

**యాన్యకర్మాణి చాస్మాకం కృతానీతి ప్రభాషసే।**
**వైగుణ్యేన తావత్సర్వం సర్వం హి తదనుష్ఠితమ్ ॥**

మేము చేసేవిగా నీవు వేనిని అనుచిత కర్మలని చెప్పుచున్నావో అవియన్నియు నీదోషమువలననే చేయబడినవి.

(1) అకృత్యములను చేయువారిపై ఆ అకృత్యములె తిరగబడి దెబ్బగొట్టును.

**లోభేనాతిబలేన త్వం తృష్ణయా చ వశీకృతః ।**
**కృతవానస్య కార్యాణి విపాకస్తస్య భుజ్యతామ్ ॥**

నీవు గొప్పలోభమునకు, తృష్ణకు వశుడవై చేయకూడని పనులను చేసితివి. అందువలన వాని ఫలితములను నీవే అనుభవింపుము.

(1) మానవుడు తన దోషమువలన దుర్గుణములవలన పాపమున మగ్నుడగును. అందువలన దోషములు దుర్గుణములు మనకు గొప్ప శత్రువులు. వీనిని నాశనము చేయుటకు ప్రయత్నించవలెను.

యుద్ధము పూర్తి అయ్యెను. దుర్యోధనాది బంధువులు చంపబడినందులకు యుధిష్ఠిరునకు అధిక దుఃఖము కలిగెను. ఆయన తన దుఃఖమును వెల్లడించుచు కృష్ణునితో నిట్లు పలికెను- మేము తప్పుడు రీతితో మా శత్రువును చంపితిమి. అందువలన మేము పాపమునకు భాగులమగుదుము.'' కృష్ణ భగవానుడు ఆయనకు తెలియజెప్పుచు నిట్లు పలికెను-

**న చ వో హృది కర్తవ్యం యదయం ఘాతితో రిపుః।**
**మిథ్యా వధ్యా స్తథోపాయైర్బహవః శత్రవోధికాః ॥**

ఈ విధముగ శత్రువులను సంహరించినందుకు నీవు మనస్సులో విచారపడవలదు. ఎందరో శక్తివంతులగు శత్రువులు నానా విధములగు ఉపాయముల ద్వారా కూటనీతి ప్రయోగములద్వారా చంపబడుటకు యోగ్యులగుచుందురు.

(1) అధర్మముగా ప్రవర్తించు శక్తివంతులు అధిక సంఖ్యలో ఉన్నచో వారిని యుక్తితో సంహరించుటకు ప్రయత్నించవలెను.

**పూర్వైరనుగతో మార్గో దేవైరసుర ఘాతిభిః ।**
**సద్భిశ్చానుగతః పన్థాః స సర్వైరనుగమ్యతే ॥**

అసుర వినాశమునకై పూర్వులైన దేవతలు ఈమార్గమును ఆశ్రయించిరి. ఉత్తమ పురుషులు ఏ మార్గమున పయనించిరో ఆ మార్గమునే అందరు పయనింతురు.

(1) ఉత్తమ పురుషుల ప్రవర్తననే అందరు అనుసరింపవలెను.

(2) ఉత్తమ పురుషుల ఆచరణను జనులు అనుసరింతురు. అందువలన వారు లోక సంగ్రహార్థమై యోగ్యములైన కార్యములనే చేయవలెను.

తమ పుత్రులు మరణించినందులకు ధృతరాష్ట్రుడు గాంధారి చాలదుఃఖించిరి. గాంధారియొక్క గాంభీర్యమును చూచి యుధిష్ఠిరుడు భయపడెను. గాంధారి శపించినచో తామందరము నశించిపోయెదమని ఆయన భయపడెను. గాంధారికి నచ్చజెప్పవలసినదిగా ఆయన కృష్ణుని ప్రార్థించెను. ఆయన ప్రార్థన ననుసరించి కృష్ణుడు గాంధారి దగ్గరకుపోయి దుర్యోధనుని దుష్కర్మల వలననే ఇట్లు జరిగెను, మీరు గూడ వానికి బోధించిరి, కానీవాడు వినలేదని ఆమెకు చెప్పెను.

**కట్టెలు మంటలో కాలిపోతాయి. సర్వకర్మల పాపములు జ్ఞానంతో భస్మం అవుతాయి.**

**దుర్యోధనస్త్వయా చొక్తో జయార్థీ పురుషం వచః**
**శృణుయా మూధవచో మహ్యాం యతో ధర్మస్తతో జయః॥**

నీవు విజయాభిలాష గలిగిన దుర్యోధనునితో కఠినముగా "మూఢుడా! నామాట వినుము, ధర్మమున్న పక్షమునకే గెలుపు గలుగును" అని పలికితివి.

(1) చివరకు ధర్మమే జయించునుగాని అధర్మము గాదు.

(2) తన పుత్రుని ధర్మమార్గమున పయనించమని ప్రేరేపించు స్త్రీయే నిజమైన తల్లిగా చెప్పబడును.

కృష్ణుడు చెప్పగా తన పుత్రుడు కర్మ సిద్ధాంతము ననుసరించి తన దోషములకు తానే శిక్షింపబడెనని గాంధారి తలంచెను. అందువలన పాండవులపై ఆమె కోపము లేనిదయ్యెను.

ఒకనాడు ప్రాతఃకాలమున యుధిష్ఠిరుడు కృష్ణుని కడకు పోయెను. భగవానుడు ధ్యానమునందుండుట చూచి ఆయన తరువాత ఇట్లు అడిగెను- "నీవు స్వయముగ భగవానుడవు. అందరు నిన్ను ధ్యానించుచుందురు. కానీ నీవు ఎవరిని ధ్యానించుచున్నావు?" "నన్ను ఎవరు ధ్యానించుచుందురో నేను వారిని ధ్యానించుచుందును" అని కృష్ణుడు సమాధానమిచ్చెను.

**ఏకృత్యే న్ద్రియగ్రామ కౌ మనః సంయమ్య మేధయా**
**శరణం మాముపగచ్ఛత్ తతో మే తద్గతం మనః ॥**

భీష్ముడు తన ఇంద్రియ వృత్తులన్నింటిని ఏకాగ్రము చేసి బుద్ధిద్వారా మనస్సును నిగ్రహించి నన్ను శరణుజొచ్చెను. అందువలన నా మనస్సుగూడ ఆయన యందే లగ్నమయ్యెను.

(1) ఎవరి మనస్సు భగవానుని యందు లగ్నమగునో వారియందు భగవానుని మనస్సు లగ్నమగును. మనము భగవానుని పట్ల ఎట్టి భావనను కలిగి యుందుమో భగవానుడు గూడ మనయందు అట్టి భావననే కలిగి యుండును.

అటు తరువాత పాండవులతో ద్రౌపదితో గూడి శ్రీకృష్ణ భగవానుడు శరశయ్యపై పరుండియున్న భీష్ముని కలిసికొనెను. భీష్ముడు తన అదృష్టము పొగడుకొనుచు భగవంతునికి ధన్యవాదములను తెలిపికొనెను. కృష్ణుడు ఇట్లు పలికెను.

**దమే తపసి సత్యే చ దానే చ నిరతః శుచిః**
**అర్హస్త్వం భీష్మ మాం ద్రష్టుం తపసా స్వేన పార్థివః ॥**

నీవు ఇంద్రియ నిగ్రహముగలవాడవు, తపస్సులోను, సత్యములోను దానములోను తత్పరుడవై యుండువాడవు, పరమమిత్రుడవు. మహారాజా! నీవు నీ తపోబలము చేతనే నన్ను దర్శింపగలవు.

తన ధర్మమునందు ఆరూఢుడైన మానవుడు భగవానుని దర్శించుటకు వెళ్ళవలసిన పని లేదు. భగవానుడే స్వయముగ వానికి దర్శనము నొసంగుటకు వచ్చును.

శ్రీకృష్ణుని దర్శనము వలన చర్చవలన భీష్మునికి గొప్ప శాంతి లభించెను. ఆయన శాంతముగ శరశయ్యపై పరుండి సూర్యుడు ఉత్తరాయణమున ప్రవేశించువరకు ఎదురు చూచుచుండెను.

ఒకనాడు అర్జునుడు కృష్ణుని- దేవా నీ ప్రసిద్ధములైన నామములను నాకు తెలుపవలసిన"దని అడిగెను. కృష్ణుడు ఇట్లు చెప్పెను- అర్జునా! నాలోను నీలోను భేదము ఏమియు లేదు. ఇరువురి అవతారముల యుద్దేశ్యము ఒక్కటే-

**త్వం చైవాహం కౌన్తేయ నరనారాయణౌ స్మృతౌ**
**భారావతరణార్థం తు ప్రవిష్టౌ మానుషీం తనుమ్॥**

కుంతీనందనా! నీవు నేను నరనారాయణులను ఋషులము. భూభారమును తగ్గించుటకై మనము మానవ శరీరములలో ప్రవేశించితిమి.

(1) నరుడు నారాయణుని సఖుడు.

(2) భగవానునికి సహాయకునిగా నరుడు సృజింపబడెను.

(3) మానవుని పుట్టుకలోగల ఉద్దేశ్యము ధర్మస్థాపనము, అధర్మనాశనము.

ఇట్లు తన్ను గురించి చక్కగా తెలిసికొనిన అర్జునుడు తన కర్తవ్యగురుత్వమును బాగుగా ఎరింగెను. తరవాత తన కర్తవ్యమున నిమగ్నుడయ్యెను.

H H H

**కాలం అంటే కదలిక.**

తత్వ చింతన

# సుఖమయ జీవనానికి మూలాధారం - ధర్మం

జీవితం అంటే అర్థం సంఘర్షణ. పరిస్థితుల ఎగుడు దిగుడులు. దీనిని పరివర్తన అని కూడ పేర్కొనవచ్చు.

పరివర్తనమే జీవితం. జీవితమే పరివర్తన.

జీవితంలో అసురత్వాన్నీ, ఆకస్మికమూ, అనూహ్యమూ అయిన కుటిలత్వపు దురాక్రమణనూ సహించడం తేలిక కాదు. వ్యాకులతలూ, కష్టాలూ, ఆపదలూ తుపానులవలె వచ్చిపడతాయి. మనిషిని నిర్వీర్యం చేస్తాయి. మనిషి బుద్ధి కొరకాకుండాపోతుంది. మనిషి హతాశుడు అయిపోతాడు. దిక్కుతోచని స్థితిలో పడిపోతాడు.

### ఒకేఒక సమాధానం - ధర్మం

అలాంటి విషమ పరిస్థితిలో నిస్సహాయుడూ, తరుణోపాయం తట్టనివాడూ అయిన వ్యక్తిలో ఇలా ఆలోచన మొదలవుతుంది- నాకు అండదండలు ఎవరు అందిస్తారు? నన్ను ఎవరు రక్షిస్తారు? నన్ను ఎవరు ఉద్ధరిస్తారు? నాకు మంచి దారి ఎవరు చూపుతారు?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఒకేఒకటి.

ధర్మం.

సుఖ శాంతులతో కూడిన పరిస్థితులకు జననికూడ ధర్మమే. ఏరోజున ఈ జగత్తులో ధర్మం సమాప్తం అవుతుందో, ఆ రోజున సర్వనాశనాన్ని ఎవ్వరూ తప్పించలేరు.

పాశ్చాత్య మనీషి థామ్సన్ తన సమష్టి దృక్పథంతో ధర్మాన్ని వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు-

"విశ్వమంతా నా దేశం. మానవాళి మొత్తం నా బంధువర్గం. అందరి హితం నా ధర్మం."

వర్తమాన యుగంలో ధర్మంపట్ల ప్రజలలో అపనమ్మకం పెరిగింది. దాని ఫలితం మన కళ్ళముందు కనిపిస్తోంది. నైతిక, సాంస్కృతిక విలువలూ, నమ్మకాలూ అడుగంటిపోతున్నాయి. అధర్మాచరణ ఫలితంగా మనిషిలో సుఖ శాంతులు అంతరించి పోతున్నాయి. అసంతృప్తితో నిండిన వాతావరణం అంతటా వ్యాపించిపోతోంది.

దారి తప్పి అయోమయంలో పడిన ఈ స్థితిలో మన దృష్టికి ఒకే ఒక ఉపాయం కనిపిస్తోంది. ఒకేఒక ఆసరా కనిపిస్తోంది-

ధర్మం.

వేదాలు, ఉపనిషత్తులూ, స్మృతులూ, పురాణాలూ, ధర్మశాస్త్రాలూ- అన్నీ ఈ ధర్మ తత్వాన్నే వ్యాఖ్యానిస్తున్నాయి. నిరూపిస్తున్నాయి.

ధర్మప్రధానమైన యుగం, అనగా సత్‌ప్రవృత్తులు అధికాధికంగా ఉన్న యుగం కృతయుగం. కృతయుగంలో సుఖ సంపదలు వెల్లివిరుస్తాయి. వాటికి ఆధారం ధర్మం.

### 'ధర్మమే నీకు రక్ష'

శ్రీరామచంద్ర మూర్తి వనవాసానికి బయలుదేరాడు. ఆయన తన రక్షణకోసం తల్లి కౌసల్యను ఆశీస్సులు ఇమ్మని కోరాడు. విదుషీమణి అయిన కౌసల్య అప్పుడు ఆయనతో ఇలా చెప్పింది-

"ఓ రామా! నీ ఏ ధర్మాన్ని ఆనందంగా నియమపూర్వకంగా పాటించావో, ఏ ధర్మాన్ని అనుసరించి నీవు వనవాసం చేయాలని నిర్ణయించుకున్నావో- ఆ ధర్మమే నిన్ను రక్షిస్తుంది."

### నిలిపిఉంచేది ధర్మం

"ధారయతే ఇతి ధర్మః". అనగా- ధారణ చేసేది ధర్మ. 'ధర్మ' శబ్దం "ధృ" ధాతువు నుండి ఏర్పడింది. దాని అర్థం ధారణ చేయడం. నిలిపిఉంచడం. మనిషిని నిలిపి ఉంచేదీ, పవిత్రం చేసేదీ, రక్షించేదీ ధర్మం. ధర్మాన్ని ఆచరించడంలో వ్యక్తి ఈ గుణాలను సాధన చేస్తాడు-పరోపకారం, ఇతురులకు సేవ, సత్య, సంయమనం, కర్తవ్యపాలన మున్నగునవి. 'ధర్మం చర' అనే ఆదేశానికి అర్థం ఇదే- సదాచారం, ధర్మాచరణ, సత్యాచరణ మున్నగునవి మానవ జీవితంలో ఆచరణలోనికి రావడం.

ధర్మాన్ని పాలించే వ్యక్తి, పోషించే వ్యక్తి ధర్మాత్ముడు. లెక్కలేనన్ని ఆటంకాలనూ, అవరోధాలనూ, తిరోగమన శక్తులనూ ఓడించే శక్తి ధర్మశీలుడైన వ్యక్తి అంతఃకరణలో ఉదయిస్తుంది. ధార్మికుడైన మనిషి జీవితంలో ఒక విశేషమైన, విలక్షణమైన ఆహ్లాదం నిండి ఉంటుంది. అతడు అంతటా సువాసనలను వెదజల్లుతాడు. అతడి ఉల్లాసంతో, అతడి ఉత్సాహపు పొంగుతో పరిసర వాతావరణం ప్రభావితం అవుతుంది. ధర్మంలోని ప్రాణశక్తి నిర్జీవుణ్ణి సైతం సజీవుణ్ణి చేస్తుంది. ధార్మిక వ్యక్తిలోని ప్రధాన లక్షణం సాహసం.

### మనిషిలోని అగ్నితేజం ధర్మం

వాస్తవానికి ధర్మం మనిషిలోని అగ్నితేజం. అది వెలుగునూ, వేడినీ జీవింపజేస్తుంది. క్రియాశీలతనూ, విజయ ఆకాంక్షనూ మేలుకొలిపి ఉంచుతుంది. ధర్మశీలుడైన వ్యక్తి రకరకాల ఆపదల మధ్య, ఆటంకాల మధ్య, అవరోధాల మధ్య హిమాలయంలా నిశ్చలంగా ఉంటాడు. సముద్రంలా ధీర గంభీరంగా ఉంటాడు.

ఒక్కమాటలో-

ధర్మం జీవితానికి ప్రాణం.

ధర్మం మాననీయ గరిమకు మరోపేరు.

H H H

**మృత్యువు అంటే మార్పు.**

## మనం-మన ఆరోగ్యం

# నిత్యం మన శరీరంలో కలుస్తున్న విషాలు

సృష్టి ప్రారంభంనుండే మానవునికి ఆహారం ఒక అనివార్య అవసరంగా ఉంది. మానవునికే కాక పశు-పక్ష్యాదులు, వనస్పతుల సంరక్షణ. సంవర్ధనకోసం కూడ భోజనం అనివార్యం. ధర్మవిహిత కర్మల కోసం శరీర రక్షణ అవసరం. మన శాస్త్రాలలో వర్ణించిన పురుషార్థ చతుష్టయం కూడా ఆరోగ్యకర శరీరం ద్వారానే పొందడం సాధ్యమవుతుంది.

ప్రాచీన కాలంలో మానవుడు గుహలలో నివసిస్తూ కందమూలాలు భుజించేవాడు. పశుపక్ష్యాదుల మాంసం కూడ వారికి ఉదర పోషణ సాధనంగా ఉండేది. వైదిక యుగంలో వ్యవసాయం ప్రారంభమైంది. వైదిక సూక్తులలో వ్యవసాయంతో, అన్నంతో సంబంధం ఉన్న ఇంద్ర, వరుణ, అగ్ని మొదలైన దేవతలకు ప్రార్థన విశదంగా వర్ణించబడింది. సింధులోయ నాగరికతలో కూడ వ్యవసాయం ఒక ప్రముఖ వృత్తిగా ఉండేది. వ్యవసాయం కోసం గోపాలన కూడా భారత్‌లోనే ప్రారంభమైంది.

తరువాతి యుగంలో ఆహార-పానీయాల వ్యవస్థ బాగా వృద్ధి చెందింది. సాహిత్య వివరణలే కాక పురాతత్వ అవశేషాల నుండి వెలువడిన పాకశాలలు, భోజనశాలల సుందర చిత్రణ కూడ ఈ సత్యాన్ని స్పష్టం చేస్తున్నది. శరీర పోషణ, నియంత్రణల కోసం మానవుడు వివిధ రూపాలలో భోజ్యపదార్థాలను తీసుకుంటాడు. కాలంతోపాటు ఆహార పానీయాలకు సంబంధించిన ఆలోచలలో, రుచులలో అనేకానేక మార్పులు వచ్చాయి. కందమూలాలు, ఫలాలు, షడ్రసాల కూరలనుండి ఈ పరివర్తన డబ్బాలలో ఉంచి మూతపెట్టిన ఆహారం, సీసాలలో త్రాగు నీటి దాకా వచ్చింది. మారుతూ వస్తున్న ఆహార పానీయాల స్వరూపం వలన మన ఆరోగ్యంలో కూడ సమూలమైన మార్పులు వచ్చాయి.

### రోగాలను తెస్తున్న కీటకనాశకాలు

ఈనాడు ప్రతి ఆహార పదార్థంలోను కీటకనాశక, ఇతర హానికారక రసాయనాలను చూడవచ్చు. డబ్బాలలో బంధించిన ఆహారం, సీసాలలో మూతపెట్టి ఉంచిన పానీయాలే కాక రొట్టెలు, పప్పులు, బియ్యం, కూరలు కూడ ఈ హానికారక విషానికి దూరం కాలేకపోతున్నాయి. మన శరీరంలో కూడ కీటకనాశకాలు పేరుకుపోయే విధంగా ఆహార పానీయాలు విషపూరిత మవుతున్నాయి.

అధిక ఉత్పత్తికోసం గుడ్డిగా కీటకనాశక మందులను ప్రయోగిస్తున్న కారణంగా మన శరీరంలో ఒక విషపూరిత కాక్‌టైల్ జమ అవుతూ వస్తున్నది. కీటకనాశక మందులు కావలసినంతవరకే చల్లడం లేదు. ఫలితంగా 80 నుండి 90 శాతం కీటనాశకాలు కీటకాలను చంపడానికి బదులు పంటల్లో అతుక్కుపోతున్నాయి. లేదా చుట్టూ ఉన్న మట్టిలో కలిసిపోతున్నాయి. దానిని తొలగించడానికి ఎటువంటి ప్రయత్నమూ జరగడం లేదు. అవి మన శరీరంలో ప్రవేశిస్తున్నవి. మాంస కండరాలు, క్రొవ్వులో విషం జమ అవుతోంది. లేదా రక్తంలో కలుస్తోంది. ఇది స్లో పాయిజన్‌గా పనిచేసి అనేక రోగాలను ఉత్పన్నం చేస్తోంది.

కీటక నాశక మందులు క్యాన్సర్‌ను, ట్యూమర్‌లను పెంచుతాయి. కొన్ని నేరుగా మెదడు మీద, దానితో సంబంధం ఉన్న నాడీతంత్రుల మీద ఆక్రమణ చేస్తాయి. బలహీనత, తల తిరగడం, జ్ఞాపకశక్తి తగ్గడం లాంటి లక్షణాలు కీటనాశక మందుల కారణంగా ఉత్పన్న మవుతాయి. కొన్ని మందులు శరీర రోగ నిరోధక శక్తిని అంతం చేస్తాయి. హార్మోన్లను తయారు చేసే కొన్ని గ్రంథులను దెబ్బతీసి శరీర ప్రక్రియలన్నింటినీ అస్తవ్యస్తం చేస్తాయి.

కీటకనాశకాల ప్రమాదకర పరిణామాలు వెలికివచ్చిన తరువాత కూడ వాటి ఉపయోగం ఎటువంటి అవరోధం లేకుండా ఇంకా ఎక్కువగా జరుగుతున్నది. భారతీయ ఆయుర్విజ్ఞాన అనుసంధాన పరిషత్‌వారు చేసిన ఒక సర్వే నివేదిక ప్రకారం ఆవు, గేదెల 2200 పాల నమూనాలలో 82%,

**సంసారం అంటే అర్థం మార్పులకు గురిఅవుతున్నది.**

శిశువులకు వాడే డబ్బాలలోని ఆహారాలకు సంబంధించి 20 కంపెనీల 180 నమూనాలలో 70% డి.డి.టి అవశేషా లున్నట్లు తేలింది. సీసా త్రాగునీటిలో కీటకనాశక మందు ఉండవలసిన దానికంటే 35% అధికంగా ఉంది.

ఈ నివేదిక ప్రకారం - కేవలం గోధుమలు, బియ్యం ద్వారా మనం ప్రతిరోజు అరమిల్లీ గ్రాము డి.డి.టి, బి.హెచ్.సి తింటున్నాము. అన్నిటికంటే ఎక్కువ కీటకనాశక మందులను కూరగాయలు మన శరీరంలోకి చేరుస్తున్నాయి. వంకాయలను నిగనిగలాడేలా చేయడానికి కార్బోఫ్యూరాన్‌లో ముంచుతారు. కాలీఫ్లవర్ తెల్లగా మెరవడం కోసం మైథిల్‌పైరాథియన్ చల్లుతారు. ఇదే విధంగా బెండకాయలు, దొండకాయలు ఆకుపచ్చగా నిగనిగలాడేలా ఉండడానికి కాపర్ సల్ఫేట్ , మైలాథియాన్ ఉపయోగిస్తున్నారు.

## కూరగాయలలో సీసం

కీటక నాశకాల తరువాత మన శరీరానికి ఆర్సెనిక్, కేడియం, సీసం, రాగి, జింక్, పాదరసం లాంటి ధాతువుల వలన ఎక్కువ నష్టం కలుగుతుంది. పళ్ళు, కూరలు, మసాలాలు మొదలుకొని శిశు ఆహారం వరకు అన్నింటిలో ఎక్కువ మోతాదులలో ఇవి ఉంటున్నాయి. ఢిల్లీ విశ్వ విద్యాలయం, వారణాశి హిందూ విశ్వవిద్యాలయంల ద్వారా జరిగిన ఒక సర్వేలో వెల్లడైన విషయాల ప్రకారం-కూరలలో సీసం ఉండవలసిన దాని కంటే 73% ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. కూరలను బాగా కడిగిన తరువాత కూడ ఈ విషం 55% శాతానికి మించి తగ్గడం లేదు. సీసం అధికంగా ఉండడం వలన మూత్ర పిండాలు చెడిపోవడమేకాక అధిక రక్తపోటు ఉత్పన్నం అవుతుంది. దీని ప్రమాదకరమైన ప్రభావం పిల్లల మస్తిష్క వికాసం మీద పడుతుంది. సీసంతో కూడిన ఆహార సేవనం వలన పిల్లల బుద్ధి వికాసానికి అవరోధం ఏర్పడుతుంది. దానితో వారి బుద్ధి మందగిస్తుంది. పిల్లలకు ఎంతో ఇష్టమైన చాక్లెట్లు కూడ ప్రమాదరహితమైనవేమీ కావు. వీటిలో ఉన్న నికెల్ వలన చర్మ క్యాన్సర్ వస్తుంది. డబ్బా ప్లాస్టిక్‌దయితే ఈ ప్రమాదం ఇంకా ఎక్కువ. ప్లాస్టిక్ నెమ్మది, నెమ్మదిగా విషపూరిత రసాయనాలను వదులుతుంది. ప్లాస్టిక్‌లో ఉండే థెలైట్ జాతి రసాయనాలు శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను ధ్వంసం చేస్తాయి.

## మాంసాహారంలో కలుస్తున్న విషాలు

మాంసాహారమైతే శాకాహారంకంటే ప్రమాద స్థాయికి చేరింది. మాంసం మీద బ్లీచింగ్ పౌడర్ పూస్తారు. దీనితో నీరు ఎండిపోయినా మాంసం బరువు తగ్గదు. ఇదేవిధంగా రక్తస్రావం ఆగడానికి కాపర్ సల్ఫేట్ వాడుతారు.చేపల తాజా నిగనిగలు ఎక్కువకాలం ఉండేందుకు వాటిని అమ్మోనియా సల్ఫేట్‌లో ముంచుతారు. మాంసాహారం ప్రమాదకారి. ఇప్పుడయితే అది ఇంకా విషపూరితమైంది.

ఆహార పదార్థాలలో కలిపే వివిధ రంగుల వలన కలిగే ప్రమాదం కూడ తక్కువేమీ కాదు. ఐస్‌క్రీం, లడ్డు, జిలేబి-వీటన్నింటిలో కలిపే కృత్రిమ రంగుల సేవనం వలన మూత్ర పిండాలు వికారానికి గురవుతాయి. ఎముకలు కూడ బలహీన మవుతాయి. కళ్ళలో కాంతి తగ్గుతుంది. పురుషులలో ఇది నపుంసకత్వానికి దారితీస్తుంది. ఈ రంగుల వాడకం చట్టప్రకారం నిషిద్ధం. కాని ప్రభుత్వం తరఫున ఎటువంటి క్రియాశీల వ్యవస్థ లేకపోవడం వలన సామాన్య ప్రజలు విషపానానికి లోనవుతున్నారు.

## ఆహారశుద్ధి అత్యవసరం

మన శరీరంలో కలుస్తున్న ఈ విషం నుండి రక్షణకు ఒకే ఒక ఉపాయం-మన ప్రాచీన భోజన పద్ధతులను మరల అనుసరించడం. భారతదేశంలో ప్రాచీన కాలం నుండే శుద్ధ ఆహారానికి ప్రాధాన్యం ఇచ్చారు. దీని వలన మనిషి స్వభావం, స్మృతి విశుద్ధంగా ఉంటాయి. ప్రాణులకు ఆహారం అమృతంతో సమానం. కాని అమృతం కూడ యుక్తిగా సేవించకపోతే విషంగా మారుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని అనియమిత, అనుచిత ఆహార పానీయాలకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలి.

అనువాదం: డి.వి.ఆర్. మూర్తి

H H H

**ఆచరణకు ముందు ఫలితాన్ని భావించడం ఆశ.**

## దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో

# ఆవిర్భవిస్తోంది మానసిక చికిత్సలో అద్భుత ప్రక్రియ

నిజమే. 21 శతాబ్దం నాలుగడుగులు వేస్తున్న సమయంలో మానసిక చికిత్సకు చాలా సరంజామా పోగయింది. పాశ్చాత్య దేశాల నమూనాలో మన దేశంలోకూడ సైకియాట్రీ, సైకోథెరపీల జంజాటం వ్యాపించింది. అయినా, మానసిక సమస్యలు దాదాపు యథాతథంగానే మిగిలిపోతున్నాయి. మానసిక రోగల పరిస్థితిలో కూడ చెప్పుకోదగ్గ మెరుగుదల కానరావడం లేదు. మానసిక సమస్యలలో చిక్కుకుంటే జీవితమంతా విచ్ఛిత్తి, ముడుచుకుపోవడం అనే బాధలు వేధిస్తూనే ఉంటాయి. అనుభవించినవారికే ఆ అవస్థ అర్థమవుతుంది. అశాంతి, మనస్సుకు నిలకడ లేకపోవడం జీవితాన్ని అయోమయంలో పడవేస్తాయి. మనస్సులో ఉన్న రోగం బయటి పరిస్థితులను కూడ ప్రభావితం చేయకుండా ఉండదు. రోగి పరిసరాలలో సంతులనం, సమన్వయం ముక్కచెక్కలు అయిపోతాయి.

మానసిక రోగపు బాధామయ ప్రబావపు నీలి నీడలు కుటుంబ సంబంధాలనూ, సామాజిక సంబంధాలనూ క్రమ్ముతాయి. శరీరం జబ్బుపడితే మర్యాద కోసమైనా జనం మంచి చెడ్డలు అడుగుతారు. సానుభూతి మరీ ఎక్కువైతే- పళ్లు ఇచ్చి వెళతారు. పుష్ప గుచ్ఛాలు అందిస్తారు. ఒకోసారి 'గెట్‌వెల్ సూన్' అని వ్రాసి ఉన్న అందమైన బోర్డులుకూడ సమర్పిస్తారు.

### మానసిక వైద్యుల అవగాహనాలోపం

అయితే మానసిక రోగం వస్తే మాత్రం- పళ్లూ, పువ్వులూ ఇవ్వడం సంగతి దేవుడెరుగు, అసలు ఓదార్పుగా మాటలు చెప్పేవారుసైతం కరువవుతారు. అంతేకాదు, అంతకుముందు మనసిచ్చి మాట్లాడేవారుకూడా వ్యంగ్య బాణాలు వదలడానికి వెనుకాడరు. మానసిక ఉద్రిక్తత, నిరాశ, దురాలోచన మనసును కలచివేస్తున్న సమయాలలో మనలో పలువురికి అనుభవంలో ఉన్న వాస్తవం ఇది. దుఃఖంతో, వేదనతో, చింతతో విలవిలలాడే మనస్సు పొందిన గాయాలకు మందు పట్టీవేసే స్పృహ ఎవరికి ఉంటుంది!

పలువురికి మానసిక రోగాల గురించి సరైన అవగాహన ఉండదు. ఈ పలువురిలో నిపుణులనుకూడ చేర్చవచ్చు. వారి నైపుణ్యం అసమగ్రం, అసంపూర్ణం. కైప్లన్, సైడోక్‌లు వ్రాసిన "కాంప్రహెన్సివ్ టెక్స్ట్‌బుక్ అఫ్ సైకియాట్రీ'తో సహా సంబంధిత ఇతర గ్రంథాల పుటలు తిరగవేసిన ఎవరికైనా- వీరందరికీ స్నాయువుల క్రియ గురించి తెలిసినా, మనసులోని లోతైన పొరలగురించి తెలిసింది చాలా తక్కువని అర్థమవుతుంది. డేవిడ్‌జాన్ ఇంగ్లెబీ తన 'క్రిటికల్ సైకియాట్రీ' గ్రంథంలో ఈ శాస్త్రంలోని లోపాలను అంశాలవారీగా పేర్కొన్నారు.

ఈ నిపుణులు ఇచ్చే ఔషధాలు సైతం హానిరహితాలు కావు. ఇవి మానసిక రోగులపై దుష్ప్రభావం కలిగిస్తాయి. ఈ మందులు వాడకముందు రోగి మరింత ఆరోగ్యంగా ఉన్నాడని కుటుంబ సభ్యులు వ్యాఖ్యానించడం కద్దు.

ఇక సైకోథెరపీలోని అసమగ్రత విచిత్రమైనది. 21వ శతాబ్దపు హైటెక్ రోజులలో సైతం ఈ వైద్యులు పలువురు ఫ్రాయిడ్ సూత్రాలలోనే చిక్కుకుని ఉన్నారు. వీరికి చేతన మనస్సు గురించి మామూలు పరిజ్ఞానం ఉంటుంది. అచేతన మనస్సు గురించి సగం సగం అంచనా ఉంటుంది. మానవీయ చేతనలోని ఉత్పన్నత స్థాయిలపట్ల అశాస్త్రీయమైన ఉపేక్ష ఉంటుంది. కనుకనే, సైకోథెరపిస్టులు మనస్సుకు తగిలిన లోతైన గాయాల చికిత్సలో

**కలుషిత జీవితాలను అనుకరించ సాహసం అధ్యాత్మ.**

సాధారణంగా విఫలం అవుతున్నారు. పైపై గాయాలకు మాత్రం చికిత్స చేయగలుగుతున్నారు.

### ఆత్మను కోల్పోయిన సైకాలజీ

మానసిక చికిత్సలోని ఈ అసమగ్రతను పరమపూజ్య గురుదేవులు లోతుగా అవగాహన చేసుకున్నారు. నేటి మానవుని మానసిక వ్యధను, మానసిక అశాంతిని, మానసిక సంక్షోభాన్ని వారు తమ గుండె చప్పుళ్లలో అనుభూతి పొందారు. ఈ అనుభూతిని వారు చర్చలలో అఖండజ్యోతి వ్యాసాలలో వ్యక్తంచేసేవారు. పదే-పదే వారిలా చెప్పేవారు- మనిషి యొక్క మానసిక చేతన విషయంలో పాశ్చాత్యుల వైజ్ఞానిక దృక్పథం సరైనదే. ప్రయోగాలకు-పరీక్షలకూ వారు అనుసరించే విధానాలూ అభినందనీయాలే. అయితే వారి అవగాహన ఏకపక్షమైనది, అసమగ్రమైనది. సైకాలజీ తన 'సైక్'ను, అనగా తన ఆత్మను కోల్పోయింది.

పాశ్చాత్య మానసిక విజ్ఞాన శాస్త్రం ఆత్మను కోల్పోయి, వ్యవహరణమే సర్వస్వమని భావించింది. నేటి మానసికశాస్త్రవేత్తలు తమను బిహేవియరల్ సైంటిస్టులుగా వ్యవహార శాస్త్రవేత్తలుగా చెప్పుకోడానికి గర్విస్తున్నారు.

### గురుదేవుల స్వప్నం సాకారం

మానసిక శాస్త్రం మానసిక రోగాలను నయం చేయాలంటే, అది అధ్యాత్మతో, యోగ సాధనతో ముడిపడాలని యుగఋషి గురుదేవులు సూచించేవారు. మరోప్రక్క అధ్యాత్మ శాస్త్రంలో కూడ ధార్మికమైన వంకర దారులనుండి వెలికి వచ్చి, మానసిక శాస్త్రంలోని శాస్త్రీయతను గుర్తించాలి. ఈ విధంగా ఒక ఉన్నత స్థాయి మానసిక శాస్త్రం వికసిస్తుంది. మానసిక రోగాలు దూరమవుతాయి- అని వారు వివరించేవారు.

పూజ్య గురుదేవుల ఈ దివ్య స్వప్నాన్ని దేవసంస్కృతి విశ్వవిద్యాలయ మనోవిజ్ఞాన విభాగం నిజం చేయడం ప్రారంభించింది.

పరమపూజ్య గురుదేవులు మానవీయ చేతన రహస్యాలలోతులను తెలుసుకున్న అధ్యాత్మవేత్త. మహా శాస్త్రవేత్తకూడా. వారు చేసిన ఈ సమన్వయ సాధన దేవసంస్కృతి విశ్వవిద్యాలయ మనోవిజ్ఞాన విభాగంలో ఫలించి పుష్పిస్తోంది. ఈ విభాగంలో- ఆధునిక మానసిక చికిత్సను ఆయుర్వేదంతో, యోగంతో జోడించారు. ఈ విభాగపు దృక్పథం నూటికి నూరుపాళ్లు శాస్త్రీయం.

### యోగం - ఆయుర్వేదం - ఆధునిక ప్రక్రియలు

మానసిక చికిత్స పాఠ్య ప్రణాళిక విషయంలో ఈ ప్రయోగం భారతవర్షం అంతటిలో అన్నిటికన్న విలక్షణమైనది. అద్వితీయమైనది. ఈ విభాగంలో విద్యార్థులు ఆధునిక మనోవిజ్ఞాన గ్రంథాలనూ, పరిశోధన పత్రాలనూ అధ్యయనం చేస్తారు. ప్రాచీనమైన యోగ శాస్త్ర సంప్రదాయాన్నీ, ఆయుర్వేదంలోని మానసిక చికిత్సనుకూడ లోతుగా అధ్యయనం చేస్తారు. ఇందుకోసం వారు నాలుగు సెమిస్టర్‌లలో 16 పరీక్షలు, ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తి చేయాలి. చివరి సెమిస్టర్‌లో తప్పనిసరిగా మనోచికిత్సపై పరిశోధన చేయాలి.

ఈ పాఠ్యప్రణాళిక చదువుకే పరిమితం కాదు. విద్యార్థులందరూ మన మనోచికిత్సా కేంద్రంలో క్లినికల్ ప్రాక్టీస్ (రోగుల చికిత్స) కూడ చేయాలి. విభాగంలోని ఈ సైకోథెరపీ సెంటర్‌లో బయో ఫీడ్‌బ్యాక్, ఈ.ఈ.జీ మున్నగు అత్యంత ఆధునికమైన ఉపకరణాలు ఉన్నాయి. ఈ విద్యార్థులకు ఆధునిక చికిత్సా విజ్ఞానం, మనో విజ్ఞానం, ఆయుర్వేదం, యోగం, ప్రకృతి వైద్యం, ఆధ్యాత్మిక చికిత్సలలో నిపుణులు మార్గదర్శనం చేస్తున్నారు. కొద్ది కాలంలోనే ఇక్కడి విద్యార్థులూ, నిపుణులూ అద్భుత విజయాలూ సాధించారు. హిస్టీరియా, ఆబ్సెసివ్ కంపల్సివ్ న్యూరోసింగ్, హైపోకాండ్రియా, డిప్రెషన్, ఫోబియా,

**మౌనం అంటే అవసరంకాని విషయాలను భావించకుండా ఉండడం.**

నిద్రలేమి, చింత మున్నగు అనేక మానసిక రోగాల చికిత్సలో విజయం సాధించారు.

## సర్వసమగ్రమైన మానసిక చికిత్స

ఈ సాఫల్యానికి కారణం ఒకే ఒకటి- యుగఋషి గురుదేవులు ప్రతిపాదించిన సమగ్ర మానసిక చికిత్సా దృక్పథం. ఇక్కడికి వచ్చిన రోగులకు ఆత్యాధునిక వైజ్ఞానిక ప్రక్రియలద్వారా శారీరిక పరీక్షలూ, మానసిక పరీక్షలూ జరుపుతారు. ఆ తర్వాత ఆధ్యాత్మిక, యోగ ప్రక్రియలద్వారా, అవసరమైతే ఆయుర్వేద ఔషధాలను జోడించి చికిత్స చేస్తారు. మానసిక చికిత్సలోని మనోవైజ్ఞానిక ప్రక్రియలను కూడ వీటికి జోడిస్తారు. అయితే, ఈ ప్రక్రియలూ, పద్ధతులూ అన్నీ రోగి పరిస్థితిని బట్టి అమలు జరుపుతారు. రోగం నయం కావడం ముఖ్యం. ఇక్కడి నిపుణులూ విద్యార్థినీ విద్యార్థులూ చేసుకున్న దృఢ సంకల్పం ఇదే. ఇందుకోసం వారు స్వయంగా నియమబద్ధంగా ధ్యానం చేస్తున్నారు. తద్వారా తమ సంకల్ప బలాన్ని పెంచుకుంటున్నారు. జీవన విద్య విభాగం, ధ్యాన విభాగం ఇందులో వారికి మార్గదర్శనం చేస్తున్నాయి.

## మానసిక చికిత్సకు మహిమాలయం

ప్రస్తుతం ఈ మానసిక చికిత్సా విభాగం ఔట్‌పేషెంట్ విభాగం స్థాయిలో ఉంది. రోగుల నివాసానికి ఇప్పుడు వ్యవస్థ లేదు. అయితే నేమి? మానసిక రోగులకు ఈ అవకాశం ఒక వరదానంగా పనిచేస్తోంది. నిపుణులకు ఈ రంగంలో పరిశోధన కొనసాగించడానికి ఈ విభాగం కొత్త తలుపులు తెరుస్తోంది.

మానసిక చికిత్సను తమ వృత్తిగా స్వీకరించాలని కలలు కనేవారికీ, ఈ రంగంలో సత్ఫలితాలు సాధించి చూపాలని సంకల్పించేవారికి ఈ విభాగం కాశీతో, కాబాతో సమానం. దేశ విదేశాలలోని ఎందరెందరో నిపుణులూ, వైద్యరంగ ప్రముఖులూ ఈ వాస్తవాన్ని గుర్తించి ఉన్నారు. పరిశోధనను తమ జీవిత లక్ష్యంగా స్వీకరించిన ఇక్కడి విద్యార్థినీ విద్యార్థులు, నిపుణులూ మానసిక గాయాలను అద్భుతంగా చికిత్స చేస్తున్నారు. అంతే కాదు, యుగఋషి గురుదేవుల చింతన ఆధారంగా స్థానికమైన జీవన దృక్పథాన్ని కూడ అందిస్తున్నారు. ప్రతిభకు నూతన ద్వారాలు తెరుస్తున్నారు. ఇది అక్షర సత్యం. అనుభవంద్వారా రుజువైన సత్యం.

H H H

బ్రాహ్మీకాలం అనగా సూర్యోదయానికి ముందున్న రెండు హోరల కాలం.

## వార్తలు

# రాష్ట్రవ్యాప్తంగా గురుపూర్ణిమ ఉత్సవాలు

### నారాకోడూరు

నారాకోడూరు గాయత్రీ శక్తిపీఠంలో గురుపూర్ణిమ రోజున సాధకులు 5 బృందాలుగా యజ్ఞ కుండంలో ఆహుతులు సమర్పించారు. మూడు అక్షరాభ్యాసాలు, ఒక గురుదీక్ష సంస్కారం జరిగాయి.

హైదరాబాదు దిల్‌సుఖ్ నగర్‌లోని శ్రీ గద్దె శివకుమార్ దంపతులు 33 నెలలలో చెరి 24 లక్షల గాయత్రీ జపం పూర్తి చేసుకుని తమ జపానికి శక్తిపీఠంలో పూర్ణాహుతి జరిపారు. ఆ కార్యక్రమంలో 300 మంది పాల్గొన్నారు.

### చీరాల

చీరాల నిత్యగాయత్రీ యజ్ఞశాలలో జూన్ 30న శ్రీ శీరాం ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో శ్రీ వనమా రామచంద్ర రావు షష్టిపూర్తి చేసుకొని వానప్రస్థ సంస్కారం స్వీకరించారు.

జూలై 16న చీరాల హాండ్‌లూమ్స్ సంస్థ ప్రాంగణంలో దక్షిణాయన పుణ్యకాల ప్రారంభం సందర్భంలో రోజంతా గాయత్రి అఖండ జపం జరిగింది. 127 మంది 2,56,000లకు పైగా జపం చేశారు. 17న పూర్ణాహుతి జరిగింది.

### బాపట్ల

బాపట్లలో గురుపూర్ణిమ సందర్భంగా పంచకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 200 పాల్గొన్నారు. శ్రీయుతులు ఐ.మల్లేశ్వర రావు దంపతులు, రామసుబ్బారావు, నాగవరపు ప్రసాద్, మేడా సత్యనారాయణ, వక్కలగడ్డ భాస్కర్, శ్రీమతులు లక్ష్మీ సామ్రాజ్యం, స్వరాజ్యలక్ష్మి, సుందరమ్మ సహకరించారు.

### పిడుగురాళ్ల

పిడుగురాళ్ళలోని గాయత్రి జ్ఞానమందిరంలో గురుపూర్ణిమ సందర్భంగా పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 200 మంది పాల్గొన్నారు. శ్రీమతి అరుణమ్మ నిర్వహించారు. శ్రీయుతులు జాలకంటి సుబ్రహ్మణ్యం, ముడెల సత్యనారాయణ, కరాలపాటి సుబ్బారావు, దొడ్డా శ్రీనివాస రెడ్డి, గొడుగులూరి రంగయ్య, ఆత్మకూరి లక్ష్మీనరసింహమూర్తి, పసుమర్తి సుబ్రహ్మణ్యం, కట్టమంచి నాగేశ్వర రావు, పొట్టమూర్తి ఆంజనేయులు, కొత్త వెంకట్రామయ్య, మిట్టపల్లి శ్రీరామమూర్తి, మిట్టపల్లి వీరేశ్వరరావు, కపిలవాయి గోపాలరావు సహకరించారు.

### విజయవాడ

గురుపూర్ణిమ సందర్భంగా ముందురోజున అఖండ జపం జరిగింది. 40 మంది పాల్గొన్నారు. గురుపూర్ణిమ నాడు పంచకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. రెండు పుంసవన సంస్కారాలు, ఒక అన్న ప్రాశన సంస్కారం జరిగాయి. 150 మంది పాల్గొన్నారు. శ్రీయుతులు గురుమూర్తి యాదవ్, ఏ.వి.ఎన్.ఎస్.కుమార్ ఆధ్వర్యం వహించారు.

### విశాఖపట్నం

గురుపూర్ణిమ సందర్భంగా విశేష గాయత్రీ యజ్ఞం జరిగింది.

విశాఖపట్నం కార్యాలయం జరిపిన ఇతర కార్యక్రమాలు -

ఏప్రిల్ 15న ఉపనయనం, గురుదీక్ష మే 2న వేపగుంటలో 2 లక్షల గాయత్రీ మంత్రజపం పూర్ణాహుతి, మే 5న పిఠాపురం కాలనీలో గాయత్రీ యజ్ఞం, మే 8న ఉక్కు నగరం సెక్టర్ 8లో గాయత్రీ యజ్ఞం, మే 9న కంచరపాలెంలో గాయత్రీ యజ్ఞం. మే 10న అనకాపల్లిలో గాయత్రీ యజ్ఞం. మే 16న పెద్దగంట్యాడలో గాయత్రీ యజ్ఞం. 18న ఉక్కునగరంలో గాయత్రీ యజ్ఞం, జూన్ 8న చోడవరం మండలం గాంధీగ్రామ్‌లో పంచకుండీ యజ్ఞం, దీపయజ్ఞం 200 మంది పాల్గొన్నారు. జూన్ 30న పిఠాపురం కాలనీలో గాయత్రీ యజ్ఞం.

### భీమిలి

గురుపూర్ణిమ రోజున భీమిలిలోని దుర్గా గాయత్రి శక్తిపీఠంలో అఖండ జపం, త్రికుండ గాయత్రీ యజ్ఞం జరిగాయి, 300 మంది పాల్గొన్నారు. 12 మంది గురుదీక్ష తీసుకున్నారు. డా॥ చంద్రశేఖరం ప్రసంగించారు. శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ ఉపేంద్ర, శ్రీమతి భారతి యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు గణేశ్, రామకృష్ణ, గణపతి సహకరించారు.

**శాస్త్రం అంటే శాసించి రక్షించేది.**

## పార్వతీపురం

గురుపూర్ణిమ రోజున పార్వతీపురంలో దీపయజ్ఞం జరిగింది. జూలై 31న అధిక శ్రావణ పూర్ణిమ సందర్భంగా దీపయజ్ఞం జరిగింది. శ్రీమతి వసుంధరా దేవి కార్యక్రమాలను సంచాలన చేశారు.

## కవిటి అగ్రహారం

శ్రీకాకుళం జిల్లా కవిటి అగ్రహారంలో గాయత్రీ ప్రజ్ఞాపీఠం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 7న కలశయాత్ర, గీతా దీపయజ్ఞం జరిగాయి. 8న పంచకుండీ యజ్ఞం, గురుదీక్ష, ఉపనయనం జరిగాయి. డా॥ తుమ్మూరి ఆధ్వర్యం వహించారు.

## రావాడ

రావాడలోని గాయత్రీ తపోభూమిలో గురుపూర్ణిమ సందర్భంగా ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 24 లక్షల గాయత్రీ మంత్రలేఖనం పూర్ణాహుతి జరిగింది. శ్రీ సుదర్శన బ్రహ్మ అగ్నిహోత్రి, శ్రీమతి సుభాషిణి, శ్రీ పి.వెంకటరమణ మూర్తి, శ్రీమతి వసుంధరా దేవి ఆధ్వర్యం వహించారు.

## తిరుపతి

గురుపూర్ణిమ సందర్భంగా తిరుపతిలో జూలై 2న శాసనసభ్యులు శ్రీవెంకటరమణ ఆధ్వర్యంలో పంచకుండీ యజ్ఞం, దీపయజ్ఞం జరిగాయి. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

గాయత్రీ జయంతి సందర్భంగా మే 29న తిరుపతిలో పంచకుండీ యజ్ఞం, దీప యజ్ఞం జరిగాయి.

## బిడికన్నె

మెదక్ జిల్లా జహీరాబాదు తాలుకా ఝరాసంఘం మండలం బిడికన్నె గ్రామంలో జూన్ 27న మూడు కుండముల యజ్ఞం జరిగింది. శ్రీకె.ఎల్.నరసింహమూర్తి ఆధ్వర్యం వహించారు. 200 మంది పాల్గొన్నారు. ఆ సందర్భంగా పండ్ల డాక్టరు శ్రీశ్యాం జోషి 300 మందిని పరీక్షించి మందులు సూచించారు.

H H H

**ఫలములను ఆశ్రయించకుండా చేయవలసిన పనులను చేసేవాడు సన్యాసి లేక 'యోగి'.**